PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 212 | విజయవాడ, ఆదివారం 5 మార్చి 2023 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 5 March 2023 | Rs

'కౌలు'కు వేటు

- క్రమేపీ తగ్గుతున్న రైతుల సంఖ్య
- మూడేళ్లలో 33 వేలమంది తగ్గింపు

లోపలి పేజీల్లో..



ఘనంగా మహిళల ప్రిమియర్ లీగ్ ప్రారంభం

- అలరించిన ఎపి ఢిల్లాన్, కృతి, కియరా నృత్యాలు
- తొలి మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ గెలుపు

లోపలి పేజీల్లో..

ఉద్యోగ, ఉపాధ్యాయులపై

వేధింపులు మానుకోండి

- ప్రభుత్వానికి సిపిఎం, సిపిఐ డిమాండ్
- 9, 10 తేదీల్లో ధర్నాలకు పిలుపు
- పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి
- సకాలంలో జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వ్యవహరించడాన్ని సిపిఎం, సిపిఐ రాష్ట్రకమిటీలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వ వేధింపులు మానుకోవాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని, సిపిఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక చర్యలను నిరసిస్తూ వారికి మద్దతుగా మార్చి 9,10 తేదీల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోపు సిపిఎస్ రద్దు చేస్తానని సిఎం జగన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీని అమలు చేయకపోగా సంవత్సర కాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు సకాలంలో చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. ఈ నెల ఇప్పటికీ 60 శాతం మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించలేదని పేర్కొన్నారు. డిఎలు చెల్లించడం లేదని, డిఎ బకాయిల ఊసెత్తడం లేదని విమర్శించారు. ఆఖరికి వారి ఖాతాల్లో నిల్వ ఉన్న సొమ్ము నుండి పెట్టుకునే లోన్లు కూడా సుమారు మూడువేల కోట్ల రూపాయలు రెండు సంవత్సరాలుగా చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. సిపిఎస్ రద్దు కోసం పోరాడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులపై తీవ్ర నిర్బంధాన్ని, అణచివేతను ప్రయోగిస్తూ అరెస్టులు, షోకాజ్ నోటీసులతో నిరంతరం బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొన్నారని షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఎస్‌సిఆర్‌టి డైరెక్టరుగా ఉన్న ప్రతాప రెడ్డి కడప ఆర్‌జెడి సహా కొందరు ఉన్నతాధికారులు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతుంటే కట్టడి చేయలేని ప్రభుత్వం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయులను పాల్గొనకూడదని ఆదేశించడం గర్హనీయమని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలకు పిలిచి మాట్లాడి సమస్యలను పరిష్కారం చేయాల్సిన ప్రభుత్వం భయపెట్టి నిర్బంధాన్ని ప్రయోగించడం సరికాదని తెలిపారు. పాఠశాలల పర్యవేక్షణ పేరుతో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను మానసికంగా వేధింపులు గురిచేస్తుంటే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా వస్తుందో ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు ధోరణిని విడనాడి సిపిఎస్ రద్దుతో సహా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణం నెరవేర్చాలని కోరారు. ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులను మానసిక వేధింపులకు గురిచేయడాన్ని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు.


ఎంఒయుల అమలుకు

మానిటరింగ్ కమిటీ

- ప్రతి వారం సమీక్ష
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ముగింపులో ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వానికి, పారిశ్రామికవేత్తలకు మధ్య కుదిరిన ఎంఒయుల అమలుకు మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ కమిటీలో ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఎంఒయుల అమలుపై ఈ కమిటీ ప్రతి వారం చెక్ చేస్తుందని, వ్యాపారాల్లో ఉండే క్లిష్టతలపై స్పష్టత వచ్చే వరకూ పెట్టుబడిదారులకు సాయపడుతుందని ప్రకటించారు. గతంలో మాదిరిగా ఎంఒయులపై సంతకాలు చేసి వదిలేసే ప్రభుత్వం తమది కాదని, అమలు చేసే వరకూ వెళతామని తెలిపారు. విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో రెండు రోజులపాటు జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానం కాబోతుందన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ విజయవంతమైనట్లు ప్రకటించారు. రెండు రోజుల్లో మొత్తం 15 సెషన్లు నడిచాయని, వందమంది వక్తలు 20 రంగాలపై ప్రసంగించారని తెలిపారు. రూ.13,05,663 కోట్ల పెట్టుబడులతో 352 ఎంఒయులు జరిగాయని, వీటిద్వారా 6,03,223 మందికి ఉపాధి కలుగనుందని వెల్లడించారు. ఎనర్జీ రంగంలోనే రూ.8.84 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 40 అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నామని, ఈ రంగంలోనే 1,90,268 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఐటి రంగంలో 56 ఒప్పందాలను రూ.25,587 కోట్లకు కుదుర్చుకున్నామని, 1,04,442 మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయని, టూరిజంలో 117 ఎంఒయులు ద్వారా రూ.22,096 కోట్లతో 30,787 మందికి ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో



పారిశ్రామిక యూనిట్లను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి, చిత్రంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సోనోవాల్, రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్

గణనీయంగా పెట్టుబడులు రానున్నాయన్నారు. రెండో రోజు 1.17 లక్షల కోట్లతో 260 ఒప్పందాలు చేసుకున్నామని, తద్వారా 30,787 మందికి ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు.

రూ.3,841 కోట్ల విలువైన 14 యూనిట్లు ప్రారంభం

రెండో రోజు సదస్సులో రూ.3,841 కోట్ల విలువైన 14 పారిశ్రామిక యూనిట్లను సమ్మిట్ వేదికపై పారిశ్రామిక ప్రతినిధుల సమక్షంలో వర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభించారు. వీటివల్ల 9,108 మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. శ్రీసిటీలోగల కింబర్లే క్లార్క్, బ్లూస్టార్, క్లైమాటెక్, విశాఖపట్నం జిల్లాలోని లారస్ ల్యాబ్, హేవెల్స్ ఇండియా, శారదా మెటల్స్, అల్లోయ్స్ కంపెనీలు ఈ యూనిట్లలో పెట్టుబడులు పెట్టాయని తెలిపారు.

ఎపికి నిరంతరం కేంద్రం మద్దతు

కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, శర్బానంద్ సోనోవాల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆర్థిక సాయం అందిస్తోందని, ప్రాజెక్టులు మంజూరు చేస్తోందని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాలు, ఆయుష్ శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రెండో రోజు కార్యక్రమంలో సోనోవాల్ మాట్లాడుతూ ఎపిలో ఐదు ఫిషింగ్ హార్బర్లకు రూ.1500 కోట్లు మంజూరు చేశామన్నారు. జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ సముద్ర ఉత్పత్తులు, రవాణాలో ఎపి పోటీ పడుతోందని తెలిపారు. రాష్ట్రంలో 72 ప్రపంచ స్థాయి రైల్వే స్టేషన్లను నిర్మిస్తామని, రాష్ట్రం గుండా మూడు పారిశ్రామిక కారిడార్లు వెళ్తున్నాయని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ సౌకర్యం లేదని పేర్కొన్నారు. ఎపి స్మార్ట్ సిటీ కింద విశాఖకు రూ.3 వేల కోట్లు ఇచ్చామన్నారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశానికైనా మౌలిక వసతులు అందించే సత్తా ఎపికి ఉందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక శక్తికి గ్రోత్ ఇంజిన్‌లా పని చేసేందుకు అనేక అవకాశాలు ఈ సమ్మిట్‌తో రానున్నాయన్నారు. ఎంఎస్‌ఎంఇలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి మాట్లాడుతూ 21 రోజుల్లో అన్ని పరిశ్రమల అనుమతులూ ఇవ్వనున్నామని, 24 ప్రభుత్వ శాఖలకు చెందిన 96 సేవలను ఒకేచోట చేర్చే సింగిల్ విండోను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.

సబ్సిడీ ఎరువులకు

కులం లింకు

- కేంద్ర ఎరువుల మంత్రిత్వశాఖ ఉత్తర్వులు
- ఇది అనాలోచితం: ఎఐకెఎస్

న్యూఢిల్లీ : సబ్సిడీ ఎరువులు కావాలంటే కులాన్ని నమోదు చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ వివాదాస్పద ఉత్తర్వులు జారీ చేసింది. ఎరువుల రాయితీలు పొందడానికి ఎరువుల దుకాణాల్లో పాయింట్ ఆఫ్ సేల్ (పిఒఎస్) మెషీన్లను ప్రవేశపెట్టి.. 'కులం' తప్పనిసరిగా నమోదు చేయాలన్న కేంద్ర ఉత్తర్వులు రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇది మధ్యతరగతి, పేద రైతుల సబ్సిడీలపై ప్రభావం చూపుతుందని ఎఐకెఎస్ విమర్శించింది. రైతులకు అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయం ప్రభుత్వ, ప్రయివేట్ రిటైల్ దుకాణాల్లో అమర్చబడిన పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) పరికరాలతో చేయబడుతుంది. ఎరువుల శాఖ ఉత్తర్వుల ప్రకారం ఆధార్ కార్డులు, కెసిసి, ఓటర్ ఐడీలతో లబ్ధిదారులను గుర్తిస్తారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా దాదాపు 2.60 లక్షల పిఒఎస్ పరికరాలను ఇప్పటికే ఇన్‌స్టాల్ చేశారు. కుల ఎంపికలుగా జనరల్, ఇతర వెనుకబడిన తరగతి (ఒబిసి), షెడ్యూల్డ్ కులం (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ)లను పేర్కొంది. ఎరువుల విక్రయ సమయంలో వాటిలో ఒకదాన్ని ఎంచుకోవడం తప్పనిసరి అని ఎరువుల మంత్రిత్వ శాఖ పేర్కొంది.

ఎఐకెఎస్ ఖండన

ఎరువుల దుకాణాల్లోని పాయింట్ ఆఫ్ సేల్ (పిఒఎస్) మెషీన్‌ల వద్ద కులానికి సంబంధించిన సమాచారాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలన్న నిర్ణయాన్ని ఎఐకెఎస్ తీవ్రంగా ఖండించింది. కిసాన్‌సభ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూకృష్ణన్ శనివారం నాడు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎరువుల రాయితీని పొందడం కోసం పాయింట్ ఆఫ్ సేల్ (ఓపీఎస్) మెషీన్ల వద్ద తప్పనిసరిగా కులాన్ని నమోదు చేయాలంటూ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం పూర్తిగా అనాలోచితమైనదని ఆ ప్రకటన పేర్కొంది. ప్రభుత్వ ఈ మిగతా 2లో

రూ.26 లక్షల నగదు పట్టివేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గన్నవరం గ్రామానికి చెందిన కంచిపాటి రమేష్ నాయుడు అక్రమంగా తరలిస్తున్న రూ.26.85 లక్షల నగదును టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, ఎంవిపి పోలీసులు శనివారం పట్టుకున్నారు. వెంకోజీపాలెంలోని అమ్మ ఆస్పత్రి ఎదురుగా ఉన్న లవకుశ అపార్టుమెంట్‌లో ఈ నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఈ నగదు తరలిస్తున్నట్లు సమాచారం. టిడిపి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు అనుకూలంగా నియోజకవర్గాల వారీగా ప్రచారం, ఇతర అవసరాలకు వినియోగించేందుకు ఈ నగదును తరలిస్తున్నట్లు తెలుస్తోంది. విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.



గుంటూరు ప్రభుత్వాస్పత్రిలోని నాట్కో కేన్సర్ సెంటర్‌ను సందర్శిస్తున్న డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

రాష్ట్రంలో 4 కేన్సర్ ఆస్పత్రుల నిర్మాణం

- ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు వెల్లడి

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో తిరుపతి, కర్నూలు, విశాఖపట్నం, గుంటూరు ప్రాంతాల్లో కేన్సర్ కేర్ ఆస్పత్రులను ప్రభుత్వం నిర్మిస్తుందని ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారుడు, కేన్సర్ చికిత్సల పితామహుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలిపారు. కేన్సర్ రోగులకు అత్యుత్తమ చికిత్స అందించాలన్నదే ఉద్దేశంతో తిరుపతిలో బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకలాజీ కేర్ సెంటర్‌ను దసరా నాటికి అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలోని నాట్కో కేన్సర్ సెంటర్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సెంటర్‌లోని పలు విభాగాలను సందర్శించి వాటి పని తీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో డాక్టర్ దత్తాత్రేయుడు మాట్లాడుతూ కేన్సర్ రోగులు చికిత్స కోసం ఇతర రాష్ట్రాల వైపు చూడకుండా రాష్ట్రంలోనే చికిత్స అందించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో కేన్సర్ రోగులకు చికిత్స అంటేనే ఖరీదైనా వైద్యంగా మారిందన్నారు. కేన్సర్ రోగులకు ఉత్తమ చికిత్స అందించి ప్రాణాలను కాపాడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రోగులపై భారం పడకుండా ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల కేన్సర్ చికిత్సలనూ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని కేన్సర్ కేంద్రాల్లోని యంత్రాలను అప్ గ్రేడ్ చేస్తున్నామని చెప్పారు. పాన్, గుట్కా తదితర పొగాకు సంబంధిత పదార్థాలను తీసుకోవడం వల్లనే అనేకమంది కేన్సర్ బారిన పడుతున్నారని ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అక్రమాలు

- టిడిపి లీగల్ సెల్ సదస్సులో చంద్రబాబు

లోపలి పేజీల్లో..

మనీలా : మిలటరీ యూనిఫారాల్లో వచ్చిన సాయుధులు ఫిలిప్పీన్స్‌లోని నెగ్రో ఓరియంటల్ రాష్ట్ర గవర్నర్ రోల్ డాగ్మోపై తుపాకీ గుళ్ల వర్షం కురిపించారు. తీవ్రంగా గాయపడిన ఆయనను ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.. ఈ కాల్పుల్లో గవర్నరుతో బాటు మరో ఐదుగురు పౌరులు కూడా చనిపోయారు. ఈ ఘటనతో ప్రమేయముందన్న అనుమానంతో ముగ్గురు వ్యక్తులను ఫిలిప్పీన్స్ పోలీసులు అరెస్టు చేశారు. గవర్నరు తన నివాసంలో గ్రామస్తులతో

ఫిలిప్పీన్స్ గవర్నర్ కాల్చివేత

- మరో ఐదుగురు పౌరులు కూడా
- మిలటరీ యూనిఫారాల్లో వచ్చి పట్టపగలే సాయుధుల కాల్పులు

మాట్లాడుతుండగా, ఈ దాడి జరిగింది. ఆరుగురు సాయుధులు మూడు ఎస్‌యువి వాహనాల్లో వచ్చి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. హింసాత్మక రాజకీయ ఘర్షణలకు నెగ్రో ప్రావిన్స్ పెట్టింది పేరు.

కాల్పుల్లో మరణించిన గవర్నర్ భార్య, పాంపలోనా పట్టణ మేయర్ జానిస్ డాగ్మో ఫేస్‌బుక్‌లో వీడియో పోస్టు చేస్తూ కాల్పుల్లో ఆ ఐదుగురు గ్రామస్తులు కూడా మరణించారని తెలిపారు. అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ ఈ దాడిని ఖండించారు. ఇందుకు కారకులైన వారిని పట్టుకుని తీరతామని ఆయన స్పష్టం చేశారు.

మాస్టారు గుండె ఆగింది

- తరగతి గదిలోనే కుప్పకూలిన ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి- చీరాల (బాపట్ల జిల్లా)

విద్యార్థులకు పాఠాలు చెబుతూ గుండెపోటుతో తరగతి గదిలోనే ఉపాధ్యాయుడు మృతి చెందారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం వాకావారిపాలెం ప్రభుత్వ పాఠశాలలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి తోటి ఉపాధ్యాయుల కథనం ప్రకారం... అద్దంకి నియోజకవర్గం జె.పంగులూరు మండలం పంగులూరు గ్రామానికి చెందిన పాలపర్తి వెర్రిబాబు (45) వేటపాలెం మండలం వాకావారిపాలెం ప్రభుత్వ పాఠశాలలో సెకెండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం నాల్గో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తుండగా గుండెపోటు రావడంతో తన కుర్చీలోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని ఇతర ఉపాధ్యాయులకు విద్యార్థులు తెలియజేశారు. ఉపాధ్యాయులు తరగతి గదికి చేరుకొని 108కు సమాచారం అందించారు. సిపిఆర్ చేసినా ఎలాంటి ఫలితమూ కనిపించలేదు. వైద్య సిబ్బంది వచ్చి పరీక్షించి వెర్రిబాబు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు పోలీసులు తరలించారు. వెర్రిబాబుకు భార్య పాలపర్తి రాజామణి పంగులూరు మండలం కొండమూడులో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్నారు. వారి కుమారుడు లక్ష్మీసందీప్ మెడిసిన్, కుమార్తె లక్ష్మీ సరియు టిటిసి చదువుతున్నారు.



పాలపర్తి వెర్రిబాబు(ఫైల్)



ఐప్సో జాతీయ మహాసభ ప్రారంభిస్తున్న ఆర్.ఎస్ చీమా

నాటో జోక్యం వద్దు

- రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై ఐప్సో
- ప్రారంభమైన శాంతిసంఘం మహాసభ

ఛండీగఢ్ : ఏడాదికిపైగా సాగుతున్న రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో నాటో జోక్యం చేసుకోవడం ఎంతమాత్రం తగదని ఐప్సో (అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం) పేర్కొంది. ఐప్సో జాతీయ మహాసభ ఛండీగఢ్‌లోని పంజాబ్, హర్యానా బార్ కౌన్సిల్‌హాల్‌లో శనివారం ప్రారంభమైంది. తొలిరోజు సమావేశంలో ప్రసంగించిన వక్తలు శాంతియుతంగా పరిష్కరించడానికి బదులుగా సామ్రాజ్యవాద నాటో దేశాలు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరింత పెచ్చరిల్లేలా వ్యవరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మహాసభకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభ ప్రారంభ సూచకంతా సభా ప్రాంగణం వద్ద జాతీయ పతాకాన్ని ఆహ్వానసంఘం ఛైర్మన్ ప్రొఫెసర్ హెచ్ ఎస్ సిద్ధు, ఐప్సో పతాకాన్ని ప్రపంచ శాంతి సంఘం అధ్యక్షులు పల్లబ్‌సేన్ గుప్తా ఆవిష్కరించారు. మహాసభను పంజాబ్, హర్యానా రాష్ట్రాల హైకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్.ఎస్ చీమా లాంఛనంగా ప్రారంభించారు. వియత్నాం, క్యూబా, అమెరికా, నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాల నుండి శాంతి ఉద్యమ నాయకులు పాల్గొని సౌహార్ద సందేశం ఇచ్చారు. అంతకుముందు పల్లబ్‌సేన్ గుప్తా మాట్లాడుతూ అణు యుద్ధం వస్తే మానవాళి వినాశనం తప్పదని అన్నారు. ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య నెలకొన్న యుద్ధవాతావరణం సమసిపోవాలని, శాంతియుత వాతావరణం నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. ప్రొఫెసర్ హెచ్‌ఎస్ సిద్ధు మాట్లాడుతూ ప్రస్తుతం అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం ఆవిర్భవించిన నేపథ్యాన్ని తెలిపారు. ఇప్పటిదాకా ఐప్సోకు నాయకత్వం వహించిన వారి పేర్లను ప్రస్తావిస్తూ వారు చేసిన కృషిని వివరించారు. ఆర్‌ఎస్ చీమా మాట్లాడుతూ అంతర్జాతీయంగా నెలకొన్న సామ్రాజ్యవాదం, ఫాసిజం, మతోన్మాదం, ఆర్థిక సంక్షోభం, వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రపంచ మానవాళికి శాంతిభద్రతల అంశం అత్యంత కీలకంగా మారిందన్నారు. మధ్యాహ్నం నుండి జరిగిన ప్రతినిధుల సభలో ఐప్సో జాతీయ కార్యదర్శి అరుణ్‌కుమార్ శాంతి ఉద్యమంతో పాటు ప్రగతి శీల ఉద్యమంలో సేవలు అందించి, మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ హిందుత్వ అజెండాను అమలు చేస్తోందని అన్నారు. విద్యారంగాన్ని కాషాయికరించడానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. 'పంజాబ్‌లో నాటి, నేటి పరిస్థితులు' అనే అంశంపై సాయంత్రం సదస్సు నిర్వహించారు. పంజాబ్ సాంప్రదాయాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఐప్సో జాతీయ కమిటీ సభ్యులు సుధాకర్, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రం నుండి నరమాల సతీష్‌కుమార్, మహంకాళి సుబ్బారావు, పిచ్చయ, సాయికుమార్, అరుణ్‌కుమార్, ఇమాము సాహెబ్ తదితరులు మహాసభకు హాజరైనారు.



జెసిబిలతో ఇళ్లు కూల్చివేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

ఇప్పటంలో మళ్లీ కూల్చివేతలు

నిరసనకు దిగిన జనసేన నాయకుల అరెస్టు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటిఎంసి) పరిధిలోని ఇప్పటం గ్రామంలో రోడ్డు విస్తరణ పేరుతో కూల్చివేత పనులు అధికారులు మళ్లీ చేశారు. శనివారం రెండు జెసిబిలతో కూల్చివేత పనులు ప్రారంభిస్తున్న క్రమంలో స్థానికులు వాటిని అడ్డుకొని నిరసన తెలిపారు. అయినా, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెనక్కి తగ్గలేదు. స్థానికుల నిరసనల మధ్యే పోలీసుల పహారాతో పాక్షికంగా 12 ఇళ్లను కూల్చివేశారు. జనసేన పార్టీ ఇప్పటం గ్రామ అధ్యక్షులు నరసింహారావు ఇల్లును కూల్చేందుకు అధికారులు ప్రయత్నించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆటో, బస్సు సౌకర్యంలేని గ్రామంలో రోడ్డును 70 అడుగులకు విస్తరించి ఏం చేస్తారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు గతేడాది డిసెంబర్ మూడున జెసిబిలతో 15 కూల్చారు.

జనసేన నిరసన దీక్ష

జనసేన పార్టీ నాయకులు శనివారం ఇప్పటం గ్రామాన్ని సందర్శించారు. కూల్చివేతలు జరిగిన చోట స్థానిక రామాలయం మిగతా 2లో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో

పిడిఎఫ్ అభ్యర్థుల విజయానికి కృషి

- ఏఐటియుసి పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 13న జరగనున్న శాసనమండలి ఎన్నికల్లో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల్లో పోటీచేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులతో పాటు రాయలసీమ పశ్చిమ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి పోటీచేస్తున్న కత్తి నరసింహారెడ్డి విజయానికి ఏఐటియుసి శ్రేణులు కృషిచేయాలని రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. శాసనమండలిలో నిరంతరం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికవర్గం తరపున వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తూ బయట జరుగుతున్న పోరాటాలకు మద్దతిస్తున్న వారిని గెలిపించుకోవాలని పేర్కొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలను కూడా బిజెపి, వైసిపి, టిడిపి రాజకీయం చేస్తున్నాయని, డబ్బును వెదజల్లుతున్నాయని తెలిపారు. అటువంటి వారు శాసనమండలిలో ఏం మాట్లాడతారో ఆలోచించాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు సకాలంలో వేతనాలు, బిల్లులు

- పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వంట సిబ్బంది, ఆయాలకు చెల్లించే గౌరవ వేతనాలను, బిల్లులను నిర్ణీత సమయంలో పంపాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వంట సిబ్బంది, ఆయాల గౌరవ వేతనాల బిల్లుల పరిశీలన, చెల్లింపుల కోసం ఐదు సూచనలను పొందుపరిచిన్నట్లు తెలిపారు.

వీటిని ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి లేదా డిప్యూటీ విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, మధ్యాహ్న భోజన పథకం సంచాలకులు పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఐదంచెల్లో వాస్తవానికి ఆలస్యమయ్యే వీలున్నా..అందరూ బాధ్యతలను వేగవంతంగా నిర్వహించాలని నిర్ణీత కాలంలో వేతనాలు, బిల్లుల చెల్లింపులు జరిగేలా చూడాలని ఆయన నిర్దేశించారు. ఈ ప్రక్రియలో తప్పులకు అవకాశం ఇవ్వరాదని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

అదానీ, అంబానీ మోడీ దత్తపుత్రులు

- తెలంగాణ మంత్రి జగదీశ్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

'మోడీ మాయాజాలం బట్టబయలు అయింది.. మోడీ దత్త పుత్రులు అంబానీ అదానే'నని తెలంగాణ విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అనుచరులకు ప్రభుత్వ సొమ్ము 19 లక్షల కోట్లు ధారాదత్తం చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా టిఎస్‌జిఒఎస్ రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. వాటితో పాటుగా అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఒఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ఎన్నికల భయం పట్టుకుంది

- మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఎన్నికల పొత్తుపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి భయం పట్టుకుందని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గుంటూరులోని తన నివాసంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాల దమ్ము గురించి మాట్లాడే వ్యక్తి ముందు తన సత్తా ఏమిటో వచ్చే ఎన్నికల్లో తేల్చుకోవాలన్నారు. టిడిపి, జనసేన కలిసి పోటీ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.


జగన్ ప్రభుత్వం లిక్కర్‌కు, అక్రమ ఇసుక మైనింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందని విమర్శించారు. ఎన్నికలకు సంవత్సరం ఉందనగా ఇప్పుడు పెట్టుబడుల అంశం గుర్తుకు రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే సంతోషమేగానీ నాలుగేళ్లుగా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. విశాఖలో పెట్టుబడిదారులకు అబద్ధాలు చెప్పి మోసం చేస్తున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టులో రాజధాని అంశం విచారణలో ఉండగా విశాఖలో పరిపాలన రాజధాని త్వరలో వస్తుందని చెప్పి పారిశ్రామికవేత్తలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. తాడేపల్లి మండలం ఇప్పటంలో ప్రజల మీద కక్ష సాధింపు జరుగుతోందని తెలిపారు. ఈ ప్రభుత్వం కులగొట్టడాలతోనే పరిపాలన ప్రారంభమైందని దుయ్యబట్టారు. పవన్ కల్యాణ్ సభకు స్థలం ఇవ్వడం ఇప్పటం ప్రజలు చేసిన తప్పా అని ప్రశ్నించారు.

సమర్ధ నాయకత్వం.. సమగ్ర విధానం

- పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ అనువైన ప్రదేశం
- పలువురు పెట్టుబడిదారుల వ్యాఖ్య

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆర్థిక రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆంధ్రప్రదేశ్‌లో సమర్ధ నాయకత్వం, వ్యాపారాలను సులభతరం చేసే సమగ్ర విధానం ప్రభుత్వం వద్ద ఉన్నాయని పలువురు పారిశ్రామికవేత్తలు కొనియాడారు. రెండో రోజు గ్లోబల్ సమ్మిట్‌లో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. ఔషధ రంగంలో రాష్ట్రానికి ఉన్న సాంప్రదాయ బలాన్ని ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. మెడ్‌టెక్ జోన్ మంచి ఆవిష్కరణలతో పనిచేస్తోందని తెలిపారు. లారస్ ల్యాబ్ సిఇఒ సత్యనారాయణ చావా మాట్లాడుతూ.. విభజన తర్వాత ఎపి దేశానికి బల్క్ డ్రగ్ కేపిటల్‌గా మారిందన్నారు. రాష్ట్రంలో కొన్ని అతిపెద్ద ఎపిఐ యూనిట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ఏ రంగంలోనూ మార్కెట్ అవసరం లేదని, పారిశ్రామిక ప్రాంతాలు నెలకొల్పితే పెట్టుబడులు అవే వస్తాయని అన్నారు. హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎమ్‌డి డాక్టర్ వంశీకృష్ణ బండి మాట్లాడుతూ.. కోవిడ్ అనంతరం ప్రపంచంలోని అనేక దేశాలు ఆంధ్రప్రదేశ్‌ను ఫార్మాస్యూటికల్ రంగంలో భాగస్వామిగా ఎంపిక చేసుకోవడం వెనుక ఇక్కడ సమర్థ నాయకత్వం ఉండటమే కారణమని పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లలో హెటిరో నుంచి రూ.1000 కోట్ల పెట్టుబడిని రాష్ట్రంలో పెట్టనున్నామని, మూడు వేల మందికి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. అపాచీ హిల్‌టాప్ గ్రూప్ ఇండియా ఆపరేషన్స్ డైరెక్టర్ అండ్ గ్రూప్ హెడ్ సెర్గియో లీ మాట్లాడుతూ.. తన పెట్టుబడి ప్రణాళిక ఎలా ఉండబోతుందో వెల్లడించారు. తిరుపతిలో పదివేల మందికి ఉద్యోగాలు కల్పించేలా రూ.వంద మిలియన్ డాలర్ల పెట్టుబడిని పెడుతున్నామని ప్రకటించారు. సిఐఐ సదరన్ రీజియన్ చైర్‌పర్సన్ సుచిత్రా కె ఎల్లా మాట్లాడుతూ.. సామాజిక సూచికలను మెరుగుపరచడంలో ఎపి ప్రభుత్వం సమర్థమైన విధానం తీసుకుందని కొనియాడారు. ఆసియా పసిఫిక్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.సంతానం గోబైన్ మాట్లాడుతూ.. విశ్వసనీయతలో ఎపి సరైన పంథాతో ఉందన్నారు. పరిశ్రమలకు వంద శాతం శక్తిని అందించగల సత్తా ఉన్న ఏకైక రాష్ట్రం అని కొనియాడారు. ఆవాడ గ్రూప్ చైర్మన్ వినీత్ మిట్టల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో హైడ్రో ప్రాజెక్టుల కోసం స్థలాలను గుర్తించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, హరిత శక్తి, పరివర్తనలో దేశంలోనే ఎపి ఒక శక్తిగా మారనుందని అన్నారు. సోలార్, విండ్ పవర్‌లో ఆంధ్రప్రదేశ్ మంచి కృషి చేస్తోందని పేర్కొన్నారు.. నోవా ఎయిర్ సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్ గజానన్ నబర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తమ కంపెనీ ఆసక్తి కనబరుస్తోందన్నారు.



సమ్మిట్‌లో మాట్లాతున్న లారస్ ల్యాబ్ సిఇఒ సత్యనారాయణ చావా



ప్రమాదానికి గురైన కార్లు

రేవంత్‌రెడ్డి పాదయాత్రలో ప్రమాదం

- ఒకదానికొకటి ఢీకొన్న కాన్వయ్‌లోని ఆరు వాహనాలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరుగుతున్న పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి హాత్ సే హాత్ జోడో యాత్రలో శనివారం ప్రమాదం జరిగింది. ఆయన కాన్వాయ్‌లోని వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. వాటిల్లో ప్రయాణిస్తున్న పలువురు నాయకులు, విలేకరులకు స్వల్ప గాయాలయ్యాయి. గంభీరావుపేట మండలంలోని సముద్రలింగపూర్ గ్రామ శివారులో ప్రాంతంలో 9వ ప్యాకేజీ కెనాల్ పనులను రేవంత్ రెడ్డి పరిశీలించడానికి వెళుతున్న క్రమంలో కాన్వాయ్‌లో వేగంగా ముందు వెళుతున్న వాహనం డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొట్టాయి. ఇందులో రేవంత్ రెడ్డికి సంబంధించిన నాలుగు వాహనాలు, న్యూస్ చానళ్లకు చెందిన రెండు వాహనాలు ఉన్నాయి. ఈ ప్రమాదంలో కారులో బెలూన్ ఓపెన్ కావడంతో ప్రయాణిస్తున్నవారు స్వల్ప గాయాలయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

రేపటినుంచి తెలంగాణ ఎడ్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ

- నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో బిఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్-2023 నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో ఎడ్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు దరఖాస్తు ఫీజు రూ.500, ఇతరులు రూ.700 చెల్లించాలి. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు ఏప్రిల్ 20వ తేదీ వరకు అవకాశమున్నది. ఆలస్య రుసుం రూ.250తో అదేనెల 25 వరకు దరఖాస్తు చేయొచ్చు. దరఖాస్తుల సవరణకు చివరి తేదీ ఏప్రిల్ 30 వరకు ఉంటుంది. హాల్‌టికెట్లను మే ఐదో తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 18న ఎడ్‌సెట్ రాతపరీక్షను నిర్వహిస్తారు. పరీక్షా సిలబస్, ఇతర వివరాలకు https://edcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమం ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, లో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సిహెచ్ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ టి కృష్ణారావు, ఓఎస్డీ ఎ రవికుమార్, ఎడ్‌సెట్ కన్వీనర్ ఎ రామకృష్ణ, కో కన్వీనర్ పి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గీతం యూనివర్సిటీకి న్యాక్ ఏ++ గ్రేడ్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

అత్యుత్తమ విద్యకు చిరునామాగా మారిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 'న్యాక్ ఏ++' గ్రేడు (నాలుగు పాయింట్లకు గాను 3.54) సాధించి మరోసారి తన సత్తాను చాటుకుంది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ఏర్పాటు చేసిన నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఎఎసి లేదా నాక్) గీతం పనితీరును విశ్లేషించి 'ఏ++' గ్రేడును కేటాయించిందని, ఇది ఏడేళ్ల పాటు అమలులో ఉంటుందని ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. భారతదేశంలోని దాదాపు 4,201 ఉన్నత విద్యా సంస్థల్లో కేవలం మూడు శాతానికి మాత్రమే ఈ గ్రేడ్ దక్కినట్టు నాక్ వెబ్‌సైట్ ద్వారా వెల్లడవుతోందన్నారు. 'న్యాక్ ఏ++' గుర్తింపు పొందిన గీతం మరింత ఉన్నత స్థాయికి చేరుకుని, ప్రపంచ స్థాయి, సమగ్ర విద్యను అందించడంతో పాటు సమాజానికి దోహదపడాలనే దాని లక్ష్యానికి కూడా దగ్గరయినట్టు ఉపకులపతి తెలిపారు. ఈ గ్రేడు సాధించడం ద్వారా మరింత స్వయం ప్రతిపత్తిని సమకూర్చే కేటగిరీ-1 హోదాను కూడా గీతం నిలుపుకుందన్నారు. అకడమిక్స్ విసి ప్రొఫెసర్ జయశంకర్ ఈ వారియర్, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజా ప్రభుతో సహా ఈ ఘనత సాధించిన సిబ్బంది, విద్యార్థులు, ఇతర భాగస్వాములందరికీ ప్రొఫెసర్ దయానంద అభినందనలు తెలియజేశారు. గతంలో, గీతం 2011లో 'నాక్-ఏ' గ్రేడు, 2017 'నాక్-ఏ+' గ్రేడు సాధించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అక్రమాలు

- దొంగ ఓటర్లను జైలుకు పంపాలి
- టిడిపి లీగల్ సెల్ సదస్సులో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అక్రమాలకు పాల్పడుతోందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి నాయకులు దొంగ ఓట్లు చేర్పించారని చెప్పారు. టిడిపి లీగల్ సెల్ విభాగం రాష్ట్ర సదస్సు టిడిపి కార్యాలయం సమీపంలోని సికె కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంద్రబాబు హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అక్రమాలను బయటపెట్టి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని న్యాయవాదులకు ఆయన పిలుపునిచ్చారు. దొంగ సర్టిఫికెట్లతో ఓట్లు నమోదు చేసుకున్న వారిని, ఓటు వేసిన వారిని జైలుకు పంపపాల్సిన అవసరముందన్నారు. నామినేషన్లు వేస్తే అకారణంగా చెల్లవంటున్నారని, దీనిపై న్యాయవాదులు స్పందించి సవాలు చేయాలని కోరారు. సాధారణ ఎన్నికలప్పుడు వైసిపి అనేక అక్రమాలకు తెరతీస్తుందని, వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. వైసిపి అరాచక పాలనపై టిడిపి కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేయడానికి లీగల్ సెల్ సభ్యుల అండదండలే కారణమని పేర్కొన్నారు. తనపైనా, లోకేష్‌పైనా, టిడిపి నేతలపైనే కాకుండా వాస్తవాలు చెబుతున్న వైసిపి నేతలకూ ప్రభుత్వ వేధింపులు తప్పడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

నాలుగేళ్లలో రూపాయి పెట్టుబడి కూడా తేలేకపోయారు..

నాలుగేళ్లల్లో ఒక్కరూపాయి కూడా పెట్టుబడి జగన్ తేలేకపోయారని విమర్శించారు. కష్టపడి ప్రజలు సంపాదించుకున్న ఆస్తులను బలవంతగా రాయించుకుంటున్నారని, విశాఖలోనే రూ.40 వేల కోట్లు విలువైన భూములను రాయించుకున్నారని విమర్శించారు. ప్రజల తరపున పోరాటానికి టిడిపి సిద్ధంగా ఉందని, వారికి న్యాయవాదులు అండగా ఉండాలని కోరారు. వైసిపి నేతల అరాచకాలకు వడ్డీతో సహా అంతా చెల్లిస్తామని, తప్పు చేసిన ప్రతి అధికారిని బోను ఎక్కించడం ఖాయమని హెచ్చరించారు. లీగల్ సెల్ విభాగం అధ్యక్షులు పోసాని వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, లీగల్ సెల్ విభాగం చైర్మన్ ధూళ్లిపాళ్ల నరేంద్ర, మాజీమంత్రి నక్కా ఆనంద్ బాబు పాల్గొన్నారు.



ప్రభుత్వం న్యాయం చేయడం లేదని చంద్రబాబుకు విన్నవిస్తున్న సుబ్రమణ్యం తల్లి

మాకు న్యాయం జరదం లేదు..

టిడిపి లీగల్ సెల్ సదస్సు సందర్భంగా పలువురు ప్రభుత్వం నుంచి తమకు న్యాయం జరగడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైనట్లు చెబుతున్న సుబ్రహ్మణ్యం తల్లి, మాచర్లలో హత్యకు గురైన చంద్రయ్య కుమారుడు ఈ సదస్సుకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వం నుంచి న్యాయం అందే నమ్మకం తమకు లేదని, మీరే మాకు న్యాయం చేయాలని చంద్రబాబుకు బాధితులు విన్నవించుకున్నారు.

సబ్సిడీ ఎరువులకు కులం లింకు

(మొదటిపేజి తరువాయి)

తిరోగమన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అది డిమాండ్ చేసింది. కుల,మతాలకతీతంగా ప్రజలు వ్యవసాయం చేస్తున్నారు. సబ్సిడీ ఎరువులకు, ఈ కుల వివరాలకు ఏమైనా సంబంధముందా? బయోమెట్రిక్ వాడకం సబ్సిడీకి ఎగనామం పలకడానికే తప్ప మరొకటి కాదు. ఎరువుల విక్రయానికి ఒపిఎస్ మెషిన్లను ఉపయోగించడం, ఎరువుల సబ్సిడీలను డిబిటికి మార్చే ప్రభుత్వ యత్నాలను ఎంతమాత్రం అనుమతించేది లేదని ఎఐకెఎస్ స్పష్టం చేసింది.

వంటగ్యాస్ సబ్సిడీలను డిబిటికి మార్చిన తరువాత ఏం జరిగిందో చూశాం. రేపు ఎరువుల సబ్సిడీ విషయంలోనూ అదే జరుగుతుంది. వ్యవసాయంలో డిబిటి పథకాలు భూ రికార్డులతో అనుసంధానించిన తరువాత భూమిలేని, కౌలు రైతులను సబ్సిడీల ప్రయోజనం నుంచి మినహాయించారు.

గత రెండేళ్లుగా ఎరువుల సరఫరాలో కేంద్రం భారీగా కోత పెట్టి ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌కు అవకాశమిచ్చిందని ఎఐకెఎస్ విమర్శించింది. పిఒఎస్‌ల వద్ద కులం నమోదు తప్పనిసరి చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనేఉపసంహరించుకోవాలని, రైతులకు తగినన్ని ఎరువులు నియంత్రిత ధరలకు అందుబాటులో ఉండేలా చూడాలని ఎఐకెఎస్ ఆ ప్రకటనలో డిమాండ్ చేసింది.

'కౌలు'కు వేటు

- క్రమేపీ తగ్గుతున్న రైతుల సంఖ్య
- మూడేళ్లలో 33 వేలమంది తగ్గింపు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కౌలు రైతులను ఆదుకునేందుకు ఎంతైనా చేస్తామని పదేపదే ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాల మొత్తం, కౌలుదారుల సంఖ్యను చూస్తే రైతులు దారుణంగా నష్టపోతున్నట్లు స్పష్టమవుతోంది. గత మూడేళ్లుగా రైతులకు అందిస్తున్న రుణ మొత్తం గణనీయంగా తగ్గిపోయినట్లు కనిపిస్తోంది. చివరకు కౌలు రైతుల సంఖ్య కూడా అదే క్రమంలో క్షీణిస్తోంది. 2020 మార్చి వరకు 2,31,345 మంది కౌలు రైతులను గుర్తించి వారికి రూ.2,303 కోట్లు బ్యాంకుల ద్వారా రుణాలను అధికారులు అందించారు. 2021 మార్చినాటికి కేవలం 96,947 మందికే రుణాలు అందించారు. అది కూడా అంతకుముందు సంవత్సరం కన్నా సగానికి తక్కువగా రూ.1,054 కోట్లు మాత్రమే అందించారు. 2022 మార్చినాటికి 1,80,562 మంది కౌలు రైతులకు రూ.1,744 కోట్లు రుణంగా అందించారు. 2021 కన్నా రైతులు, రుణం సంఖ్య 2022లో పెరిగినప్పటికీ, 2020తో పోల్చి చూస్తే బాగా తగ్గిపోయింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ వరకు గణాంకాలు చూస్తే కౌలు రైతులకు తక్కువగానే సాయం అందింది. కేవలం 1,63,811 మందికి మాత్రమే సాయం అందించగా, వారికి అందించిన రుణం కూడా రూ.1,126 కోట్లుగానే ఉంది. ఇది లక్ష్యంలో కేవలం 28 శాతమే కావడం విశేషం. కౌలు రైతులకు అందించాల్సిన రుణాలపై బ్యాంకర్లతో అనేక సమావేశాల్లో చర్చిస్తున్నప్పటికీ లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోతుండడంతో పేద రైతులు భారీ వడ్డీలకు బయట రుణాలపై ఆధారపడాల్సి వస్తోంది.



కౌలురైతులకు అందించిన రుణాల వివరాలు (రూ.కోట్లలో)

సంవత్సరం	రైతుల సంఖ్య	ఇచ్చిన రుణం
2019-20	2,31,345	1,645
2020-21	96,947	1,054
2021-22	1,80,562	1,744
2022-23 (డిసెంబర్ వరకు)	1,63,811	1,126

రెండో రోజు రూ.1.17 లక్షల కోట్ల ఎంఒయులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రెండో రోజైన శనివారం రూ.1.17 లక్షల కోట్ల విలువైన 260 ఎంఒయులపై సంతకాలు జరిగినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సభా వేదికపై ప్రకటించారు. వ్యవసాయ శాఖలో రూ.1160 కోట్ల విలువగల 15 ఎంఒయులు, పశు సంవర్థక శాఖలో రూ.1020 కోట్ల విలువైన 117 ఎంఒయులు సంతకాలు చేయబడ్డాయి. రాష్ట్రంలో 30 వేల మందికి పైగా ఉపాధిని కల్పించే రూ.22,096 కోట్ల విలువైన 117 ఎంఒయులు పర్యాటక రంగంలో చేయబడ్డాయి.

చిన్న ఎంఒయులూ ఉన్నాయి..

సమ్మిట్‌లో రూ.వేలు, లక్షల కోట్ల అవగాహనా ఒప్పందాలే కాదు, చిన్న మొత్తాల ఎంఒయులు కూడా జరిగాయి. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ రూ.22 కోట్లతో 5 వేల మందికి ఉపాధి కల్పించే 2 ఎంఒయులపై సంతకాలు చేయగా, ఫ్లిప్‌కార్ట్ రూ.20 కోట్ల పెట్టుబడితో 300 మందికి ఉపాధి కల్పించే రెండు అవగాహనా ఒప్పందాలు చేసుకుంది. రూ.30 కోట్లతో ఒంగోలులో ఫుడ్ ప్రోసెసింగ్ పరిశ్రమ ఒక ఎంఒయు, రూ.94 కోట్లతో శ్రీసిటీలో ఒక ఎంఒయు, విజయనగరం జిల్లా శారదా ఇండస్ట్రీలో రూ.100 కోట్లలోపు కొన్ని ఎంఒయులు కుదిరాయి. హెచ్‌పిసిఎల్ రూ.14.3 లక్షల కోట్లతో 1500 మందికి ఉపాధి కల్పించే ఎంఒయుపై సంతకం చేసింది.

ముఖేష్ అంబానీ ఎంఒయు విలువ రూ.5 లక్షల కోట్లు

ఇంధన రంగంలో రూ.8.84 లక్షల కోట్ల విలువైన 40 ఎంఒయులు జరిగాయి. వీటన్నిటి ద్వారా 2 లక్షల మందికి రాష్ట్రంలో ఉద్యోగాలు రానున్నాయని ప్రభుత్వం పేర్కొంది. రెండు రోజుల సమ్మిట్‌లో ప్రధాన పెట్టుబడిదారునిగా రిలయన్స్ గ్రూపునకు చెందిన ముఖేష్ అంబానీ ఉన్నారు. ఆయన రూ.5 లక్షల కోట్లతో లక్ష మందికి ఉపాధి కల్పించే ఎంఒయు చేసుకున్నారు.



కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న నాయకులు

700వ రోజుకు 'ఉక్కు' జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 700 రోజుకు చేరాయి. ఈ సందర్భంగా జెఎసి నాయకులు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని మోడీ ప్రభుత్వంపై నిరసన తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామని ప్రకటించి రెండేళ్లవుతున్నా ఆ దిశగా ఒక్క అడుగూ ముందుకు వేయలేకపోయిందన్నారు. దీనికి కారణం యావత్తు ప్రజానీకం స్టీల్‌ప్లాంట్‌కు రక్షించుకునేందుకు చేస్తోన్న పోరాటమేనని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మలేక కొత్త కుట్రలకు మోడీ సర్కారు పాల్పడుతోందన్నారు. ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి నష్టాల్లోకి నెడుతోందని తెలిపారు. అత్యంత సాంకేతిక నైపుణ్యం కలిగిన మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తిని నిలిపివేశారని, రోలింగ్ మిల్‌ను స్తంభింపజేశారని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించలేదని అన్నారు. కార్మికుల ప్రతిఘటనతో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శుక్రవారం ప్లాంట్ సమీపంలోకి నేరుగా రాలేకపోయారని గుర్తు చేశారు. కార్మికులు ఇదే అకుంఠిత దీక్షతో పోరాటాన్ని కొనసాగిస్తే ప్రయివేటీకరణపై మోడీ సర్కారు వెనక్కు తగ్గకతప్పదన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు అప్పారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి నాయకులు మన్మధరావు, సిఎఫ్‌టియు నాయకులు లక్ష్మి, ఐఎఫ్‌టియు నాయకులు మల్లన్న, జివిఎంసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పి.వెంకటరెడ్డి, జెఎసి నాయకులు కె.నాగభూషణరావు, రెహమాన్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

ఇప్పటంలో మళ్లీ కూల్చివేతలు

(మొదటిపేజి తరువాయి)

వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు నరసింహారావు, పెద్ది నేని వేణు , లాల్ చెంద్, జనసేన మహిళా విభాగం జిల్లా నాయకురాలు బడే కోమలి, జనసేన కార్యకర్తలను మొత్తం 14 మందిని పోలీసులు అరెస్టు చేసి వారిలో కొందరిని దుగ్గిరాల స్టేషన్‌కు, మరికొందరిని మంగళగిరి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడుదల చేశారు. దీనికి ముందు నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు నిరసనలో మాట్లాడుతూ గత సంవత్సరం మార్చిలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి స్థలాలు ఇచ్చిన కారణంగానే ఇప్పటం గ్రామంలో ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలో భాగంగా గతంలో కొందరి పేదల ఇళ్లు కూలగొట్టిందన్నారు. మచిలీపట్నంలో జనసేన ఆవిర్భావ దినోత్సవం జరపాలని ప్రకటించగానే ఇప్పటంలో ప్రభుత్వం మళ్లీ కూల్చివేతలు మొదలుపెట్టిందని విమర్శించారు.

కూల్చివేత, అరెస్టులు దుర్మార్గం : సిపిఎం

ఇప్పటంలో ఇళ్లు కూల్చివేయడం, బాధితులకు అండగా నిలబడి నిరసన తెలిపిన జనసేన నాయకులను పోలీసులు అరెస్టు చేయడం దుర్మార్గమని సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకర్ విమర్శించారు. ఇప్పటం గ్రామాన్ని సిపిఎం నాయకులు సందర్శించారు. బాధితులను పరామర్శించారు.

అభివృద్ధే లక్ష్యం : వైసిపి

ఇప్పటంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మించిన ప్రహరీ గోడలు, కారిడార్లు మాత్రమే తొలగిస్తున్నారని, ఏ ఒక్కరి భూమిలోకి అంగుళం కూడా వెళ్లి తొలగించడం లేదని వైసిపి తాడేపల్లి మండల నాయకులు మున్నగి వివేకానందరెడ్డి అన్నారు. ఇళ్ల కూల్చివేతకు గురైన వారిలో ఏ ఒక్కరైనా పవన్ కల్యాణ్ సభకు స్థలం ఇచ్చారని నిరూపిస్తే తాను రాజకీయాలు వదిలేస్తానని సవాల్ విసిరారు.

రచయిత్రి రామలక్ష్మి మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రముఖ అభ్యుదయ రచయిత్రి, ఆరుద్ర సతీమణి కూచి రామలక్ష్మి మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రామలక్ష్మి అనేక కథలు, నవలలు, విమర్శనావ్యాసాలు రాయడంతో పాటు తెలుగు సినిమాలకు కథ, మాటలు అందించారని పేర్కొన్నారు. తన రచనలలో అంతర్లీనంగా స్త్రీవాదాన్ని బలంగా వ్యక్తపరిచేవారని వివరించారు. ఆమె మృతి తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు.



మునిరాజమ్మకు చంద్రబాబు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

వైసిపి నేతల దాడిలో గాయపడిన హోటల్ నిర్వాహకురాలు మునిరాజమ్మకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ మేరకు గుంటూరు జిల్లా మంగళగిరి టిడిపి ఆఫీసులో ఆమెకు రూ. ఐదులక్షల చెక్కును శనివారం అందజేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌లో వెంకటాద్రి, మునిరాజా దంపతులు నివసిస్తున్నారు. బతుకుదెరువు కోసం శ్రీకాళహస్తి- పిచ్చాటూరు రహదారి పక్కనే శివనాథంపురం వద్ద ఓ టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా గత నెల 17న నారా లోకేష్ ఈ మార్గంలో వచ్చినప్పుడు మునిరాజమ్మ తమ బాధలను చెప్పుకున్నారు. సమస్యలు తీరడం లేదనీ, రాజీవ్ నగర్‌లో మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారంటూ విన్నవించింది. ఆ తరువాత ఓ టీవీ ఛానల్‌కు ఆమె ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. మునిరాజమ్మ మాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆగ్రహించిన అధికార పార్టీ నేతలు గత నెల 26న నలుగురు మహిళలు ఆమెపై దాడికి పాల్పడ్డారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తావా అంటూ దాడి చేశారు. అనంతరం తొట్టంబేడు పోలీసు స్టేషన్‌కు వెళ్లి మునిరాజమ్మపైనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టారు.

మహిళల పట్ల వివక్ష రూపుమాపాలి

- ఆకాశవాణి మాజీ డైరెక్టర్ కృష్ణకుమారి
- ఉత్సాహంగా మహిళా సాంస్కృతిక సమ్మేళనం



ఆర్ట్ గ్యాలరీని ప్రారంభిస్తున్న ఆకాశవాణి మాజీ డైరెక్టర్ మంజులూరి కృష్ణకుమారి

ప్రజాశక్తి-విజయవాడ

మహిళల పట్ల వివక్షను రూపుమాపేందుకు సమాజంలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఆకాశవాణి మాజీ డైరెక్టర్ మంజులూరి కృష్ణకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఆధ్వర్యాన విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో మహిళా సాంస్కృతిక సమ్మేళనం శనివారం జరిగింది. ఎంబివికె బాధ్యులు కె.స్వరూపరాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామనుకుంటున్న కంప్యూటర్ యుగంలో సైతం మహిళలపై పలు రూపాల్లో నిత్యం వివక్ష కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువత డ్రగ్, ఇతర మత్తు పదార్థాల్లో మునిగి తేలుతూ చిన్నారులు, మహిళలపై అన్న తేడా లేకుండా వారిపై అత్యాచారాలకు, హత్యలకు తెగబడుతున్నారని అన్నారు.

అన్ని రంగాల్లో విస్తరిస్తున్న డిజిటల్ పరిజ్ఞానాన్ని పాజిటివ్‌గా మార్చుకుంటే కొంత వరకు వివక్షను తగ్గించవచ్చన్నారు. కె.స్వరూపరాణి అధ్యక్షోపన్యాసం చేస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తమ హక్కుల దినంగా, దీక్షా దినంగా చేసుకొని మహిళల సమానతపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మహిళలో ప్రశ్నించేతత్వం రావాలని ఆకాంక్షించారు. అనేక పోరాటాల ఫలితంగానే మహిళలకు ఓటు హక్కును సాధించుకోగలిగామని తెలిపారు. ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ సమానత్వం సాధించాలంటే రాజకీయంగానూ, చట్టాల్లోనూ మార్పు రావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతికి పాటుపడే రాజకీయాలను అలవర్చుకుని వాటిని ప్రోత్సహించడంతోపాటు విస్తృత పరచాలని, మహిళా విద్య పెరగాలని తెలిపారు.

ఆలోచింపజేసిన ఆర్ట్ గ్యాలరీ

మహిళలపై జరుగుతున్న వివక్ష, అత్యాచారాలు, హత్యలు వంటి చిత్రాలతో బాలోత్సవ్ భవన్లో ప్రదర్శించిన ఆర్ట్ గ్యాలరీ అందరినీ ఆలోచింపజేసింది. ఈ ఆర్ట్ గ్యాలరీలో 50 చిత్రాల వరకు ఏర్పాటు చేశారు. దీనిని ఆకాశవాణి మాజీ డైరెక్టర్ మంజులూరి కృష్ణకుమారి ప్రారంభించారు. అనంతరం పాటలు, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బాలికలు, మహిళలు పెద్దఎత్తున ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలను జాషువా సాంస్కృతిక వేదిక అధ్యక్షులు, చిత్రకళాకారుల ఫోరం ఫర్ ఆర్టిస్టుల కార్యదర్శి ఎ.సునీల్‌కుమార్, ఎం.సుధారాణి, ఎంబివికె బాధ్యులు పి.విజయ, కె.శ్రీదేవి, ఝాన్సీ పాల్గొన్నారు.

అంధకారంలో యువత భవిష్యత్

'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వైసిపి ప్రభుత్వంలో ఉద్యోగాలు లేక, ఉపాధి లేక యువత భవిష్యత్ అంధకారంలో ఉందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. టిడిపి తెచ్చిన కంపెనీలను జగన్మోహన్‌రెడ్డి నిలబెట్టి ఉంటే ఈ రెండేళ్లలో రెండు లక్షల మందికి ఉద్యోగాలు వచ్చేవని, ఇదిలాగే కొనసాగితే ఎపి యువత కేరాఫ్ అడ్రస్సు తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు, చివరకు ఉత్తరప్రదేశ్ కూడా అయ్యే ప్రమాదం ఉందని విమర్శించారు. యువగళం పాదయాత్ర 34వ రోజు శనివారం 14.2 కిలోమీటర్లు సాగింది. పుంగనూరు నియోజకవర్గం కొక్కువారిపల్లి విడిది కేంద్రంనుంచి ప్రారంభమయ్యింది. దేవళంపేట, తుడుంవారిపల్లి మీదుగా కల్లూరు వరకు సాగి అక్కడ భోజన విరామం తీసుకున్నారు. అనంతరం జ్యోతినగర్ వరకూ సాగి అక్కడ విడిది కేంద్రంలో రాత్రి బస చేశారు. పాదయాత్రలో లోకేష్ మాట్లాడుతూ ఫాక్స్‌కాన్ అనే కంపెనీ మన రాష్ట్రం నుంచి వెళ్లిపోయి తెలంగాణాకు చేరిందని, తాజాగా కర్ణాటక రాష్ట్రంతోనూ ఈ కంపెనీ ఒప్పందం చేసుకుందన్నారు. జేట్యాక్స్ కోసం వేధించి ఒక్కో సంస్థను రాష్ట్రం నుంచి జగన్‌రెడ్డి తరిమేస్తున్నారని విమర్శించారు.

టిడిపి అధికారంలోకి వస్తే ఎపి నుంచి పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్లడాన్ని అరికట్టి, పక్క రాష్ట్రాల నుండి ఎపికి వలసలు వచ్చేలా చేస్తామన్నారు. చంద్రబాబు పాలనలో విద్య, ఉద్యోగాలు తెస్తే, జగన్ పాలనలో పాఠశాలల వద్దకే గంజాయి తెచ్చారని విమర్శించారు. గంజాయికి ఎపి అడ్డాగా మారిపోయిందన్నారు.

9 నుంచి ఉద్యమం

- ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల హక్కులు, హామీల అమలు కోసం ఈ నెల 9 నుంచి ఏప్రిల్ 3 వరకు ఉద్యమబాట పడుతున్నట్లు ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఉద్యమ ముందడుగులో భాగంగా శనివారం కడపలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నెల 9, 10 తేదీల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన, 13,14న భోజన విరామ సమయంలో కలెక్టరేట్ల ఎదుట ఆందోళన, 15, 17, 20న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, 21న సెల్‌డౌన్, 27న విజయవాడలోని ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ ఒకటిన ఓదార్పుయాత్ర పేరుతో ఉద్యోగులు, ఉద్యోగం చేస్తూ మరణించిన కుటుంబాలు, సిపిఎస్ ఉద్యోగుల సమస్యలు, కష్టాలను ఇళ్ల వద్దకు వెళ్లి తెలుసుకుంటామని పేర్కొన్నారు. 3న కలెక్టరేట్లలో నిర్వహించే స్పందనలో వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. అప్పటికీ ప్రభుత్వం, అధికారులు దిగిరాకపోతే వచ్చే నెల ఐదున 94 సంఘాల ప్రతినిధులతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మలిదశ ఉద్యమాన్ని ప్రారంభిస్తామన్నారు.



విద్యుత్ సౌధ వద్ద వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న సిపిఎం శ్రేణులు

వినియోగదారులపై భారాలు మోపొద్దు

- విద్యుత్ సౌధ వద్ద సిపిఎం వినూత్న నిరసన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు ఛార్జీల భారాన్ని మోపుతూ విద్యుత్ నియంత్రణ మండలి ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా శనివారం విజయవాడ సిపిడిసిఎల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. సామాన్యుడిపై వివిధ రూపాల్లో ప్రభుత్వం మోపుతున్న విద్యుత్తు భారాలను ప్రతిబింబించేలా వినూత్న రీతిలో ప్రదర్శనలు చేపట్టారు. సర్దుబాటు ఛార్జీల భారాలు మోపుతూ జారీ చేసిన ఆదేశాల కాపీలను దగ్ధం చేశారు. ఈ భారాలను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం సిపిడిసిఎల్ సిఎండి పద్మ జనార్ధన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుండి యూనిట్‌కు 20 నుండి 67 పైసల వరకు ప్రజలపై సర్దుబాటు ఛార్జీల భారాన్ని మోపాలని చూడడం భావ్యంకాదన్నారు. ఎన్నికలకు ముందు 200 యూనిట్ల వరకు వినియోగించే వారందరికీ ఉచితంగా విద్యుత్ అందిస్తామని, విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. దానికి భిన్నంగా ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం దుర్మార్గమని అన్నారు.

ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు పెంచి రూ.1400 కోట్ల మేర భారం వేశారని తెలిపారు 2014-19కు సంబంధించి ట్రూఅప్ ఛార్జీలను రూ.2900 కోట్లు వసూలు చేయడం ప్రారంభించారన్నారు. మళ్లీ తాజాగా 2020-21లో వినియోగించుకున్న విద్యుత్తుకు ఇప్పుడు సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.3083 కోట్ల మేర వసూళ్లకు నిర్ణయించడం దారుణమన్నారు. విద్యుత్తు భారాలను ఉపసంహరించుకోవాలని, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, అదాని కంపెనీలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి రమణారావు, నాయకులు కె దుర్గారావు, పి కృష్ణ, బి చిన్నారావు, శేఖర్, మురహరి, క్రాంతి, సీతారాములు, సిహెచ్.శ్రీను, పీరు సాహెబ్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

- ముత్తంశెట్టిపై ఇసికి టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భీమిలి ఎమ్మెల్యే, మాజీమంత్రి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు శనివారం లేఖ రాశారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం ఎంఇఒ పద్మావతితో కలిసి నిబంధనలకు విరుద్ధంగా ముత్తంశెట్టి, స్థానిక వైసిపి నాయకులు ఫిబ్రవరి 28న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారని తెలిపారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపైనా, వైసిపి నాయకులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై పత్రికల్లో వచ్చిన వార్తాలను, ఫోటోలను లేఖతో పాటు ఆయన జత చేశారు. ఈ లేఖ కాపీని విశాఖపట్నం జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారికి కూడా పంపారు.

'చింతలపూడి'ని విస్మరించిన వైసిపి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - చింతలపూడి (చింతలపూడి)

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా విస్మరించారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సిపిఐ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ నేతలు శనివారం ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలోని కొమ్ముగూడెంలో చింతలపూడి ఎత్తిపోతల పథకంలో తవ్విన కాలువను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఎత్తిపోతల ప్రాజెక్టుల పరిస్థితి కూడా చింతలపూడిలానే తయారయ్యాయని విమర్శించారు. రూ.3 వేల కోట్లతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు నుండి ఇప్పటి వరకు కనీసం 300 ఎకరాలకు కూడా సాగునీరు అందించలేపోయిందన్నారు. నిర్వాసిత రైతులకు న్యాయమైన నష్టపరిహారం కూడా అందించ లేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూమి ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, అయితే వారు వేరేచోట వ్యవసాయ భూమి కొనుక్కోవడానికి న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వైసిపి నాలుగేళ్ల పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. జాతీయ ప్రాజెక్ట్‌గా గుర్తించిన పోలవరానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల లబ్ధి ఉంటేనే కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టులను చేపడుతుందని, ఈ క్రమంలోనే కర్ణాటకలో త్వరలో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అక్కడ అప్పర్‌భద్ర ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు సుమారు రూ.5 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు.

19 మంది స్మగ్లర్ల అరెస్టు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకానికి పాల్పడుతున్న స్మగ్లర్లపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. 19 మంది అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఈ వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి అన్బురాజన్ విలేకరులకు వెల్లడించారు. ఆయన వివరాల మేరకు.. 40 స్పెషల్ టీములు 15 ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి స్మగ్లర్లను పట్టుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో కిరణ్ కుమార్, సందీప్, పూజారి, శివకుమార్, వెంకట లక్ష్మమ్మ, రాజు, చంద్ర శ్రీకాంత్, అల్లా ప్రకాష్, శంకర్, సుష్మంత్, పుల్లయ్య, వినోద్ కుమార్, పెద్దక్క, ఖాదరవల్లి, రాంబాబు, తిరుపతయ్య, రమేష్, మస్తానమ్మ, కొండయ్య ఉన్నారు. వీరి నుంచి 28 కేజీల గంజాయి, కారు, మూడు ద్విచక్ర వాహనాలు, 16 సెల్‌ఫోన్లను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు.

బెయిల్‌పై టిడిపి నేత పట్టాభి విడుదల

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి


తప్పుడు కేసులకు బెదిరేది, లొంగేది లేదని టిడిపి నేత కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. కృష్ణా జిల్లా గన్నవరం ఘటన నేపథ్యంలో పట్టాభిరామ్‌తో పాటు మరో 13 మందిని అరెస్టు చేసిన విషయం విదితమే. రిమాండ్ నిమిత్తం వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసులో బెయిల్ కోసం కోర్టును పట్టాభిరామ్ ఆశ్రయించారు. విచారణ అనంతరం విజయవాడ ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టు రూ.25 వేల పూచీకత్తుతో శుక్రవారమే బెయిల్ మంజూరు చేసింది. పూచీకత్తు పూర్తి అనంతరం పట్టాభితో సహా 13 మందిని శనివారం విడుదల చేశారు. అనంతరం పట్టాభిరామ్ మీడియాతో మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రజల పక్షాన పోరాడుతున్న తన గొంతుకను నిలువరించలేరన్నారు. తమపై అక్రమంగా కేసులు పెట్టడమే కాకుండా కృష్ణా జిల్లా తోట్ల వల్లూరు స్టేషన్‌లో తనపైకి ముగ్గురు దుండగులను పోలీసులే పంపించి హింసించారని ఆరోపించారు. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన పోలీస్ స్టేషన్లలోనే రక్షణ కరువైందని విమర్శించారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

స్టార్టప్‌లకు తగ్గిన నిధులు

- ఫండింగ్ ఒప్పందాల్లో 65% పతనం



బెంగళూరు : దేశంలోని స్టార్టప్‌లకు నిధుల సమీకరణ తగ్గింది. ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో స్టార్టప్ ఫండింగ్ ఒప్పందాలు ఏకంగా 65 శాతం పడిపోయాయని ప్రయివేటు మార్కెట్ ఇంటిలిజెన్స్ కంపెనీ అయినా వెంచర్ ఇంటిలిజెన్స్ ఓ రిపోర్టులో తెలిపింది. 2023 జనవరిలో 62 డీల్‌లు, 2022 ఫిబ్రవరిలో 123 ఒప్పందాలతో పోలిస్తే గడిచిన ఫిబ్రవరిలో ఏకంగా 42 ఒప్పందాలు మాత్రమే జరిగాయి. మరోవైపు 2022 ఫిబ్రవరిలో స్టార్టప్‌లు ఏకంగా 4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.3.2 లక్షల కోట్లు) సమీకరించగా.. గడిచిన ఫిబ్రవరిలో 536 మిలియన్ డాలర్లు (రూ.43వేల కోట్లు) మాత్రమే పొందగలిగాయి. క్రితం నెలలో టెక్నలాజీ రంగంలో అత్యధికంగా 16 స్టార్టప్ ఫండింగ్ ఒప్పందాలు జరిగాయి. వచ్చే కొన్ని నెలల పాటు పరిస్థితి ఇలాగే ఉండొచ్చని వెంచర్ ఇంటిలిజెన్సీ ఫౌండర్ అరుణ్ నట్రాజన్ పేర్కొన్నారు. నిధుల కొరత తీవ్రమవుతున్న క్రమంలోనూ స్టార్టప్ వ్యవస్థలో విలీనం, కొనుగోలు కార్యకలాపాలు కూడా బలంగా కొనసాగాయన్నారు. 2023 మొదటి రెండు నెలల్లో, భారతీయ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలో 10 విలీన, సంలీన ఒప్పందాలు జరిగాయన్నారు. రంగాల వారీగా ప్రభావం పరంగా ఫిన్‌టెక్, డి2సి ఇ-కామర్స్ సంస్థలు కొన్ని వ్యూహాత్మక సముపార్జనలను చూడగలవని నట్రాజన్ పేర్కొన్నారు. ఐటిసి వంటి పెద్ద కంపెనీలు సహా, ఇ కామర్స్ కంపెనీలు కూడా మంచి బ్రాండ్‌లను కొనుగోలు చేయడానికి వెతుకుతున్నాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, టెక్ రంగంలో కీలకంగా మారుతోన్న స్టార్టప్ సంస్థలు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయని ఇటీవల పలు రిపోర్టులు వచ్చాయి. నిధులు లభ్యత తగ్గిపోయి.. నిరాశను చవి చూస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఇస్తున్న ప్రాధాన్యత ఈ చిన్న సంస్థలకు ఇవ్వడం లేదనే విమర్శలు నెలకొన్నాయి.



ప్రధానితో బిల్‌గేట్స్ భేటీ

న్యూఢిల్లీ : ప్రధాని మోడితో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ శనివారం భేటీ అయ్యారు. ఆరోగ్య రంగం, పర్యావరణ మార్పులు వంటి కీలక అంశాలపై ఇరువురూ చర్చించారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రధానితో భేటీ వివరాల గురించి గేట్స్ తన అధికారిక బ్లాగ్‌లో రాశారు. భారత్ అన్ని రంగాల్లో రాణిస్తోందని పేర్కొన్నారు. భారత్ ఎంతో సమర్థమైన, భద్రమైన, అందుబాటు ధరల్లో ఉండే అనేక వ్యాక్సిన్లను పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేసిందన్నారు. భారత్ తన ఆవిష్కరణలను ప్రపంచంతో పంచుకోవాలని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

జూమ్ ప్రెసిడెంట్‌కు ఉద్వాసన



వాషింగ్టన్ : టెక్ కంపెనీల్లో ఇటీవల క్రింది నుంచి పై స్థాయి వరకు వేలాది ఉద్యోగుల తొలగింపులను చూస్తున్నాము. కానీ.. ఈ సారి ఏకంగా ఓ టెక్ దిగ్గజం ప్రెసిడెంట్ పదవికే ఎసరు రావడం విశేషం. ప్రముఖ వీడియో కాన్ఫరెన్సింగ్ సంస్థ 'జూమ్' ఎలాంటి కారణం లేకుండానే ఆ కంపెనీ ప్రెసిడెంట్ గ్రెగ్ టౌంబ్‌కు ఉద్వాసన పలికింది. సేల్స్ ఆపరేషన్స్, ఎర్నింగ్స్ కాల్స్‌లో కీలక పాత్ర పోశించిన గ్రెగ్‌ను శుక్రవారం ఆ కంపెనీ తొలగించినట్లు రెగ్యూలేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. సంస్థ తరుపు నుంచి అన్నీ ప్రయోజనాలకు కల్పిస్తూ.. ఎలాంటి కారణం లేకుండానే తొలగించామని ఆ సంస్థ పేర్కొనడం విశేషం. ఫిబ్రవరిలో ఈ కంపెనీ తన 15 శాతానికి సమానమయ్యే 1300 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. వైదొలగనున్న టౌంబ్‌కు 45 మిలియన్ల విలువైన కంపెనీ స్టాక్స్‌తో పాటు 4లక్షల బిలియన్ డాలర్ల వేతనాన్ని చెల్లించనుంది. టౌంబ్ స్థానంలో కొత్త వారిని నియమించనున్నట్లు ఆ కంపెనీ తెలిపింది.

నిలిచిన 'ఝురికోన' ఎత్తిపోతలు!

- రూ.108 కోట్ల కాల్వ పనులకు గ్రహణం
- 10 వేల ఎకరాల సాగుపై ప్రభావం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నమయ్య జిల్లాలోని ఝురికోన జలాశయ పనులు నిలిచిపోయాయి. 2006-07 సంవత్సరంలో రాజంపేట నియోజకవర్గం సుండుపల్లి మండల పరిధిలోని బాహుదానది మీద 0.5 టిఎంసిల సామర్థ్యంతో నిర్మితమైన రిజర్వాయర్ 2014కు పూర్తి అయ్యింది. 2006 నుంచి నేటి వరకు సుమారు 17 ఏళ్లుగా జలాశయ ప్రధాన, కుడి, ఎడమ కాల్వల పనులు ముందుకు సాగిన దాఖలాల్లేవు. ప్రధాన కాలువ 0 నుంచి 6 కిలోమీటర్లు, ఎడమ కాలువ 0 నుంచి 21 కిలోమీటర్లు, కుడి కాలువ 0 నుంచి 15 కిలోమీటర్ల పనులు నిలిచిపోయాయి. ఈ కాలువల ద్వారా జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం సుండుపల్లి మండలంలోని ఆరు పంచాయతీలకు, పీలేరు నియోజకవర్గంలోని కలికిరి తదితర గ్రామాలకు తాగు, సాగునీరు అందించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో ఈ పనులు నిలిచిపోయాయి. దీనికి తోడు సంబేపల్లి, సుండుపల్లి మండలాల పరిధిలోని 23 చెరువులకు సాగునీటిని అందించాలనే ఉద్దేశంతో ఏడాదిన్నర కిందట రూ.44కోట్లతో ఎత్తిపోతల పనులకు టెండర్లు పిలిచారు. నార్ కన్స్‌స్ట్రక్షన్ సంస్థ ఈ పనులను దక్కించుకుంది. జలాశయం నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల మేర కాలవలను తవ్విన అనంతరం ఈ సంస్థ చేతులెత్తేసింది. ఇప్పటి వరకు పనిచేసిన రూ.38 లక్షలకు చెందిన బిల్లులకు నిధులు చెల్లించకపోవడంతో పనులను నిలిపివేసింది.



అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం శెట్టిపల్లి పంచాయతీలోని నాయునోరిపల్లికి సమీపంలో నిలిచిన పనులు

పదివేల ఎకరాలపై ప్రభావం

ఝురికోన రిజర్వాయర్‌కు కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల ఎకరాల సాగుపై ప్రభావం పడుతోంది. పనులు పూర్తయితే సుండుపల్లి మండల పరిధిలోని విఎన్.పాలెం, టి.సుండుపల్లి, బంగారుపల్లి, మడితాడు, పిఎన్ కాలువ, తిమ్మసముద్రం పరిసర ప్రాంతాల్లోని 4,900 ఎకరాల ప్రధాన ఆయకట్టు స్థిరీకరణకు నోచుకునే అవకాశం ఉంది. దీనికితోడు మరో ఐదు వేల ఎకరాల మెట్ట భూముల సాగుకు సంబంధించిన భూగర్భజలాలు అందుబాటులోకి రానున్నాయి.

పెండింగ్‌లో ఆర్‌ఇ

ఝురికోన పనుల రివైజ్డ్ ఎస్టిమేట్స్‌కు మోక్షమెప్పుడో తెలియడం లేదు. కాల్వపనుల్లో 40 స్ట్రక్షర్లు, యాడెక్ట్ క్రాప్స్, డ్రాప్స్, ఆఫ్ టేకింగ్ పాయింట్స్, యుటి, డ్రాప్స్ వంటి సాంకేతిక నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. గతంలో నిర్వహించిన ప్రయివేటు సంస్థ సర్వే అనంతరం రివైజ్డ్ ఎస్టిమేట్ కమిటీ మరో రూ.30 కోట్లకు పెంచి రూ.78 కోట్ల నుంచి రూ.108 కోట్లతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేసింది. ఝురికోన రిజర్వాయర్ ప్రాజెక్టు పూర్తి కావడానికి ఇంకా 123 ఎకరాలను భూసేకరణ చేయాల్సి ఉంది.

పనులు నిలిచిన మాట వాస్తవమే

ఝురికోన జలాశయ పనులు నిలిచిన మాట వాస్తవమే. త్వరలోనే రూ.30 కోట్ల చెల్లింపులు చేస్తాం. మళ్లీ ప్రాజెక్టు పనులు పట్టాలెక్కిస్తాం.


- డి.వెంకటరామయ్య, నీటిపారుదలశాఖ ఇఇ, కడప.

అసుస్ @ 200 స్టోర్లు

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ అసుస్ ఇండియా 200 స్టోర్లకు విస్తరించినట్లు ప్రకటించింది. న్యూఢిల్లీలోని నెహ్రూ ప్యాలెస్ వద్ద కొత్త స్టోర్‌ను తెరవడం ద్వారా ఈ మైలురాయికి చేరినట్లు తెలిపింది. వినియోగదారులకు కావాల్సిన పిసిలు, గేమింగ్ ల్యాప్‌టాప్‌లు, ఆల్ ఇన్ ఒన్ డెస్క్‌టాప్‌లు, ఇతర యాక్ససరీలను ఇక్కడ ప్రదర్శన, అమ్మకానికి ఉంచినట్లు అసుస్ ఇండియా బిజినెస్ హెడ్ అర్నాల్డ్ సు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా తమ రిటైల్ కార్యక్రమాలను వృద్ధి చేయడంతో పాటుగా భారతీయ మార్కెట్ పట్ల బ్రాండ్ నిబద్ధతను సైతం వెల్లడిస్తుందన్నారు. దేశంలో అసుస్ 2020లో 50 స్టోర్లను మాత్రమే కలిగి ఉండగా.. 2023 నాటికి ఆ సంఖ్య 200కు చేరిందన్నారు.

మూత్రపిండాల వ్యాధులపై అవగాహన అవశ్యం

యశోద హాస్పిటల్ వైద్యుల ఉద్ఘాటన



హైదరాబాద్ : మూత్ర పిండాల వ్యాధులపై ప్రజలకు అవగాహన తప్పనిసరి అని యశోద హాస్పిటల్స్ వైద్యులు పేర్కొన్నారు. "ప్రపంచంలో దాదాపు 85 కోట్ల ప్రజలు ఏదో ఒక మూత్రపిండాల వ్యాధితో సతమతమవుతున్నారు. ప్రజల్లో మూత్రపిండాల వ్యాధులపైన, మూత్రపిండాల ఆరోగ్యం పైన అవగాహన పెంపొందించడానికి ప్రతి సంవత్సరం మార్చి నెలలో 2వ గురువారాన్ని ప్రపంచ కిడ్నీ దినోత్సవంగా పాటిస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో యశోద హాస్పిటల్స్ ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిడ్నీ దానం చేసిన 50 మందికి పైగా కిడ్నీ దాతలను ఘనంగా సత్కరించడం సంతోషంగా ఉంది." అని యశోద హాస్పిటల్స్, సీనియర్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నెఫ్రాలజిస్ట్, పద్మభూషణ్ డాక్టర్ ఎంకె మణి మాట్లాడుతూ.. భారతదేశంలో కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోవడం ఆందోళనకరమన్నారు. మన దేశ జనాభాలో 17 శాతం మంది ప్రజలు మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఏకైక మార్గం ప్రజలకు కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించడమేనని సూచించారు.

కొత్త అల్లుడు ఇంటికొస్తే... రకరకాల రుచికరమైన వంటకాలతో వడ్డిస్తారు. ఏకంగా 135 వంటకాలతోనో, 379 వంటకాలతోనో విందు భోజనం వడ్డించారన్న వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంటాయి. ఇష్టమైనవారికి కోరిన వంటకాలు చేయడం, కొసరి కొసరి వడ్డించడం... ప్రేమను వ్యక్తీకరించే ఒక మార్గం. 'వివాహ భోజనంబు వింతైన వంటకంబు/ వియ్యాలవారి విందు ఓ హెూహ్హో నాకె ముందు/ ఔరౌర గారెలల్ల అయ్యారె బూరెలిల్ల/ ఓహ్హోరె అరెసెలుల్ల అహహ్హాహ...' అంటూ షడ్రసోపేతమైన పెళ్లి విందును రకరకాల పదార్థాల పేర్లతో బహు పసందుగా రాస్తాడు సినీకవి పింగళి. సినిమాల్లోనే కాదు... నిజ జీవితంలోనూ భోజన ప్రియులు భుక్తాయాసంతో తేన్చాల్సిందే. గతంలో అందుకు తగ్గట్టుగానే శారీరక శ్రమ కూడా వుండేది. కానీ, ఈ రోజుల్లో మారిన జీవనశైలి, తప్పిన ఆహారపు అలవాట్ల వల్ల ఇంతకుముందెన్నడూ చూడని రోగాలు రొప్పులు, ప్రాణాంతక వ్యాధులు ముప్పుగా మారాయి. ముఖ్యంగా అధిక బరువు, ఊబకాయం విపరీతంగా పెరిగింది. పిల్లలు సైతం ఈ స్థూలకాయం బారిన పడడం ఓ విషాదం.

'తిండి కలిగితే కండ కలదోయ్... కండ కలవాడే మనుజుడోయ్' అని గురజాడ అప్పుడెప్పుడో అన్నారు. కానీ ఈ కాలంలో ఇది రివర్స్ అయ్యింది. 'ఒక్కపూటే తినవోయ్... ఆరోగ్యంగా వుండవోయ్' అంటున్నారు. ఏం తినాలి, ఏం తినకూడదు... తింటే ఎంత తినాలి అనే అవగాహన లేకపోతే... అనారోగ్యం బారిన పడకతప్పదంటున్నారు కొందరు నిపుణులు.

మీదే సమస్త విశ్వం!

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో ఊబకాయం ఒకటి. 2035 నాటికి ప్రపంచ జనాభాలో సగానికిపైగా ఊబకాయం, అధిక బరువు సమస్యతో బాధపడతారని తాజాగా 'అంతర్జాతీయ ఒబేసిటీ ఫెడరేషన్' హెచ్చరించింది. ఊబకాయంతో బాధపడుతున్న జనాభా వున్న దేశాల్లో భారత్ కూడా వుంది. రాబోయే దశాబ్దంలో ప్రతి నలుగురిలో ఒకరు ఊబకాయం సమస్యతో బాధపడనున్నారు. ముఖ్యంగా ఈ సమస్య చిన్నారుల్లోనూ, తక్కువ ఆదాయంగల దేశాల్లోనూ వేగంగా పెరుగుతోందని డబ్ల్యుఓఎఫ్ అంచనా వేసింది. ఈ నివేదిక ప్రపంచానికొక హెచ్చరిక. పరిస్థితి మరింత దిగజారక ముందే జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారులు, యుక్తవయస్సు వారిలో ఊబకాయం పెరుగుదల రేటు ఆందోళన కలిగించే రీతిలో పెరుగుతోంది. ఈ సమస్యను నివారించే దిశగా ప్రభుత్వాలు, ఆరోగ్య నిపుణులు దృష్టి సారించాల్సివుంది. 2035 నాటికి 208 మిలియన్ల మంది అబ్బాయిలు, 175 మిలియన్ల మంది అమ్మాయిల్లో స్థూలకాయం రేటు రెట్టింపు కానుందని ఆ నివేదిక చెబుతోంది. మరోవైపు ఆకలికేకలు, పోషకాహార లోపం, రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులు, మహిళలు కనిపించే దేశం మనది. శతాబ్దాల నుంచి పోషకాహార సమస్య వెంటాడుతుండగా, దశాబ్ద కాలంగా ఊబకాయ సమస్య కూడా దానికి తోడయ్యింది. పూర్తి భిన్నమైన రెండు సమస్యలను ఏకకాలంలో మన దేశం ఎదుర్కొంటోంది.

నయా ఉదారవాద విధానాలు అమల్లోకి వచ్చిన తర్వాత షార్ట్‌కట్‌లో సక్సెస్ సాధించి, పిల్లలను డబ్బు సంపాదించే యంత్రాలుగా మార్చాలని అనేకమంది తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. ప్రభుత్వాల విద్యావిధానం కూడా ఇందుకు తగ్గట్టుగానే వుంది. దీంతో పిల్లల్లో గతంలో మాదిరిగా ఆట, పాట కొరవడింది. స్కూల్స్‌లో సైతం ఆట పాటలను పక్కన బెట్టి పాఠాలను బట్టీ వేయడమే పనిగా పెట్టుకుంటున్నారు. అసలు కొన్ని స్కూళ్లకు ఆటస్థలాలే లేవు. కొండొకచో వున్నా... పిఇటీలు వుండరు. చెరువుల్లో కాలువల్లో ఈతలెయ్యడం వంటివి ఇప్పటివారికి అసలే తెలియవు. వ్యాయామాలను పక్కనపెట్టేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే శారీరక శ్రమ, కంటినిండా నిద్రా వుండాలి. ఇప్పుడా రెండూ లేవు. దీనికితోడు మొబైల్ ఫోన్లు పిల్లల ఆరోగ్యానికి మరింత ప్రతిబంధకంగా మారాయి. 'పాపం, పుణ్యం, ప్రపంచమార్గం/ కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ/ ఏమీ ఎరుగని పూవుల్లారా/ అయిదా రేడుల పాపల్లారా' అంటాడు మహాకవి శ్రీశ్రీ. భావితరానికి దూతలు వీళ్లు. వీరిని యంత్రాలుగా, ఊబకాయులుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. 'మీదే, మీదే సమస్త విశ్వం/ మీరే లోకపు భాగ్యవిధాతలు/ మీ హాసంలో మెరుగులు తీరును/ వచ్చేనాళ్ల విభాప్రభాతములు' అని శ్రీశ్రీ అన్నట్టుగా- దేశం ప్రగతిపథంలో పయనించాలంటే... ఉత్సాహంతో ఉరకలెత్తే యువతరం కావాలి.

చావెజ్ 10వ వర్ధంతి నేడు



"అమెరికా ప్రభుత్వం శాంతిని ఎన్నడూ కోరుకోదు.. దాని దృష్టంతా ఈ దోపిడీ వ్యవస్థను ఉపయోగించుకుని ప్రపంచ వనరులను కొల్లగొట్టడంపైనే. యుద్ధం ద్వారా తన ఆధిపత్యాన్ని ప్రపంచంపై ఎలా రుద్దాలన్నదానిపైనే. అది నిజంగా శాంతినే కోరుకుంటే ఇరాక్‌లో ఏం జరిగింది? లెబనాన్‌లో ఏం చేసింది? పాలస్తీనాలో ఏం జరిగింది? గత వందేళ్లలో లాటిన్ అమెరికాలోను, మిగతా ప్రపంచంలోను అది సాగించిన, సాగిస్తున్న కుట్రలు ఏం తెలియజేస్తున్నాయి?"

- హ్యూగో ఛావెజ్, వెనిజులా మాజీ అధ్యక్షుడు

జననం : 28.7.1954 మరణం: 5,3,2013


ఈశాన్య ఫలితాలపై బిజెపి హైప్- నిజానిజాలు

విశ్లేషణ



తెలకపల్లి రవి

త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ ఫలితాల తర్వాత ఈశాన్య రాష్ట్రాలలో బిజెపి విజయాలు చారిత్రాత్మకమైనట్టు మోతమోగుతున్నది. ఇందుకు ప్రధాని మోడీ వ్యక్తిగత ప్రభావం కారణమైనట్టు, ఆయన పథకాలతో అభివృద్ధి సంక్షేమం మెరుగయ్యాయని సంతోషించినందుకే ప్రజలు గెలిపించినట్టు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతున్నది. ఉత్తరాదికే పరిమితమైన పార్టీగా చెప్పుకునే బిజెపి దేశం మూలమూలనా చొరబడిందని ఈ ఫలితాలతో తిరుగులేని విధంగా రుజువైందనే పల్లవి వినిపిస్తున్నది. త్రిపురలో వామపక్షాలు, అలాగే కాంగ్రెస్ పార్టీ దెబ్బతినడం కీలక పరిణామంగా చిత్రించబడుతున్నది. ఎన్నికల్లో జయాపజయాలను బట్టి ఈ విధమైన వాదనలు ప్రచారాలు సాగడంలో ఆశ్చర్యం లేదు గానీ పూర్తి వాస్తవమేమిటనేది కూడా అర్థం చేసుకోవడం అవసరం. ఈ ఫలితాలలో బిజెపికి అంత సీన్ కనిపించిందా? ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాలలోనూ వాటితోపాటు జరిగిన ఉప ఎన్నికలలోనూ బిజెపి సాధించిన ఫలితాలేమిటి, పరిమితులేమిటి? లోతుగా చూడాల్సి వుంది. అలా చూసినప్పుడు బిజెపి నేతలు అంతగా జబ్బలు చరుచుకోవలసిన అద్భుత ఫలితాలేమీ కాదని, అవైనా అనేక అక్రమాలు ధనబలం నిర్బంధంతో లభించినవేనని స్పష్టమవుతుంది. పైగా ఇవి చాలా చిన్న రాష్ట్రాలను వశపర్చుకోవడం కోసం ప్రపంచంలోనే పెద్దదిగా టముకు వేసుకునే పార్టీ పడరాని పాట్లు పడటం. ఫలితాలు రాగానే ప్లేటు మార్చడం కూడా కనిపిస్తుంది. ఈ చిన్న రాష్ట్రాలలో ఇతరులతో రకరకాల బేరసారాలు మత రాజకీయాలు నెరిపిన బిజెపి ఇదేదో దేశవ్యాపిత విజయంలా చెప్పుకుంటే మీడియా కూడా వంతపాడటం వింత గొల్పుతుంది. అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, మణిపూర్, త్రిపురల్లో బిజెపి అధికారానికి రావడం, మేఘాలయ, మణిపూర్‌లలో మిత్రపక్షాల సాయంతో పాగా వేయడం గొప్ప పరిణామాలుగా చెప్పేవారు. గతంలోనూ కేంద్రంలోని కాంగ్రెస్ ఈ తరహా ఆధిక్యత నడిపించుకుందని మర్చిపోతుంటారు. ఈశాన్య రాష్ట్రాలు గానీ జమ్మూ కాశ్మీర్‌గాని కేంద్రంలో ప్రభుత్వాన్ని బలపరిస్తే తప్ప బతకలేని దురవస్థ ఇందుకు కారణమని దేశమంతటికీ తెలుసు. మోడీ హయాంలో పెద్ద పెద్ద రాష్ట్రాలకే నిధులు కేటాయించకుండా వివక్షతో దాడులతో లోబర్చుకుంటున్న నేపథ్యం ఈశాన్యానికి మరింత ఎక్కువగా వర్తిస్తుందని చెప్పనవసరం లేదు. పైగా అధికార అవకాశవాదంలోనూ వేర్పాటువాద పోకడలలోనూ అక్కడి పాలకపక్ష నాయకులు ఆరితేరారు గనక ఆ పని మరింత తేలికే. 35 ఏళ్ల వామపక్ష పాలనలో స్థిరత్వం కాపాడుకున్న త్రిపుర మినహా అన్నిచోట్లా ఇదే జరిగేది. దాన్నే మోడీ, హోంమంత్రి అమిత్‌షా వంటి వారు తమవైపునకు తిప్పుకోవడంలో గొప్పతనమేమీ లేదు. వీటిలోని హెచ్చరికను గుర్తించడం అవసరమే అయినా అతిశయోక్తులను ఆమోదించనవసరం లేదు.



ఈశాన్య భారతంలో అధికంగా వున్న క్రైస్తవ ఓటర్ల కోసం మరెవరికంటే అధికంగా బుజ్జగింపు విధానాలు అనుసరిస్తుంది. వారి మతపరమైన కోర్కెలకు పెద్దపీట వేస్తూ గిరిజనాభివృద్ధిని ఉపేక్షిస్తుంది. ఉత్తరాదిని గోరక్షణ గురించి గగ్గోలు పెట్టి అనేకమంది ప్రాణాలు పోవడానికి కారణమైన సంఘ పరివార్ ఈశాన్యంలో మాటమారుస్తుంది. గొడ్డుమాంసం తినడం అక్కడ సర్వసాధారణం గనక ఆవును పక్కన పెట్టేస్తుంది ! జెరూసలేము యాత్రలకు సహాయం వాగ్దానం చేస్తుంది. ఇవన్నీ మతసహనంతో చేస్తే ఫరవాలేదు గాని ఓట్లకోసమే కావడం విపరీతం. అస్సాంలో అత్యుత్సాహంతో హిందూత్వ పాఠాలు చెప్పే ముఖ్యమంత్రి శర్మ తక్కిన ఇతర చోట్ల మొత్తం మార్చేసి అదే తన చాణక్యమంటారు. ఇవన్నీ అవకాశవాద రాజకీయ విన్యాసాలే.

త్రిపురలో జరిగిందేమిటి?

ఇప్పుడు ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లోనూ ఒక్క త్రిపురలో మాత్రమే బిజెపి తానుగా ఆధిక్యత సాధించింది. అందుకోసం ఎన్ని దౌర్జన్యాలూ నిర్బంధాలు జరిగాయో గతవారం చెప్పుకున్నాం. స్వేచ్ఛగా ఓటేయనిస్తే తప్పక గెలుస్తామని మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ చేసిన వ్యాఖ్య నేను గుర్తు చేశాను. అలా జరగడం లేదనీ దాడులతో పాటు అక్రమాలు ధనప్రలోభాలు పెరుగుతున్నాయని సిపిఎం నాయకులు అనేకసార్లు ఎన్నికల సంఘం దృష్టికి తెచ్చారు. కాని అవి ఆగింది లేదు. గిరిజన ప్రాంతాలలో ఎన్నికల ముందే పుట్టుకొచ్చిన త్రిప్రి మోతె పార్టీ ఓట్ల చీలికలోనూ సీట్ల చీలికలోనూ పెద్ద ప్రభావమే చూపింది. దాంతో కేంద్ర బిజెపి నాయకులు మంతనాలాడారు. ప్రత్యేక రాష్ట్రం ప్రత్యేక దేశం అంటున్నా వారి మంతనాలు ఆగలేదు. ఆ ఒక్కటి తప్ప అన్నిటికీ సిద్ధమని బాహాటంగానే సంకేతాలిచ్చారు. ఇంతకూ ఈ పార్టీ ఎవరిదంటే పిసిసి అధ్యక్షుడుగా వుండి నిష్క్రమించిన మాజీ యువరాజు ప్రద్యుమ్నది. అంటే ఆయన కాంగ్రెస్ ఓట్లలోనూ గండిపెట్టాడనేది స్పష్టమే. సీట్ల సర్దుబాటులోనూ చివరిదాకా సాగదీసిన కాంగ్రెస్ నాయకత్వం పాత్ర మరొకటి. ఇన్నిటి మధ్య సిపిఎం, వామపక్షాల నాయకులు ప్రాణాలకు వెరవక పోరాడారు. బిజెపి విచ్ఛిన్నశక్తుల దాడులను ఎదుర్కొన్నారు. ఫలితాలు వచ్చాక చూస్తే కాంగ్రెస్‌తో పరస్పర పోటీ నివారణ చేసుకున్నప్పటికీ వామపక్షాల ఓట్ల శాతం పెరగకపోగా గతసారి కన్నా పదిహేను శాతం వరకూ తగ్గినట్టు కనిపిస్తుంది. ఈ ఒడంబడిక పొరబాటనే వాదనలు మీడియాలో మొదలైనాయి. విధానపరమైన నిర్ణయం గనక ఇప్పుడు దానిపై తర్జనభర్జనల కన్నా సమగ్ర సమీక్ష కోసం ఎదురుచూడటం మంచిది. కానీ అసలు సమస్య మాత్రం మరోసారి వేర్పాటు వాద విచ్ఛిన్నకర పోకడలు పెంచే శక్తులకు ఊతమివ్వడం. గతంలో అస్సాంలో కాంగ్రెస్ ఇలాగే చేయడం గుర్తుండే వుంటుంది. ఇప్పుడు బిజెపి అదే పని చేస్తున్నది. ఇంతా చేసినా ఐపిఎఫ్‌టితో కలసి కూడా అది అత్తెసరు ఆధిక్యతనే తెచ్చుకోగలిగింది. బిజెపిని వ్యతిరేకించేది తానేనన్నట్టు గొప్పలు పోయే తృణమూల్ కాంగ్రెస్ కూడా అన్నిచోట్ల పోటీ పెట్టి ఓట్ల చీలికకు కారణమైంది. వీటన్నిటినీ ఉపయోగించుకున్న బిజెపి నేతలు ఇప్పుడు మాత్రం మహిళలు యువత తమకు బాగా ఓటేశారని చెప్పుకుంటున్నారు. ఏమైనా రాజకీయంగా బిజెపికి అంతర్గత కలహాల మధ్య వచ్చిన త్రిపుర విజయం కీలకమే అవుతుంది. ఇన్ని నిర్బంధాల మధ్య సిపిఎం, ఇతర వామపక్ష కార్యకర్తల కృషి అభినందనీయం. త్రిప్రి మోతె రానున్న రోజులలో ఎలాటి సమస్యలు, సవాళ్లు సృష్టించేది బిజెపి అవకాశవాదం ఏ పరిణామాలకు కారణమయ్యేది చూడాల్సిందే.

మేఘాలయలో వెనకడుగు, నాగాలాండ్‌లో జూనియర్ పాత్ర

ఈశాన్య విజయం అంటూ అతిగా చెప్పుకుంటున్న బిజెపి మిగిలిన రెండు రాష్ట్రాలు నాగాలాండ్, మేఘాలయలో స్వంతంగా సాధించిందేమీ లేదు. మేఘాలయలో కొన్రాడ్ సంగ్మా నాయకత్వంలోని నాగాలాండ్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) 26 స్థానాలతో పెద్ద పార్టీగా వచ్చింది. ఈ పార్టీతో కలసి మిశ్రమ కూటమిలో వుండిన బిజెపి ఎన్నికల ముందే వైదొలగింది. ఈశాన్యంలో అన్నిటికన్నా అవినీతికరమైన ప్రభుత్వం అది అని స్వయంగా హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. కాని ఇప్పుడు రెండుస్థానాలు గెలిచిన బిజెపి ఆ పార్టీతోనే చేతులు కలిపి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరిస్తున్నది. ఈ మేరకు సంగ్మా గవర్నర్‌ను కలిసి అవకాశం కోరాడు. అమిత్ షా సమక్షంలో ప్రమాణస్వీకారం చేయడానికి ముహూర్తం చూసుకుంటున్నారు. హిల్ పీపుల్స్ పార్టీకి చెందిన ఇద్దరు, మరో ఇద్దరు స్వతంత్రులు కూడా తమతో వున్నారని సంగ్మా చెబుతున్నా ఆ పార్టీలు మరోలా మాట్లాడుతున్నాయి. కేంద్రం వారిని దారికి తెచ్చినా ఆశ్చర్యం లేదు. 11 స్థానాలు తెచ్చుకున్న మాజీ పాలక కూటమి భాగస్వామి యుడిపి, రెండు తెచ్చుకున్న విపిపి పార్టీ కూడా బేరసారాలు సాగిస్తున్నాయి. ఇక నాగాలాండ్‌లో నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నెయిఫియు రియో నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్నది. నేషనలిస్టు డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి) నాయకుడైన రియో కు 12 మంది బిజెపి సభ్యుల మద్దతు వున్నది. ఇక్కడ కూడా బిజెపి జూనియర్ భాగస్వామిగానే వుంది. కనుక బిజెపి ఈ రెండుచోట్ల గెలిచేసినట్టు చెప్పుకోవడం హాస్యాస్పదమే. పైగా అది మోడీ ప్రతిష్ట, బిజెపి విధానాల విజయంగా చెప్పడం మరీ విడ్డూరం. ఈ సర్కార్లు స్థిరంగా వుండటం కూడా కష్టమే. అయితే ముందే చెప్పుకున్నట్టు కేంద్రం మీద పరాధీనత వల్ల వారు అనివార్యంగా లోబడిపోతుంటారు. అందులో నిలబడిన వారిని బిజెపి తన వైపునకు తిప్పుకుంటుంది. ఈ ప్రక్రియకు ఆధ్వర్యం వహించే అస్సాం ముఖ్యమంత్రి హేమంత బిస్వాస్ శర్మను కొందరు మరో మోడీగా వర్ణిస్తుంటారు కూడా.

మరో విడత తర్వాతే


హిందూత్వమే తమ సిద్ధాంతమని రెచ్చగొట్టే బిజెపి ఈశాన్య భారతంలో అధికంగా వున్న క్రైస్తవ ఓటర్ల కోసం మరెవరికంటే అధికంగా బుజ్జగింపు విధానాలు అనుసరిస్తుంది. వారి మతపరమైన కోర్కెలకు పెద్దపీట వేస్తూ గిరిజనాభివృద్ధిని ఉపేక్షిస్తుంది. ఉత్తరాదిని గోరక్షణ గురించి గగ్గోలు పెట్టి అనేకమంది ప్రాణాలు పోవడానికి కారణమైన సంఘ పరివార్ ఈశాన్యంలో మాటమారుస్తుంది. గొడ్డుమాంసం తినడం అక్కడ సర్వసాధారణం గనక ఆవును పక్కన పెట్టేస్తుంది ! జెరూసలేము యాత్రలకు సహాయం వాగ్దానం చేస్తుంది. ఇవన్నీ మతసహనంతో చేస్తే ఫరవాలేదు గాని ఓట్లకోసమే కావడం విపరీతం. అస్సాంలో అత్యుత్సాహంతో హిందూత్వ పాఠాలు చెప్పే ముఖ్యమంత్రి శర్మ తక్కిన ఇతర చోట్ల మొత్తం మార్చేసి అదే తన చాణక్యమంటారు. ఇవన్నీ అవకాశవాద రాజకీయ విన్యాసాలే. ఉత్తరాదిలోనే పూర్తిగా గెలవలేని బిజెపి దక్షిణాన పాగా వేసేందుకు నిరంతరం విఫలయత్నాలు చేస్తున్నది. తూర్పు పశ్చిమల్లో కూడా దానికి ప్రత్యర్థి రాజకీయ శక్తులున్నాయి.


ఒరిస్సా, బెంగాల్ వంటి చోట్ల గెలవలేకపోతున్నది. దక్షిణాన సరేసరి. కర్ణాటక కూడా చేజారి పోతుందని ఢిల్లీ నేతలు భావిస్తున్నారు. ఇప్పుడు జరిగిన ఉప ఎన్నికలలో కూడా కాంగ్రెస్ మూడు, బిజెపి,మిత్రులు మూడు తెచ్చుకున్నారు, బెంగాల్ అసెంబ్లీలో కాంగ్రెస్ చోటు సంపాదించింది. తమిళనాడులోని ఈరోడ్‌లోనూ మహారాష్ట్రలోనూ గెలిచింది. ఇవి మిత్రపక్షాల తోడువల్ల గెలిచినవే కావడం గమనార్హం. కాంగ్రెస్ ఇప్పటికీ బిజెపికి వ్యతిరేకంగా సరైన విధానం తీసుకోలేకపోవడం, తనే నాయకత్వం వహించాలన్నట్టు మాట్లాడుతుండడం కనిపిస్తుంది. ఇవన్నీ ఎలా వున్నా బిజెపి ఈశాన్య ప్రాంతంలో చిన్న చితక పార్టీలతో కలసి సాగించే కపట నాటకాన్ని దేశవ్యాపిత విస్తరణకు సాక్ష్యంగా చూపాలనుకోవడం కుదిరేది కాదు. ఈ ఏడాది కర్ణాటక, చత్తీస్‌ఘర్, మధ్యప్రదేశ్, మిజోరాం, రాజస్థాన్, తెలంగాణ, జమ్మూకాశ్మీర్ అసెంబ్లీల ఎన్నికల తర్వాత దేశ రాజకీయ ముఖచిత్రం మరింత స్పష్టమవుతుంది. ★

కార్పొరేట్ చదువులకు విద్యా కుసుమాలు బలి

కామెంట్

- విజయవాడ ఈడ్పుగల్లు శ్రీ చైతన్య క్యాంపస్‌లో సీనియర్ ఇంటర్ బైపిసి చదువుతున్న విద్యార్థి వర్మ ఆత్మహత్య
- హైదరాబాద్ నార్సింగిలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఎస్ స్వాతిక్ ఆత్మహత్య
- విజయవాడ గూడవల్లి నారాయణ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఈశ్వరరెడ్డి ఆత్మహత్య,





మన తెలుగు రాష్ట్రాల్లో కార్పొరేట్ కళాశాలల ధనదాహంతో వెలుగుచూస్తున్న ఈ తరహా ఘటనల్లో ఇవి మచ్చుతునక. . తమ పిల్లలు ఉన్నతంగా చదువుకోవాలన్న తల్లిదండ్రులకు చివరకు పిల్లలే లేకుండా పోతున్నారు. కార్పొరేట్ కళాశాలల్లో సెంట్రల్ జైళ్లను తలపించే విధంగా విద్యావ్యవస్థ ఉండడంతో మానసిక ఒత్తిడిని తట్టుకోలేక పోతున్నారు. విద్యార్థులు హాయిగా చదువుకోవాల్సిన సమయంలో తమ జీవితాలను అర్థాంతరంగా ఆర్పేసుకుంటున్నారు. అయినా విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలలంటే మార్కులు, ర్యాంకులే కాదు ఆత్మహత్యలు. విద్యార్థుల మరణాలు కూడా వినిపిస్తాయి. తీవ్రమైన ఒత్తిడిని తట్టుకోలేక భవనాలపై నుంచి దూకి చనిపోయే విద్యార్థులు కొందరైతే... ఫ్యాన్లకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్న విద్యార్థులు మరికొందరు.

ఇరుకిరుకు గదుల్లో, చాలీ చాలని అన్నం పెడుతూ రోజుకు 12 గంటలు, 13 గంటలు చదివించేలా తయారైన కార్పొరేట్ కళాశాలల టైం టేబుల్ చూస్తే అమ్మో అనిపిస్తుంది. ఇటు వారి టైం టేబుల్‌కనుగుణంగా చదవలేక, అటు ఆ విషయాలను తల్లిదండ్రులకు చెప్పలేక చాలా మంది విద్యార్థులు వారిలో వారే కుమిలిపోతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోకపోతే ఇంకా చాలామంది పిల్లలు తమ ప్రాణాలు కోల్పోయే అవకాశాలు ఉంటాయి. ఈ విద్యా సంవత్సరంలో దాదాపు 20 మందికి పైగా విద్యార్థులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఆత్మహత్యలు చేసుకున్నారు. వారిలో ఎక్కువ మంది ఇంటర్ విద్యార్థులే. కార్పొరేట్ విద్యాసంస్థలు పెడుతున్న చదువు ఒత్తిడి తట్టుకోలేకనే వారు ఆ తీవ్రమైన చర్యకు పాల్పడుతున్నారనేది కాదనలేని విషయం. తల్లిదండ్రుల ప్రేమను కాదని, తమ భవిష్యత్తును ఊహించుకోలేక చాలా మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ..

కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చేశాయి. ఆ కళాశాలల్లో ఇంటర్ చదవాలంటే సంవత్సరానికి 2,20,000 రూపాయలు ఫీజుగా వసూలు చేస్తున్నారు. దీనికి తోడు బుక్స్, యూనిఫామ్, క్రీడలకు, ఇతర వాటికి వేలకు వేల రూపాయలు చెల్లించాల్సిందే. తల్లిదండ్రులు ఫీజులు కట్టడం ఆలస్యమైతే విద్యార్థులను గంటల కొద్దీ బయట నుంచోబెట్టడం, కొట్టడం, లాంటి చర్యలకూ పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా... విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం లాంటి చోట్ల మొత్తం కూడా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు దండిగా వచ్చాయి. వాటి మధ్య పోటీ కూడా పెరిగింది. ఆయా కళాశాలలకు ర్యాంకులు వస్తున్నాయనే ఉద్దేశంతో వాటినే తల్లిదండ్రులు ఎంచుకుని తమ పిల్లలను వాటిలో చేరుస్తున్నారు. పుస్తకాలు పట్టుకుని చదువుతూ ఉండడం, రోజువారీ లేదా వారం వారీ పరీక్షలు రాయడం మాత్రమే వారి జీవితంగా మారిపోయింది. ఈ ఒత్తిడి వల్ల విద్యార్థులు కోల్పోతున్న మానసిక స్థయిర్యాన్ని విద్యాసంస్థలు పట్టించుకోవడం లేదు. అలా ఒత్తిడి గురవుతున్న వారికి కళాశాలలో మానసిక వైద్యులతో ఎప్పటికప్పుడు అవగాహన సదస్సు కార్యక్రమాలనూ నిర్వహించడం లేదు.

కళాశాలలో ఆటలూ...పాటలూ కరువై!

ఆటలు, పాటలు, సరదాలు అన్నీ దూరం. ప్రధానంగా ఇంటర్ నుండి విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు. విద్య అనేది భవిష్యత్తుకు కీలకం. లేలేత నూనూగు మీసాలతో పలు విషయాలపై అయోమయంలో పడే వయస్సు అది. దేని మీద కూడా స్పష్టత వచ్చే వయస్సు కాదు. పైగా బాహ్య ప్రపంచం అనేది లేకపోవడం, ఇతరులతో సామాజిక సంబంధాల్లోకి వచ్చే వెసులుబాటు లేకపోవడం చదువులో పోటీ పడలేని నిస్సహాయ స్థితికి విద్యార్థులు చేరుకుంటున్నారు. చదవడమో, చావడమో అనే అంతిమ స్థితికి వారిని విద్యాసంస్థలు నెట్టేయడం అసలు కారణం. వారికి నచ్చిన రంగంలో కాలుపెడితే ఆ రంగంలో పిల్లలు తమ ప్రతిభను ప్రదర్శించి, ఆ రంగంలో ఎదుగుతారనే భావన దాదాపుగా తొలగిపోవడంతో ఈ పరిస్థితి వస్తోంది.

తూతూ మంత్రంగా విద్యాశాఖ చర్యలు

ఈ విద్యా సంస్థలలో కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల దోపిడీ జరుగుతున్నా.... సరైన నిబంధనలను పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోకపోవడం. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్, ఐఐటి లాంటి పేర్లతో తల్లిదండ్రులని మభ్యపెట్టి వారి దగ్గర నుండి లక్షలాది రూపాయలు దండుకుంటున్నా...ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ఘటన జరిగినప్పుడు మాత్రమే అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి వాటిపై ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు....ఈ కార్పొరేట్ కళాశాలల్లో జరిగిన ఘటనలపై అనేకమార్లు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లినప్పటికీ కూడా ఈ విద్యాసంస్థల పట్ల ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం పరిస్థితి దారుణంగా తయారైంది. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే విద్యాసంస్థలపై అధికారులు కఠినమైన చర్యలు తీసుకున్నప్పుడే విద్యలో నాణ్యత పెరిగే అవకాశం ఉంది.

గతంలో ప్రభుత్వ విద్యాలయాల్లో చదువులు....

గతంలో పదో తరగతి తర్వాత ప్రభుత్వ కాలేజీల్లో సీటు వస్తే అదష్టంగా భావించేవారు. ఎయిడెడ్, ప్రభుత్వ కళాశాలల్లో సీటు వస్తే గోల్డ్ మెడల్ సాధించినట్లు ఉండేది. ప్రభుత్వ పాఠశాలల్లోనూ, కాలేజీల్లోనూ చదివినవారు చాలా మంది ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారు. పెద్దగా డబ్బులు ఖర్చు కాకుండా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ కళాశాలల్లో చదివినవారు సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకున్నవారు చాలా మందే ఉన్నారు. తమ పిల్లవాడు చదువులో రాణించలేకపోతున్నాడని భావించినప్పుడు తల్లిదండ్రులు వేరే రంగానికి పంపించేవారు. కానీ ఇప్పుడు అలా జరగడం లేదు. దీన్ని గుర్తించి, తమ పిల్లలను సమాజానికి ఉపయోగపడే విధంగా ..ఉన్నత విద్యావంతులుగా మలచాలనే బాధ్యత విద్యాసంస్థలదీ, తల్లిదండ్రులదీ. దీన్ని పాటించకపోతే విద్యావ్యవస్థ ప్రమాణాలు దారుణంగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుంది.

ఎం సోమేశ్వరరావు,
అధ్యక్షుడు, ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌టిఆర్ జిల్లా ★

ఒక్క సిరా చుక్క

కవిత్వం

నీ వేలి చివరన నిలిచే ఒక్క సిరా చుక్క
కావాలి ప్రజాస్వామ్య పరిరక్షణకు వేగుచుక్క...
కులమత ప్రాంతాలకు అతీతంగా
నువ్వు వేసే ఓటు
జాతి ఉన్నత భవిష్యత్తుకు కావాలి తొలిమెట్టు...
దేశంలో ఉన్న అంధకార రాజకీయాలకు
కావాలి గొడ్డలి పెట్టు....
విజ్ఞతతో మీరు వేసే ఓటు అక్రమార్కులకు
వేస్తుంది వేటు....
ఓటుకు నోటు...
ప్రజాస్వామ్యానికి చేస్తుంది తరగని చేటు.

-భానోజి బిల్లా(నేవల్ డాక్ యార్డ్)
మల్కాపురం,వైజాగ్

రాష్ట్రానికి గంజాయి ముప్పు!

జనవాక్యం

రాష్ట్రంలో గంజాయి రవాణా,వినియోగం గణనీయంగా పెరుగుతున్న వైనం ఆందోళన కలిగిస్తున్నది. ఈ గంజాయి అక్రమ రవాణా,అమ్మకాల్లో పలువురు అధికార పార్టీ నేతలు పట్టుబడుతున్న వార్తలు నిత్యం పత్రికల్లో వస్తున్నాయి. మరోవైపు ఇలా పట్టుబడిన గంజాయి,రవాణా వాహనాలు పోలీసు అధికారులు దుర్వినియోగం చేస్తున్న వైనాలు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రంలో తగినంత మంది పోలీసు సిబ్బంది లేకపోవడం,ఉన్న సిబ్బంది రాజకీయ ఒత్తిళ్లకు లొంగి పనిచేయడంతో అసాంఘిక,అక్రమ ,చట్టవిరుద్ధ కార్యక్రమాలను అదుపు చేయడం సాధ్యం కాదని స్పష్టమవుతుంది. ఉపాధి,ఉద్యోగ అవకాశాల్లేక యువత పెడదారి పట్టడం కూడా సమస్యను తీవ్రం చేస్తున్న వైనం పాలకులు గుర్తించాలి.

జి.రామకృష్ణ, ఏలూరు,

మందులు లేవు.. సిబ్బందీ లేరు!

- 250 రకాల మందులకు వచ్చింది 50 రకాలే
- ఇండెంట్ పంపినా సరఫరా చేయని కాంట్రాక్టు కంపెనీలు
- ఈఎస్ఐ ఆస్పత్రుల్లో ఇదీ దుస్థితి

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురంలో రెండు, అనంతనపురం, గుంతకల్లు, తాడిపత్రిలో ఈఎస్ఐ ఆస్పత్రులు ఉన్నాయి. ఇక్కడ రోజూ సుమారు 500 మందికి పైగా కార్మికులు వైద్య సేవల కోసం వస్తుంటారు. అయితే జిల్లాలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ఈఎస్ఐ అసుపత్రికి ఎక్కువ మంది రోగులు వస్తుంటారు. హిందూపురం ప్రాంతంలో దాదాపు 20 వేల మంది కార్మికులకు పైగా ఉన్నారు. ఒక్కో కుటుంబంలో నలుగురు సభ్యులను కలుపుకుంటే మొత్తం సభ్యుల సంఖ్య సుమారు 80 వేల వరకు ఉంటారు. వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆయా సంస్థలు తమ ఈఎస్ఐ వాటాను చెల్లిస్తాయి. దీంతో కార్మికుల కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తుంటారు. కడప కేంద్రంగానే కడప, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, అనంతపురానికి చెందిన ఈఎస్ఐ జాయింట్



ప్రాంతీయ కార్యాలయం ఉంది. 28 డిస్పెన్సరీలు ఆదోని, తిరుపతిలో, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయి. వైద్యుల లెక్క ప్రకారం ఆస్పత్రులు, డిస్పెన్సరీలకు ఒక్కో దానికి రోజుకు 100 నుంచి 150 మంది ఈఎస్ఐ కార్డు కలిగిన కార్మికులు చికిత్స కోసం వస్తుంటారు. డిస్పెన్సరీలకు అవసరమైన మందుల ఇండెంట్‌ను కడప జెడి కార్యాలయం నుంచే విజయవాడ కార్యాలయానికి పంపిస్తుంటారు. ఏయే మందులు అవసరమో వాటిని అక్కడి నుంచి డిస్పెన్సరీలకు సరఫరా చేస్తారు. సమస్యలను పరిష్కారించాలని డిమెండ్ చేస్తూ సిపిఎం, సిఐటియు నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు.

మందుల కొరత..

ప్రభుత్వం మందులు సరఫరా చేసే కంపెనీలకు బకాయిలు చెల్లించడం లేదు. దీంతో కంపెనీలు ఈఎస్ఐ ఆస్పత్రులకు అవసరమైన మందులను సరఫరా చేయడం లేదు. మూడు నెలలకు ఓ సారి ఆస్పత్రులకు అవసరమైన మందుల ఇండెంట్‌ను జేడీ ద్వారా విజయవాడలోని డైరెక్టర్‌కు పంపిస్తుంటారు. 250 రకాల మందులకు డాక్టర్లు ఇండెంట్ పెడుతుంటారు. దీర్ఘకాలిక వ్యాధుల మందులతో పాటు బీపీ, షుగర్, లివర్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి మందులు తెప్పిస్తుంటారు. అయితే ప్రభుత్వం కంపెనీలకు పాత బకాయిలు ఇవ్వకపోవడంతో మందుల సరఫరా నిలిచిపోయింది. 250 రకాల మందులకు గాను ఇప్పుడు కేవలం 50 రకాలు మాత్రమే వస్తున్నాయి.

మందులే కాదు..సిబ్బందీ లేరు..

హిందూపురం ఈఎస్ఐ అసుపత్రిలో మందుల కొరతే కాదు.. సిబ్బంది కొరతా వేదిస్తోంది. హిందూపురం, కొట్నూరుకు సంబంధించి రెండు డిస్పెన్సరీలనూ ఒకే చోట నిర్వహిస్తున్నారు. ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికీ నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్, ఎంఎన్ఒతో పాటు క్లాస్-4కు సంబంధించి అన్ని పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు కార్యాలయంలో ఉండాల్సి సీనియర్ అసిస్టెంట్లు సైతం లేరు. రోగులతో పాటు వైద్యులు కూడా ఇబ్బంది పడుతున్నారు.

కార్మికులకు భారంగా..

ఈఎస్ఐ డిస్పెన్సరీలో మందుల కొరత ఉండడం కార్మికులను కలవరపాటుకు గురిచేస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మందులు ఇంజెక్షన్ల కోసం సుమారు రూ.2 నుంచి రూ.3 వేల విలువజేసే మందులను ఉపయోగిస్తుంటారు. వీరు క్రమం తప్పకుండా రోజూ మందులు వేసుకోవాల్సి ఉంది. అయితే ఇప్పుడు ఈఎస్ఐలో మందుల కొరత కారణంగా బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిరావడం కార్మికుల కుటుంబాలకు భారంగా మారుతోంది. ఇక్కడ సరైన వైద్యం అందక పోవడంతో ఇతర అసుపత్రుల్లో వైద్య సేవలు పొందితే దానికి సంబంధించిన బిల్లులు ఆరు నెలలు గడిచినా మంజూరుకావడం లేదు. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ అసుపత్రుల్లో ఈఎస్ఐ కార్డు ఉన్న వారికి వైద్య సేవలు అందించలేమని తెగేసి చెబుతున్నట్లు కార్మికులు పేర్కొంటున్నారు. దీనికి కారణం ఈఎస్ఐ వైద్య సేవలకు సంబందించి సకాలంలో బిల్లులు మంజూరు కాక పోవడమే. ప్రతి నెలా కార్మికులు ఈఎస్ఐ కోసం డబ్బులు చెల్లించినప్పటికీ వైద్య సేవల కోసం అప్పులు చేసి మోయలేని భారాన్ని మోయాల్సి వస్తోంది.

అధిక పింఛను కోసం

- ఇప్పటి వరకూ 8 వేల దరఖాస్తులు

న్యూఢిల్లీ : అధిక పింఛను కోసం ఇప్పటికి వరకూ 8 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ శనివారం వెల్లడించింది. దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయడానికి ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపిఎఫ్ఒ) సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేస్తోందని మంత్రిత్వ శాఖ తెలిపింది. అధిక ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ కాంట్రిబ్యూషన్ ఎంపిక చేసుకోవడానికి ఇబ్బందులు ఎదరువుతున్నాయని పెన్షనర్లు, కార్మిక సంఘాలు నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో మంత్రిత్వ శాఖ ఈ ప్రకటన చేసింది. ఈ అధిక పింఛను ఆప్షను ఎంచుకోవడానికి మే 3 వరకూ గడువు ఉంది. ఫిబ్రవరి 20న ఈపిఎఫ్ఒ జారీ చేసిన సర్క్యులర్ ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ నిబంధనలకు కట్టుబడి ఉందని, అలాగే సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఉందని మంత్రిత్వ శాఖ తెలిపింది. 2014 సెప్టెంబరు 1 కంటే ముందు పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు అధిక ఫించను ఎంచుకునే అవకాశం శనివారంతో ముగిసిందని తెలిపింది. ఈ విభాగంలో ఆన్‌లైన్ ద్వారా 91,258 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపింది.

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ

सत्यमेव जयते

BHARATMALA
ROAD TO PROSPERITY

బహిరంగ ప్రకటన

RC.B2.373/2018 & RC.B2.457/2018 **తేది.02.03.2023**

భారత జాతీయ రహదారుల చట్టం, 1956 (48/1956) సెక్షన్ 3జి (3) క్రింద జారీచేయటమైనది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్‌టిఆర్ జిల్లా, జాతీయ రహదారి NH-16 లోని 4-లేన్ కి.మీ.1095.6 నుండి 1098.5 వరకు విజయవాడ - మచిలీపట్నం సెక్షన్ NH-65 కింద **ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ తూర్పు మండలానికి చెందిన గుణదల మరియు విజయవాడ పట్టణం (VMC)** గ్రామాలలో విస్తరించియున్న భూమి నందు నిర్మించుట (వెడల్పు చేయుట / నాలుగు లైన్లు వగైరా), మెయింటెనెన్స్, మేనేజ్‌మెంట్ మరియు ఆపరేషన్ కొరకు దిగువ షెడ్యూల్‌లో తెలిపిన భూములు, నిర్మాణాలు మరియు చెట్లు మొదలగు వాటితో భారత ప్రభుత్వం, రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారులు మంత్రిత్వశాఖ వారి ఉత్తర్వులు **ఎస్.ఓ.నెం.92 (ఇ) తేది.06-01-2023** ప్రకటించిన భారత ప్రభుత్వ గెజిట్ ఎక్స్ట్రా ఆర్డినరీ ప్రతి నెం.86, పార్ట్-2, సెక్షన్-3, సబ్‌సెక్షన్-2 **తేది.06-01-2023** నందు ప్రచురించిన ప్రకారం 1956 జాతీయ రహదారుల చట్టం (48/1956) యొక్క 3డి (2) సెక్షన్ క్రింద భారత ప్రభుత్వానికి అన్ని విధాలుగా ఋణ విముక్తిమై ధారాదత్తమైనది.

అట్టి భూములుతో సంబంధం, ఆసక్తిగల వ్యక్తులు అందరూ తమ భూములకు సంబంధించిన ఒరిజనల్ డాక్యుమెంట్లు, వాటి జిరాక్స్ కాపీలు, పట్టాదారు పాస్‌పుస్తకములు, టైటిల్ డీడ్స్ మరియు కట్టడములు ఏమైన ఉన్నచో వాటి అప్రూవుడ్ ప్లానులు, పన్ను అసెస్‌మెంటు మరియు పన్ను రశీదుతో స్వయంగా కానీ లేక ప్రతినిధి ద్వారా లేదా న్యాయవాది ద్వారా సబ్ కలెక్టర్, విజయవాడ వారి కార్యాలయం నందు కాంపిటెంట్ అథారిటీ భూసేకరణ మరియు సబ్ కలెక్టర్, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా వారి సమక్షమునకు ఈ దిగువ తెలిపిన తేదీలలో హాజరు కావలెను.

జిల్లా పేరు	మండలం పేరు	గ్రామం పేరు	విచారణ జరుగు స్థలము	తేది & సమయం
ఎన్‌టిఆర్	విజయవాడ తూర్పు	(1) గుణదల	సబ్ కలెక్టర్ వారి కార్యాలయం, విజయవాడ	10.03.2023 ఉ॥10.00 గం.లకు
		(2) విజయవాడ పట్టణం (VMC)		14.03.2023 ఉ॥10.00 గం.లకు

షెడ్యూలు

గ్రామం (1) : గుణదల — మండలం పేరు : విజయవాడ తూర్పు

క్రమ సంఖ్య	సర్వే నెం.	భూమి రకం	భూమి స్వభావం	విస్తీర్ణం చ॥మీటర్లు	భూమి యజమాని / ఆసక్తికల వ్యక్తుల పేర్లు	పట్టాదార్ (పి) & ఆనందించే వ్యక్తి (ఇ) లేదా (పి & ఇ)	కట్టడములు మరియు చెట్ల వివరములు
1	2	3	4	5	6	7	8
1	448/1C1	ప్రైవేట్	మెట్ట	27.17	VMC రోడ్	(పి & ఇ)	
2		ప్రైవేట్	మెట్ట	209.29	1. ధనేకుల రామారావు, S/o. వెంకట సుబ్బయ్య, 2.ధనేకుల వీర రాఘవయ్య S/o. వెంకట సుబ్బయ్య	(పి & ఇ)	కాంపౌండ్ వాల్ & బేస్‌మెంట్, ఐరన్ గ్రిల్, వేప చెట్లు-2
3	448/2C1A	ప్రైవేట్	మెట్ట	70.13	యలమంచలి వెంకటేశ్వరరావు, S/o. బసవయ్య	(పి & ఇ)	ACC షెడ్, ACC హౌస్, నిద్రగన్నేరు (2 కాండంతో 1 చెట్టు)
4		ప్రైవేట్	మెట్ట	36.78	VMC రోడ్	(పి & ఇ)	
5		ప్రైవేట్	మెట్ట	73.76	సూర్యదేవర నాగ దుర్గ W/o. రాఘవ రావు	(పి & ఇ)	కాంపౌండ్ వాల్
6	448/2C2A	ప్రైవేట్	మెట్ట	88.90	AMR హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ & ARC ఇన్ఫ్రా	(పి & ఇ)	కాంపౌండ్ వాల్ & బేస్మెంట్ మెట్ల కేసు, ACC జనరేటర్ గది, కంట్రోల్ ప్యానెల్ మరియు ట్రాన్స్‌ఫార్మర్
7		ప్రైవేట్	మెట్ట	150.15	వైష్ణవి ఎస్టేట్స్, కోమటినేని శ్రీనివాసరావు, S/o. కె. పట్టాభి రామయ్య	(పి & ఇ)	బేస్మెంట్ & స్టెప్స్ ట్రాన్స్‌ఫార్మర్
8		ప్రైవేట్	మెట్ట	31.68	VMC రోడ్	(పి & ఇ)	
9	451/3A	ప్రైవేట్	మెట్ట	48.98	1.నోటి లక్ష్మి,W/o. మాల్యాద్రి రెడ్డి 2. మాల్యాద్రి రెడ్డి, S/o. కొండా రెడ్డి	(పి & ఇ)	కాంపౌండ్ వాల్ & బేస్మెంట్ వేప చెట్టు-1 నెం., ఇనుప ద్వారం
10		ప్రైవేట్	మెట్ట	30.01	VMC రోడ్	(పి & ఇ)	
11		ప్రైవేట్	మెట్ట	46.18	దేవినేని క్రాంతి, D/o. దేవినేని రాజశేఖర్ (నెహ్రూ)	(పి & ఇ)	RCC బిల్డింగ్ 1వ అంతస్తు & 2వ అంతస్తు, బేస్మెంట్, కాంపౌండ్ వాల్
12		ప్రైవేట్	మెట్ట	65.16	దోనేపూడి లక్ష్మి W/o. D.K.R.K. రవి ప్రసాద్	(పి & ఇ)	కాంపౌండ్ వాల్, ఐరన్ గేట్
13		ప్రైవేట్	మెట్ట	28.01	VMC రోడ్	(పి & ఇ)	
14		ప్రైవేట్	మెట్ట	77.28	1.మోరంపూడి నిత్య చౌదరి & 2.మోరంపూడి సత్య చౌదరి, సంరక్షక తల్లి శ్రీమతి మోరంపూడి మణి చందన, W/o. అనిల్ కుమార్	(పి & ఇ)	కాంపౌండ్ వాల్, ఐరన్ గ్రిల్, కొబ్బరిచెట్టు-1, వేపచెట్టు-1 & అశోక వృక్షాలు-2
15	452/1C1A	ప్రైవేట్	మెట్ట	45.90	కోనేరు శోభా రాణి, W/o. వెంకట రామారావు	(పి & ఇ)	బేస్మెంట్, RCC బిల్డింగ్ కార్నర్
16		ప్రైవేట్	మెట్ట	22.40	VMC రోడ్	(పి & ఇ)	
17		ప్రైవేట్	మెట్ట	56.22	గుళ్లపల్లి సుప్రియ, D/o. సత్యనారాయణ	(పి & ఇ)	బేస్మెంట్, RCC బిల్డింగ్ కార్నర్
18	453/3B1A	ప్రైవేట్	మెట్ట	4.03	వలూరుపల్లి నిర్మల, W/o. సుబ్రమణేశ్వర వర ప్రసాద్	(పి & ఇ)	
19		ప్రైవేట్	మెట్ట	23.02	VMC రోడ్	(పి & ఇ)	
20		ప్రైవేట్	మెట్ట	69.25	అట్లూరు సాయి, W/o. సి.హెచ్. విట్టల్ కుమార్	(పి & ఇ)	బేస్మెంట్ + గ్రానైట్ కాంపౌండ్ వాల్
21		ప్రైవేట్	మెట్ట	63.16	గద్దె సత్యప్రీతి W/o. చిత్రధర్	(పి & ఇ)	బేస్మెంట్, కాంపౌండ్ వాల్ & ట్రాన్స్‌ఫార్మర్
22		ప్రైవేట్	మెట్ట	26.19	VMC రోడ్	(పి & ఇ)	
23		ప్రైవేట్	మెట్ట	24.42	ముత్తంశెట్టి విజయ నిర్మల, W/o. కృష్ణారావు	(పి & ఇ)	బేస్మెంట్, RCC బిల్డింగ్ 3 అంతస్తులు, ట్రాన్స్‌ఫార్మర్ & బిల్డింగ్ స్టెప్స్
24	453/3B2A	ప్రైవేట్	మెట్ట	29.04	ముత్తంశెట్టి విజయ నిర్మల W/o. కృష్ణారావు	(పి & ఇ)	సిమెంట్ నిర్మాణంతో ట్రాన్స్‌ఫార్మర్
25		ప్రైవేట్	మెట్ట	64.49	1. అవ్వ హేమ సుందర్ వర ప్రసాద్, S/o. అవ్వా వెంకట అప్పారావు & 2.యాళ్ళ మాధవి లత, W/o. అవ్వ హేమ సుందర్ వర ప్రసాద్	(పి & ఇ)	కాంపౌండ్ వాల్, బేస్మెంట్ & ట్రాన్స్ఫార్మర్, మద్రాస్ టైల్స్ రూమ్
26		ప్రైవేట్	మెట్ట	22.06	VMC రోడ్	(పి & ఇ)	
27		ప్రైవేట్	మెట్ట	56.99	డాక్టర్ శ్రీమతి. అక్కినేని మణి, W/o. సుదర్శన రావు	(పి & ఇ)	బేస్మెంట్, కాంపౌండ్ వాల్
28	453/4B1	ప్రైవేట్	మెట్ట	70.20	వలూరుపల్లి నిర్మల, W/o. సుబ్రహ్మణేశ్వర వర ప్రసాద్	(పి & ఇ)	కాంపౌండ్ వాల్ & స్టెప్‌లతో బేస్‌మెంట్
29		ప్రైవేట్	మెట్ట	7.42	VMC రోడ్	(పి & ఇ)	
30	455/2C1	ప్రైవేట్	మెట్ట	48.44	వరుణ్ గ్రూప్స్ ఆఫ్ కంపెనీస్ నోవోటెల్	(పి & ఇ)	కాంపౌండ్ వాల్
31		ప్రైవేట్	మెట్ట	42.67	1. వీరమాచినేని అచ్యుతరావు 2. వీరమాచినేని భవానీ శంకర్ రావు	(పి & ఇ)	ఐరన్ గ్రిల్స్‌తో కూడిన కాంపౌండ్ వాల్
32		ప్రైవేట్	మెట్ట	47.28	కొమ్మా శ్రీ లక్ష్మి, W/o. శివ దుర్గా ప్రసాద్	(పి & ఇ)	ఐరన్ గ్రిల్స్‌తో కూడిన కాంపౌండ్ వాల్
33		ప్రైవేట్	మెట్ట	63.46	పర్వతనేని వజ్రమ్మ, W/o. చలపతి రావు	(పి & ఇ)	ఐరన్ గ్రిల్స్‌తో కూడిన కాంపౌండ్ వాల్
34	455/3B1A	ప్రైవేట్	మెట్ట	6.32	వరుణ్ గ్రూప్స్ ఆఫ్ కంపెనీస్ నోవోటెల్	(పి & ఇ)	

గ్రామం (2) : విజయవాడ పట్టణం (VMC) — మండలం పేరు : విజయవాడ తూర్పు

క్రమ సంఖ్య	సర్వే నెం.	భూమి రకం	భూమి స్వభావం	విస్తీర్ణం చ॥మీటర్లు	భూమి యజమాని / ఆసక్తికల వ్యక్తుల పేర్లు	పట్టాదార్ (పి) & ఆనందించే వ్యక్తి (ఇ) లేదా (పి & ఇ)	కట్టడములు మరియు చెట్ల వివరములు
35	1399/1	ప్రైవేట్	ఇంటి స్థలాలు	10.68	శ్రీ మహమ్మద్ రియాజుద్దీన్ & మహ్మద్ ఇసాజుద్దీన్	(పి & ఇ)	ఐరన్ గ్రిల్‌తో కూడిన కాంపౌండ్ వాల్, జామ చెట్టు - 1 నం
36		ప్రైవేట్	ఇంటి స్థలాలు	2.32	సూరపనేని శ్రీచరణ్, S/o. పూర్ణచంద్రరావు	(పి & ఇ)	కాంపౌండ్ వాల్, RCC భవనం
37		ప్రైవేట్	ఇంటి స్థలాలు	77.94	శ్రీమతి పరుచూరి లక్ష్మీరాజ్యం, W/o. జనార్ధనరావు	(పి & ఇ)	RCC బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్, 1వ అంతస్తు & 2వ అంతస్తు మరియు కాంపౌండ్ వాల్
38		ప్రైవేట్	ఇంటి స్థలాలు	40.22	VMC రోడ్	(పి & ఇ)	
39	1400/1	ప్రైవేట్	మెట్ట	600.33	శ్రీ వల్లూరు వెంకట బసవయ్య, S/o. (లేట్) వల్లూరు వెంకట సుబ్బారావు	(పి & ఇ)	అంశం-1: RCC బిల్డింగ్, గ్రౌండ్ ఫ్లోర్, 1వ అంతస్తు, 2వ అంతస్తు అంశం-2: RCC బిల్డింగ్, గ్రౌండ్ ఫ్లోర్, గ్రానైట్‌తో 1వ అంతస్తు & మెట్ల కేస్, ఐరన్ గ్రిల్స్‌తో కూడిన కాంపౌండ్ వాల్, ఐరన్ గేట్లు-4, బేస్‌మెంట్ కాంక్రీట్ ఫ్లోరింగ్, ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్, జామ చెట్టు- 1 నెం.,
40		ప్రైవేట్	మెట్ట	13.09	VMC రోడ్	(పి & ఇ)	
41		ప్రైవేట్	మెట్ట	76.83	శ్రీమతి వల్లూరు సంధ్యా రాణి, W/o. (లేట్) కృష్ణారావు	(పి & ఇ)	ACC షెడ్
42	1420/1	ప్రైవేట్	ఇంటి స్థలాలు	106.18	శ్రీ వల్లూరి మధుసూధనరావు. S/o. కేశవ రావు	(పి & ఇ)	GA షీట్లు & ఇనుప పైపులతో కూడిన కాంపౌండ్ ఫెన్సింగ్
			మొత్తం విస్తీర్ణం	2704.03			

సం/- శ్రీమతి అదితి సింగ్, I.A.S.,
కాంపిటెంట్ అథారిటీ భూ సేకరణ &
సబ్ కలెక్టర్, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా

టిడిపి నేత వరుపుల రాజా ఆకస్మిక మృతి

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్, ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి వరుపుల రాజా శనివారం రాత్రి మృతి చెందారు. గుండెపోటు రావడంతో ఆయనను కాకినాడలోని అపోలో ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 1977లో జన్మించిన రాజా 1997లో ఆంధ్రా యూనివర్సిటీలో బికామ్ విద్యను పూర్తి చేశారు. ఆయన అసలు పేరు జోగిరాజు. అందరూ రాజా అని పిలుస్తుంటారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిసిసిబి అధ్యక్షునిగా పని చేశారు. 2004లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆయన గతంలో ఆప్కాబ్ వైస్ చైర్మన్‌గా, టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా కూడా వ్యవహరించారు.

చంద్రబాబు సంతాపం

రాజా మృతి పట్ల టిడిపి అధినేత చంద్రబాబు సంతాపం తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ పార్టీ బలోపేతానికి రాజా చేసిన సేవలు చిరస్మరణీయమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజా ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే గుండెపోటుతో మతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. డిసిసిబి చైర్మన్‌గా ఆయన చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. రాజా కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నేడు కలగంపూడికి సిఎం జగన్

ప్రజాశక్తి - యలమంచిలి

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలోని కలగంపూడిలో ఆదివారం జరగనున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహానికి సిఎం జగన్ హాజరు కానున్నారు. ఆయన పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలగంపూడిలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను, కల్యాణ వేదికను కలెక్టర్, ఎస్‌పి యు.రవిప్రకాష్, ఇన్‌ఛార్జి జెసి ఎం.సూర్యతేజ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.

కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా కేటాయించిన విధులు బాధ్యతతో నిర్వర్తించి ఎక్కడా ఏ చిన్న పొరపాటూ దొర్లకుండా సిఎం పర్యటన విజయవంతం చేయాలన్నారు. అనంతరం సంబంధిత అధికారుల పర్యవేక్షణలో హెలికాప్టర్ ట్రయల్‌రన్, కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. సిఎం జగన్ ఆదివారం సాయంత్రం 4:20 గంటలకు కలగంపూడిలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి బయల్దేరి ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కళ్యాణ వేదిక వద్దకు 4.35కు చేరుకుంటారు. అక్కడ వధూవరులను ఆశీర్వదించి 4.55కు అక్కడి నుంచి వెనుదిరిగి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలీకాప్టర్‌లో విజయవాడ బయల్దేరి వెళ్తారు.

ఆక్వా జోన్‌లోకి మరో 229 ఎకరాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పు గోదావరి జిల్లాలో 229.09 ఎకరాల్లో నాన్ ఆక్వా జోన్ పరిధిలోని చెరువులను రెండే ఫేజ్‌లో ఆక్వా జోన్‌లోకి మార్పు చేసినట్టు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. జిల్లాలో ఆక్వా సాగు విస్తీర్ణం పెంపొందించే దిశలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు డిఎల్ఎస్‌లో రెండు ఫేజ్‌లో 106 మంది రైతులకు చెందిన 229.09 ఎకరాలను ఆక్వా జోన్‌లోకి మార్చామన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా మత్స్యశాఖ అధికారి కెవి.కృష్ణారావు, ఇతర సమన్వయ శాఖల అధికారులతో కలిసి 2వ ఫేజ్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మత్స్య రంగానికి మరింత ప్రోత్సాహం అందించి మార్కెటింగ్‌ను ప్రోత్సహించడం ద్వారా ఆక్వా రంగంలో మరిన్ని ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆదిశగా జిల్లా స్థాయి కమిటీ నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జిల్లాలోని ఆరు మండలాల్లో గుర్తించిన 9 మండలాల్లో 29 గ్రామాల్లో 1,197.02 ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 967.93 ఎకరాలను జిల్లాలోని నాన్ ఆక్వాజోన్ నుంచి ఆక్వా జోన్‌గా మార్చేందుకు ఫేజ్-1లో ఆమోదించామన్నారు. ఇంకా జిల్లాలో 1,529 ఎకరాలు నాన్ ఆక్వా జోన్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. గ్రామ సభలో ఆమోదం పొందని కారణంగా అనుమతులు ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్‌టిజి.సత్యగోవింద్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ఎత్తివేసే ఆలోచన లేదు

- వాల్తేరు డిఆర్ఎం అనుపమకుమార్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

అమృత్‌భారత్ పథకంలో భాగంగా ఎంపికైన స్థానిక టౌన్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసి ప్రయాణీకులకు అధునాతనమైన సౌకర్యాలు అందించే ఆలోచనే తప్ప స్టేషన్‌ను ఎత్తివేసే ప్రతిపాదనలేవీలేవని వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ అనుపమకుమార్ శథపతి అన్నారు. శనివారం పార్వతీపురం (బెలగాం) స్టేషన్‌లో జరుగుతున్న మూడో లైన్ పనులతో పాటు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించేందుకు ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు ఆయన్ను తొలుత మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు టిడిపి శ్రేణులతో కలిసి టౌన్‌స్టేషన్ ఎప్పటిలాగే కొనసాగించాలని వినతిని అందించారు. అనంతరం జనసేన, వినియోగదారుల సంఘం నాయకులు కలిసి ఈ మేరకు వినతి అందించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు డిఆర్ఎంను కలిసి టౌన్‌స్టేషన్ ఎత్తివేతపై జరుగుతున్న ప్రచారానికి స్పష్టమైన ప్రకటన చేసి భయాందోళనలకు తెరదించాలని కోరారు. దీనికి డివిజనల్ రైల్వే మేనేజర్ మాట్లాడుతూ అమృత్ భారత్ పథకంలో డివిజన్‌లో 16 రైల్వేస్టేషన్లు ఎంపికయ్యాయని, అందులో పార్వతీపురం స్టేషన్ ఒకటని అన్నారు. రూ.200కోట్లతో ఈ స్టేషన్లన్నీ పూర్తి స్థాయిలో ఆభివృద్ధి చేసి ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పార్వతీపురం టౌన్ స్టేషన్ ఎత్తివేతపై తాము ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. అయితే ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొన్ని అక్కడ, ఇక్కడ ఆగుతున్న మాట నిజమేనని, రెండు, మూడు, కిలోమీటర్ల దూరంలో సూఫర్‌పాస్ట్ రైళ్లు ఆగి, మళ్లీ వెంటనే బయలుదేరడంతో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురౌతున్నాయని తెలిపారు.

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్
అమరావతి బ్రాంచ్
నెం.620, బాపూజీ నగర్, అమరావతి, గుంటూరు జిల్లా
ఫోన్ నెం.: 08645-255551. ఈ-మెయిల్ ఐడి :iob3788@iob.in

స్వాధీనతా ప్రకటన (APPENDIX IV)(స్థిరాస్తుల కొరకు) (రూల్ 8(1))

ఇందుమూలముగా, **ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 ప్రకారం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, నందలి రూలు 3 తో కలిపి చదవవలసిన సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **తేది.13.05.2022**న జారీ చేసిన **డిమాండ్ నోటీసు** ద్వారా అందిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొనబడిన మొత్తం బకాయి **తేది.30.04.2022 నాటికి రూ.17,92,392/-** మరియు అంగీకరించిన డెబిట్ చేయని వడ్డీ యొక్క కాంట్రాక్చువల్ రేటు మరియు రెస్ట్‌ల ప్రకారం తదుపరి వడ్డీ, ఛార్జీలు కలిపి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీతలు : శ్రీ టి.కోటేశ్వర రావు, తండ్రి : టి. శంకరయ్య,** నెం.2-157, మల్లాది, గుంటూరు జిల్లా-522020, మరియు **టి. వంశీ కృష్ణ, తండ్రి : కోటేశ్వర రావు,** నెం.2-118, మల్లాది, గుంటూరు జిల్లా-522020 వార్లను కోరుతూ డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.

(1)ఋణగ్రహీతలు సదరు బకాయి సొమ్మును డిమాండ్ నోటీసు ప్రకారం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని రూల్సు నందలి రూల్ 8తో చదివే సదరు సెక్షన్ 13(4) క్రింద దిగువ పేర్కొన్న ఆస్తిని **తేది.02.03.2023** న **స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(2)ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా **తేది.30.04.2022 నాటికి రూ.17,92,392/-** మరియు అంగీకరించిన డెబిట్ చేయని వడ్డీ యొక్క కాంట్రాక్చువల్ రేటు మరియు రెస్ట్‌ల ప్రకారం డిమాండ్ నోటీసు తేది నుండి పూర్తి చెల్లించే వరకు అయిన వడ్డీ, ఛార్జీలతో సహా, డిమాండ్ నోటీసు జారీచేసిన తరువాత మీ తదుపరి చెల్లింపులు ఏమైనా తగ్గించుకుని **ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్** వారి ఛార్జీకి లోబడి వుండునని, ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. **పైన తెలిపిన** డిమాండ్ నోటీసు తేది నాటి నుండి, జారీ చేసి తరువాత నేటి వరకు గల ఏమైనా చెల్లింపులు ఉంటే వాటిని మినహాయించబడును. స్వాధీనత తేది నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.18,89,142/-** మరియు కాంట్రాక్చువల్ రేటు & రెస్ట్‌ల ప్రకారం అయిన తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి, తిరిగి చెల్లించే తేది వరకు.

(3)ఋణగ్రహీత, సెక్యూర్డు ఆస్తుల ఋణ విమోచనంనకు గల కాలపరిమితి గురించి సదరు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లో గల నిబంధనలు పై శ్రద్ధ వహించవలెను.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా-522020, అమరావతి మండలం, మల్లాది గ్రామం, పోలేరమ్మ గుడి ప్రక్కన, మల్లాది గ్రామ డి.నెం.21-3, అసెస్‌మెంట్ నెం.158, డి.నెం.2-157 వద్ద ఉన్న 934 చ॥అ॥ల గ్రౌండ్ ఫ్లోర్ మరియు 934 చ॥అ॥ల ఫస్ట్ ఫ్లోర్ కలిగిన రెసిడెన్షియల్ భవనము యావత్తు ఆస్తి టి. కోటేశ్వర రావు గారి పేరున ఉన్నది.
హద్దులు : ఉత్తరం : పోలేరమ్మ గుడి స్థలం, **దక్షిణం :** భావిరిశెట్టి సుబ్బారావు స్థలం మరియు ఇంటి స్థలం, **తూర్పు :** బజారు, **పడమర :** తులసి పెద్ద కోటేశ్వర రావు గారి స్థలం.

తేది : 02.03.2023 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : అమరావతి — ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
भारत सरकार का उपक्रम A Government of India Undertaking (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
आन्ध्रा Andhra — कार्पोरेशन Corporation
అజిత్‌సింగ్ నగర్ బ్రాంచి, విజయవాడ, కృష్ణా జిల్లా.

ఈ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ **సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అజిత్‌సింగ్ నగర్ శాఖ** ఆధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదిన** దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల నుండి ది. 29-06-2022 వరకు రావలసిన **బకాయి మొత్తము రూ. 25,67,217.50/- (అక్షరాలా ఇరవై ఐదు లక్షల అరవై ఏడు వేల రెండు వందల పదిహేడు రూపాయల యాభై పైసలు మాత్రమే)** మరియు ది. 29-06-2022 నుండి కాంట్రాక్టువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అజిత్‌సింగ్ నగర్ శాఖ వారిచే** ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 10-03-2023**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరు తేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు

ఋణగ్రహీత / హామీదారుల వివరములు : 1) శ్రీ బలుగూరి వెంకటేశ్వరరావు, తండ్రి : నరసయ్య, డి.నెం. 43-107/1-2ఎ, కనకదుర్గ నగర్, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ-520015. **2) శ్రీమతి బలుగూరి శ్రీ వెంకట పద్మావతి,** భర్త : వెంకటేశ్వరరావు, డి.నెం. 43-107/1-2ఎ, కనకదుర్గ నగర్, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ - 520015. **3) శ్రీ ఉమామహేశ్వరరావు,** తండ్రి : వెంకటేశ్వరరావు, డి.నెం. 43-107/1-2ఎ, కనకదుర్గ నగర్, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ-520015.

స్థిరాస్తి వివరములు

విజయవాడ, ముత్యాలంపాడు, అంబాపురం రోడ్డు దగ్గర, ఆంధ్రపత్రిక ఎంప్లాయిస్ కాలనీ, ఎదుటి డోర్ నెం. 43-107/1-107, అసెస్ట్ నెం. 139665, ఆర్.ఎస్.నెం. 5/1, ప్లాట్ నెం. 98 వద్ద 272 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ నివాస స్థలము. **హద్దులు : తూర్పు :** 33 అ॥ వెడల్పు గల మున్సిపల్ రోడ్డు, **దక్షిణం :** టి.యం. శేషశయన రామ్‌నాయుడు గారికి చెందిన ప్లాట్ నెం. 97, **పడమర :** వి. దేవరాజు ఇతరులకి విక్రయించిన ప్లాట్ నెం. 78, **ఉత్తరం :** వి. దుర్గారావు గారికి చెందిన ప్లాట్ నెం. 99

రిజర్వుధర (రూ.) : 78,00,000/- ధరావత్తు ధర (రూ.) : రూ. 7,80,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://www.ibapi.in** మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : **www.unionbankofindia.co.in** నందు చూడగలరు. అధీకృత అధికారి శ్రీ రహ్మాన్ షేక్ ముజీబర్ గారికి కి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు అధీకృత అధికారి మొబైల్ నెం. **7386868114, Mail ID: UBIN0802239@unionbankofindia.bank** లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 21-02-2023 — సం/- ఆధరైజ్డ్ ఆఫీసర్,
ప్రదేశం : విజయవాడ — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
भारत सरकार का उपक्रम A Government of India Undertaking (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
आन्ध्रा Andhra — कार्पोरेशन Corporation
గాంధీనగర్ బ్రాంచి : గాంధీనగర్, విజయవాడ, కృష్ణా జిల్లా.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 తో చదువుతూ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 (6) ప్రకారం స్థిరాస్తుల యొక్క అమ్మకం కొరకు ఈ వేలం అమ్మకం నోటీసు. **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గాంధీనగర్ (01421)** బ్రాంచి అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదిన** దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల నుండి ది. 03-09-2021 వరకు రావలసిన **బకాయి మొత్తం రూ. 36,51,927.03/- (అక్షరాలా ముప్పై ఆరు లక్షల యాభై ఒక్క వేయి తొమ్మిది వందల ఇరవై ఏడు రూపాయల మూడు పైసలు మాత్రమే)** మరియు ది. 03-09-2021 నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గాంధీనగర్ (01421) బ్రాంచి వారిచే** ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 28-03-2023**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. **బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు.**

ఋణగ్రహీతల వివరములు : మెస్సర్స్ లక్కీ ఎంటర్‌ప్రైజెస్, **ప్రొ॥ శ్రీ ఓలేటి వెంకట పార్థసారథి,** 26-4-39/1, జ్ఞానోలివ్ వీధి, గాంధీనగర్, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 520003. **ప్రొప్రైయిటర్ : ఓలేటి వెంకట పార్థసారథి,** డి.నెం. 23-4-2, 1వ అంతస్తు, బ్రహ్మయ్య పంతులు వీధి, సత్యనారాయణపురం, విజయవాడ-520011. **హామీదారు : శ్రీమతి ఓలేటి సీతామహాలక్ష్మి,** డి.నెం. 23-4-2, 1వ అంతస్తు, బ్రహ్మయ్య పంతులు వీధి, సత్యనారాయణపురం, విజయవాడ-520011.

ఆస్తి వివరములు : రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం. 6566/2016, తేది : 20-06-2016 : శ్రీమతి ఓలేటి సీతా మహాలక్ష్మి, భర్త : శ్రీ ఓలేటి వెంకట పార్థసారధి గారి పేరిట కృష్ణా జిల్లా, విజయవాడ, కొత్త రాజరాజేశ్వరిపేట, సుబ్బరాజునగర్, దగ్గరి డి.నెం. 20-4/1-43, ఆర్.ఎస్.నెం. 6/1, ప్లాట్ నెం. 2 & 3 నందు 291.66 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ నివాస ఇంటి స్థలమునకు **హద్దులు : తూర్పు :** ఆర్.ఎస్.నెం. 6/2, **దక్షిణం :** ప్లాట్ నెం. 4కి చెందిన ఆస్తి, **పడమర :** డొంక రోడ్డు, **ఉత్తరం :** 1బి కిచెందిన ఆస్తి & ఆర్.ఎస్.నెం. 6/2.

రిజర్వు ధర : రూ. 25,60,000/- ధరావత్తు : రూ. 2,56,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : www.unionbankofindia.co.in** నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు **అధీకృత అధికారి/ చీఫ్ మేనేజర్ గారు శ్రీ షేక్ ముజీబుర్ రెహ్మాన్** గారి మొబైల్ నెం. **94406 95161, Branch Mail ID: ubin0801429@unionbankofindia.bank** లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 04-03-2023 — సం/- ఆధరైజ్డ్ ఆఫీసర్,
ప్రదేశం : విజయవాడ — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మొక్కజొన్న రైతు మొర..!



- కంపెనీ సీడ్స్‌తో తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- నాణ్యత లేని సీడ్స్‌తో రెండు టన్నులూ రాని దిగుబడి
- సీడ్ కంపెనీలపై కొరవడిన ప్రభుత్వ పర్యవేక్షణ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నూజివీడు మండలం పోలసానిపల్లికి చెందిన రైతు వేమూల వెంకట్రావు ఏడెకరాల్లో ఓ ప్రముఖ కంపెనీ ఇచ్చిన మొక్కజొన్న సీడ్స్ సాగు చేశాడు. ఎకరాకు నాలుగు నుంచి ఆరు టన్నులు దిగుబడి వస్తుందని కంపెనీ ప్రతినిధులు చెప్పి సీడ్స్ ఇచ్చారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి ఎకరాకు రెండు టన్నులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైన రైతు వెంకట్రావు గుళికలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు'.

'మొక్కజొన్న సీడ్స్‌కు చెందిన ఓ కంపెనీ ఇచ్చిన విత్తనాలను నూజివీడు మండలం గొల్లపల్లి పరిసర ప్రాంత రైతులు సాగు చేశారు. నాలుగు టన్నులకుపైగా రావాల్సిన దిగుబడి కాస్తా టన్ను రావడమే గగనంగా మారడంతో రైతులు రోడ్డెక్కి, 14 గంటలపాటు ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో నిరవధిక ధర్నా నిర్వహించారు.'

పైన పేర్కొన్న రెండు ఘటనలే కాదు.. కంపెనీలకు సంబంధించిన సీడ్స్ సాగు చేసి నష్టపోయిన ఎంతోమంది రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. మొక్కజొన్న సీడ్స్ కంపెనీలపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు పరిస్థితి తయారైంది. ఏలూరు జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేశారు. దీనిలో దాదాపు 65 వేల ఎకరాల్లో కంపెనీలు ఇచ్చిన సీడ్స్‌నే రైతులు సాగు చేశారు. సీడ్స్ ఇచ్చేటప్పుడు ఎకరాకు నాలుగు నుంచి ఆరు టన్నుల దిగుబడి వస్తుందని కంపెనీ ప్రతినిధులు రైతులకు చెప్పి అంటగడుతున్నారు. మూడు నెలల తర్వాత పంట చేతికొచ్చే సమయానికి రెండు టన్నులు కూడా రావడం లేదు. నిబంధనల ప్రకారం సీడ్స్ సాగు చేసిన రైతు నష్టపోతే విత్తనాలు ఇచ్చిన కంపెనీలే రైతులను ఆదుకోవాలి. ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వమేనని చెప్పొచ్చు. కంపెనీలు రైతులకు సీడ్స్ ఇచ్చేటప్పుడు అధికారులు జోక్యం చేసుకుని అగ్రిమెంట్లు రాయించే విధంగా చర్యలు తీసుకోవాలి. సీడ్స్ కంపెనీలపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ప్రయివేటు రైతులు తీవ్రంగా నష్టపోతున్నా సీడ్స్ కంపెనీలు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఎంఎల్ఎలు, ఎంపీలు సైతం రైతుల గురించి పట్టించుకోకపోవడంతో సీడ్స్ కంపెనీలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. రైతు సంఘాలు జోక్యం చేసుకుని ఆందోళనలు చేస్తే తప్ప రైతులకు ఎంతోకొంత న్యాయం జరిగే పరిస్థితి ఉంది. ప్రభుత్వ అధికారులు నష్టపోయిన రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోని దుస్థితి నెలకొంది. నష్టపోయిన రైతులు కొన్నిచోట్ల ఆందోళనలకు దిగుతుండగా, మరికొన్నిచోట్ల సీడ్స్ కంపెనీల దురాగతాలను రైతులు మౌనంగా భరిస్తున్నారు. నూజివీడు మండలంలో జరిగిన ఘటనల్లో ఏపి రైతుసంఘం నాయకులు జోక్యం చేసుకుని రైతులకు ఎంతోకొంత న్యాయం జరిగేలా చేశారు. ఇప్పటికైనా రైతులతో అగ్రిమెంట్లు చేసే విధంగా సీడ్స్ కంపెనీలకు నిబంధనలు అమలు చేయకపోతే మొక్కజొన్న రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారు కానుంది. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు.

కమర్షియల్ పంట ధర ఆశాజనకం

జిల్లాలో దాదాపు 35 వేల ఎకరాల్లో మొక్కజొన్న కమర్షియల్ సీడ్‌ను రైతులు సాగు చేశారు. కొద్దిరోజుల్లో పంట చేతికిరానుంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మొక్కజొన్న కమర్షియల్ పంటకు క్వింటాకు రూ.1962 ఉండగా ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో క్వింటా రూ.2300 నుంచి రూ.2500 వరకూ పలుకుతోంది. పంట చేతికొచ్చే సమయంలో వ్యాపారులు ధర తగ్గించేస్తారేమోననే భయం రైతులను వెంటాడుతోంది. దీంతో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వ మద్దతు ధరకంటే బహిరంగ మార్కెట్లో ధర తక్కువగా ఉంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఆలోచన చేసే పరిస్థితి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ ఇబ్బంది లేకపోయినా ముందుముందు ఇబ్బంది రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

కుల ధ్రువీకరణ పత్రం విషయంలో ఘర్షణ
ఒకరు మృతి, నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

కుల ధ్రువీకరణ పత్రం మంజూరు విషయంలో గుత్తి పట్టణంలోని జంగాల కాలనీలో శనివారం ఘర్షణ చోటుచేసుకుంది. తహశీల్దారు ఎస్.మహబూబ్ బాషా సమక్షంలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలో ఒకరు మృతి చెందగా నలుగురుకి తీవ్ర గాయాలయ్యాయి. బాలసంతు కుల ధ్రువీకరణ పత్రం మంజూరుకు సంబంధించి తహశీల్దార్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సందీప్‌తో కలిసి జంగాల కాలనీకి విచారణకు వెళ్లారు. రెవెన్యూ అధికారులు విచారణ చేస్తుండగా ఇరు వర్గాలకు చెందిన జంగాల కులస్తులు ఘర్షణ పడ్డారు. ఒకరినొకరు కర్రలతో బాదుకున్నారు. ఇందులో ఒకరు తమను ఎస్‌సి జాబితాలో చేర్చాలని, మరొకరు బీసీ-ఎ జాబితాలో చేర్చాలని గొడవపడ్డారు. ఈ ఘర్షణలో జమ్మన్న (55) మృతి చెందాడు. ఆశ్వ పెద్ద మారెన్న, అశ్వ చిన్న మారెన్న, కుల్లాయమ్మ, దేవా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



విద్యార్థులకు ఉచితంగా 'సార్'

పాఠశాల విద్యార్థులకు ధనుష్ హీరోగా నటించిన 'సార్' సినిమా ఉచితంగా చూపిస్తామని నిర్మాణ సంస్థ ప్రకటించింది. ఈ విషయం తెలుపుతూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. 'చదువు విలువను అందరికి తెలియచెప్పడమే సినిమా ప్రధాన లక్ష్యం. అందుకే ఈ చిత్రాన్ని పాఠశాల విద్యార్థులకు ఉచితంగా చూపెట్టాలనుకుంటున్నాం. contact@sitharaents.com కు మీ వివరాలు మెయిల్ చేయండి. మా బృందం మిమ్మల్ని సంప్రదించి వీలైనంత త్వరగా మూవీని చూపెడుతుంది' అని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్య దేవర నాగవంశీ ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టారు.

8న 'దసరా' మూడో పాట

నాని హీరోగా నటిస్తున్న దసరా చిత్రం నుండి మూడో పాటను ఈ నెల 8న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. తెలుగుతో పాటుగా, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఈనెల 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్ కార్యక్రమాలు ప్రారంభించిన మేకర్స్ తాజాగా ఈ సినిమాలోని 'చమ్కీల అంగీలేసి' అనే మూడో పాట విడుదల తేదీ చెబుతూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు.





'మామా మశ్చీంద్ర' రెండో పోస్టర్

సుధీర్ బాబు హీరోగా హర్షవర్ధన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'మామా మశ్చీంద్ర' సినిమా నుండి హీరో సెకండ్ లుక్‌ను విడుదలచేశారు. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు నిర్మిస్తున్న ఈ సినిమాలో మూడు విభిన్న షేడ్స్ ఉన్న పాత్రల్లో సుధీర్ బాబు కనిపించబోతున్నారు. ఇప్పటికే లావుగా ఉన్న దుర్గ క్యారెక్టర్ పరిచయం చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. తాజాగా రెండో లుక్ పరశురామ్ క్యారెక్టర్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ ద్విభాషా చిత్రాన్ని సృష్టి సెల్యులాయిడ్ సోనాలి నారంగ్, సృష్టి సమర్పిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతం అందించగా, పిజి విందా సినిమాటోగ్రఫర్‌గా పని చేస్తున్నారు.

మే 5న 'రామబాణం'



మాస్ స్టార్ గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'రామబాణం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో ఈ చిత్రం రూపొందుతుంది. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల సంయుక్తంగా భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హీరోయిన్‌గా డింపుల్ హయతి నటిస్తుండగా, జగపతి బాబు, కుష్బు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం నుంచి మేకర్స్ కొత్త పోస్టర్ విడుదల చేశారు. 'ఇది పరీక్షల సమయం కావడంతో విద్యార్థులను ఆల్ ది బెస్ట్ చెబుతూ న్యూ పోస్టర్ ను వదిలారు. గోపీచంద్ పవర్ ఫుల్ లుక్ తో ఉన్న పోస్టర్ ఎంతగానో ఆకట్టుకుంటోంది. చిత్రాన్ని మే 5న విడుదల చేయబోతున్నట్లు పోస్టర్ లో పేర్కొన్నారు. ఛాయాగ్రహకుడుగా వెట్రి పళని స్వామి, సంగీత దర్శకుడిగా మిక్కీ జె మేయర్ వ్యవహరిస్తున్నారు. చిత్రంలోని ఇతర ముఖ్య పాత్రల్లో సచిన్ ఖేడ్ ఖర్, నాజర్, ఆలీ, రాజా రవీంద్ర, వెన్నెల కిషోర్, సప్తగిరి, కాశీ విశ్వనాథ్, సత్య, గెటప్ శ్రీను, సమీర్, తరుణ్ అరోరా నటిస్తున్నారు.



ఓటీటీలోకి 'అమిగోస్'

కల్యాణ్‌రామ్ ట్రిపుల్ రోల్‌లో నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'అమిగోస్'. ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిశ్రమ స్పందనలు అందుకుంది. అయితే, ప్రతి నాయకుడి పాత్రలో కల్యాణ్‌రామ్ నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఇక ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ అయ్యేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ 'అమిగోస్' స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ చిత్రం ఏప్రిల్ 1వ అందుబాటులోకి రానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని స్ట్రీమింగ్‌కు చేయనున్నారు. రాజేందర్‌రెడ్డి దర్శకత్వం వహించిన 'అమిగోస్'లో అషికా రంగనాథ్ కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

బ్రిటన్ పార్లమెంట్‌లో రాహుల్ ప్రసంగం?

లండన్ : కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. 10 రోజుల పర్యటన కోసం బ్రిటన్ వెళ్లిన రాహుల్ పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కాగా.. ఈ పర్యటనలో బ్రిటన్ పార్లమెంట్ లో రాహుల్ ప్రసంగించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈనెల 6వ తేదీన వెస్ట్‌మినిస్టర్ ప్యాలెస్‌లోని గ్రాండ్ కమిటీ రూమ్‌లో యూకే ఉభయ సభల ఎంపీలను ఉద్దేశించి ఆయన ప్రసంగించనున్నట్లు కాంగ్రెస్ నాయులు తెలిపారు. దీనిపై భారత సంతతికి చెందిన యూకే ఎంపీ వీరేంద్ర శర్మ స్పందిస్తూ “కేవలం రాజకీయాలపై మాత్రమే గాక, ఇరు దేశాల మధ్య ఉన్న సంస్కృతి, సామాజిక, వ్యాపార బంధంపై రాహుల్ ప్రసంగం ఉండనుంది” అని తెలిపారు. ఇటీవల కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ విద్యార్థులనుద్దేశిస్తూ రాహుల్ ప్రసంగించిన విషయం తెలిసిందే. పర్యటనలో భాగంగా ఆయన లండన్ లోని ప్రవాస భారతీయులతో ఇష్టాగోష్ఠిలో పాల్గొననున్నారు. దీంతో పాటు ఇండియన్ జర్నలిస్టు అసోసియేషన్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడనున్నారు.

కేంద్రంపై పోరాటానికి కపిల్ సిబాల్ కొత్త వేదిక

న్యూఢిల్లీ : కేంద్రంలోని బిజెపిపై పోరాటానికి ఎంపి, ప్రముఖ న్యాయవాది, కపిల్ సిబల్ కొత్త వేదికను ఏర్పాటు చేయనున్నారు.. కేంద్రంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనేందుకు 'ఇన్సాఫ్' పేరిట వేదికను స్థాపిస్తున్నట్లు శనివారం ప్రకటించారు. ప్రజల కోసం 'ఇన్సాఫ్ కే సిపాహి' పేరిట వెబ్‌సైట్‌ను సైతం అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఈ వేదిక ద్వారా ప్రజల తరపున లాయర్లు పోరాటం చేస్తారన్నారు. బిజెపియేతర పార్టీల ముఖ్యమంత్రులు, నేతలు తన ప్రయత్నానికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ నెల మార్చి 11న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఓ సమావేశం ఏర్పాటు చేసి తన ఈ వేదిక లక్ష్యాలను వివరిస్తానని కపిల్ సిబల్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న ఈ వేదికకు అండగా నిలవాలన్నారు. ఇది ప్రజల వేదిక అని, తాను ఎలాంటి రాజకీయ పార్టీ స్థాపించడం లేదని స్పష్టంచేశారు. దేశంలోని ప్రతి ప్రాంతంలోనూ ఆర్‌ఎస్‌ఎస్ తమ సిద్ధాంతాలను తీవ్రంగా ప్రచారం చేస్తుందని, దీనివల్ల అన్యాయాలు జరుగుతున్నాయన్నారు.

అతిపెద్ద ప్రమాదకారి అమెరికానే

- అణు యుద్ధ ముప్పుపై చైనా విదేశాంగ ప్రతినిధి

బీజింగ్ : ప్రపంచానికి అతిపెద్ద అణ్వాయుధ ముప్పు అమెరికా నుంచే పొంచి ఉందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ వ్యాఖ్యానించారు. తన అణ్వాయుధ సంపత్తిని విస్తరించుకునేందుకే చైనాపై అణు ముప్పు ఆరోపణలను అమెరికా చేస్తోందని ఆమె విమర్శించారు.
శనివారం నాడిక్కడ పత్రికా గోష్టిలో ఆమె మాట్లాడుతూ ఈనాడు ప్రపంచంలోకెల్లా అతిపెద్ద అణ్వాయుధ ముప్పు అమెరికా నుంచేనని విమర్శించారు. తన అణు విధానాన్ని అమెరికా జాగ్రత్తగా పునరాలోచించుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో అమెరికా భద్రతా విధానాన్ని మావో నింగ్ ప్రస్తావించారు. అణ్వాయుధాల పాత్రను తగ్గించడం, అణు ప్రమాదాలను తగ్గించడానికి అర్ధవంతమైన ఆచరణాత్మక చర్యలను చేపట్టడం ద్వారా అమెరికా తన జాతీయ భద్రతా విధానంలో నిరాయుధీకరణకు సంబంధించిన తన ప్రత్యేక, ప్రాథమిక విధి లేదా బాధ్యతను అత్యంత శ్రద్ధగా నెరవేర్చాల్సి వుందని మావో నింగ్ పేర్కొన్నారు. తన సైనిక గుత్తాధిపత్యాన్ని కొనసాగించేందుకే అమెరికా, చైనాను అణు ముప్పుగా చూపిస్తోందని విమర్శించారు. జాతీయ భద్రతా అవసరాలకు అనుగుణంగా కనీస స్థాయిలో అణు సామర్ధ్యాలతో రక్షణాత్మకమైన అణు వ్యూహాన్ని చైనా అనుసరిస్తోందని చెప్పారు.

ఇండొనేషియాలో అగ్నిప్రమాదం..

- 18 మంది మృతి
- 12 మంది గల్లంతు

జకర్తా : ఇండోనేషియా రాజధాని జకార్తాలో ప్రభుత్వ ఆధీనంలో నడిచే ఓ ఇంధన నిల్వ డిపోలో శుక్రవారం జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య 18కి చేరుకుంది. ఈ ప్రమాదంలో 50మందికిపైగా గాయపడ్డారు. అలాగే ఈ ప్రమాదంలో ఇంకా 12 మంది ఆచూకీ తెలియకపోవడం ఆందోళన కలిగిస్తుంది. ఉత్తర జకార్తాలోని తనహ్‌మేరా పరిసర ప్రాంతంలో ఆయిల్ డిపోలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. భారీ వర్షంతోపాటుగా పిడుగులు పడటంతో ఈ మంటలు వ్యాపించినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఆ తర్వాత ఇది అనేక పేలుళ్లకు కారణమైంది. దట్టమైన నల్లటి పొగ, ఎర్రటి మంటలు ఆకాశానికి ఎగిశాయి. అగ్నిమాపక సిబ్బంది ఆ మంటలను అదుపు చేశారు. ఇండోనేషియా రాష్ట్ర-యాజమాన్య సంస్థల మంత్రి ఎరిక్ థోహిర్ బాధితులకు, వారి కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేశారు. అగ్నిప్రమాదంపై క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని, సమాజానికి త్వరగా సహాయం చేయడంపై దష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షం సమయంలో డిపోలోని పైప్‌లైన్ పగిలిపోవడంతో మంటలు చెలరేగాయని, బహుశా మెరుపు దాడి వల్ల మంటలు చెలరేగాయని ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందన్నారు. ఇండోనేషియా ఇంధన అవసరాల్లో 25 శాతం మేర ఈ డిపో నుంచి సరఫరా చేస్తుందన్నారు.

'ఉపాధి'పై శీతకన్ను

- కార్మికులకు ఏడాదికిపైగా వేతన బకాయిలు
- ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా
- మీడియా సమావేశంలో తమ గోడు వెళ్లబోసుకున్న 'నరేగా' కార్మికులు
- ఉపాధి హామీ..రాజ్యాంగ హక్కు : బృందా కరత్


మీడియా సమావేశంలో ఉపాధి కార్మికులతో బృందా కరత్

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నరేగా) ద్వారా కోట్లాది మంది పేదలు ఉపాధి పొందుతున్నారు. అయితే ఉపాధి హామీ చట్టాన్ని మెల్లమెల్లగా నిర్వీర్యం చేసే వ్యూహాన్ని మోడీ సర్కార్ ఎంచుకుంది. కొత్త బడ్జెట్‌లో భారీ మొత్తంలో నిధులకు కోత విధించింది. ఇప్పటికే వేల కోట్ల బకాయిలు 'నరేగా' కింద రాష్ట్రాలకు నిధులు విడుదల చేయాల్సివుంది. పశ్చిమ బెంగాల్‌లో పలు జిల్లాల్లో కార్మికులకు వేతన బకాయిలు ఏడాదికిపైగా ఉన్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నరేగా కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఇటీవల ధర్నాకు దిగారు. ఈనేపథ్యంలో కార్మికులు నిర్వహించిన మీడియా సమావేశానికి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్ హాజరయ్యారు. ఉపాధి హామీ చట్టం..రాజ్యాంగ హక్కు. నరేగా పథకంపై మోడీ సర్కార్ అప్రకటిత యుద్ధం కొనసాగిస్తోందని అన్నారు. ఆమె ఇంకా ఏమన్నారంటే..“దళితుల, ఆదివాసీల ఎన్నో సంవత్సరాల పోరాటంతో ఉపాధి హామీ చట్టం రూపొందింది. దీనిని వీలైనంతమేరకు నిర్వీర్యం చేయాలన్నదే కేంద్రం వ్యూహం. నరేగా, అటవీ హక్కుల చట్టాన్ని ఒక క్రమపద్ధతిలో కేంద్రం నిర్వీర్యం చేస్తోంది. నరేగా కార్మికులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కును తిరస్కరించేందుకు కేంద్రం వేయని ఎత్తుగడ లేదు. కేంద్ర బడ్జెట్‌లో 33 శాతం నిధులు తగ్గించింది. కోవిడ్ సంక్షోభ సమయంలో ఎంతోమంది పేదల్ని ఆదుకున్న పథకం నరేగా” అని చెప్పారు.

2023-24 బడ్జెట్‌లో 'ఉపాధి హామీ' కోసం రూ.60వేల కోట్లు మాత్రమే కేటాయించింది. ప్రస్తుత బడ్జెట్ సవరించిన అంచనాల ప్రకారం నిధుల ఖర్చు రూ.89వేల కోట్లుగా ఉంది. ప్రస్తుతం ఉపాధి పనుల డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుంటే దాదాపు రూ.2.72 లక్షల కోట్లు అవసరం అవుతాయని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు.

భారీగా వేతన బకాయిలు : బృందా కరత్

దేశంలో ఒక్క శాతం ధనికుల వద్ద 40శాతం వనరులున్నాయి. అయినా వారిపై అదనపు పన్ను వేయటం లేదు. మరోవైపు తమ వద్ద నిధులు లేవని, బడ్జెట్ లోటుందని కేంద్రం వాదిస్తోంది. చివరికి గ్రామీణ పేదలే బాధితులవుతున్నారు. ఉపాధి హామీ అమలుజేసిన 20 రాష్ట్రాల్లో వేతన బకాయిలు పేరుకుపోయాయి. అనేకమార్లు రాష్ట్రాలు ఈ అంశాన్ని లేవనెత్తాయి. అయినా కేంద్రం నుండి నిధులు సమయానికి విడుదల కాలేదు. ఉపాధి హామీ కార్మికుల్లో అత్యధికులు దళితులు, గిరిజనులు, మహిళలు. వీరి నుంచి పని తీసుకొని చెల్లింపులు నిలిపివేస్తున్నారు. ఇలా చేయటం నేరం. కార్మికులకు అత్యంత స్వల్ప వేతనాలు దక్కుతున్నాయి. దీనిని కూడా సవరించాలని మేం చాలా రోజులుగా కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాం.

త్రిపురలో ఆగని దాడులు

- వామపక్ష నాయకులతో పాటు జర్నలిస్టులు, ప్రభుత్వ ఉద్యోగుల ఇళ్ల పైనా



అగర్తలా : త్రిపురలో బిజెపి గూండాల దాడులు కొనసాగుతున్నాయి. ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలకు చెందిన ఇళ్లపై పాటు, జర్నలిస్టుల ఇళ్లపై దాడులకు తెగబడుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులపైనా దాడులు చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో త్రిపురలో బిజెపి బొటాబొటీ అధిక్యం సంపాదించింది. ఫలితాలు వెల్లడైన దగ్గర నుంచి గతంకంటే ఎక్కువగా బిజెపి మూకలు ప్రతిపక్షాల ఇళ్లపై దాడులకు పాల్పడుతున్నాయి. ప్రత్యేకించి వామపక్ష కార్యకర్తల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని బిజెపి దాడులకు తెగబడుతోంది. ఈ దాడుల కారణంగా పశ్చిమ త్రిపుర జిల్లాలో 144 సెక్షన్ విధించారు. వామపక్ష నాయకులు, కార్యకర్తల ఇళ్లపైనే కాదు.. జర్నలిస్టుల ఇళ్లపై కూడా దాడులు కొనసాగుతున్నాయి. వామపక్ష కార్యకర్తల ఇళ్లపై జరుగుతున్న దాడులను సిపిఎం తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. జుబారాజ్‌నగర్‌లో కొత్తగా ఎన్నికైన సిపిఎం ఎమ్మెల్యే శైలేంద్రనాథ్‌కు చెందిన రబ్బర్ ప్లాంటేషన్‌కు కాషాయ మూక నిప్పు పెట్టింది. అగర్తలాలోని బదర్‌ఘాట్ ప్రాంతంలో సిపిఎం స్థానిక పార్టీ కార్యదర్శి శ్యామల్ రాయ్ ఇంటిపైనా దాడి జరిగింది. ఇక అగర్తలలోని శ్రీపల్లిలో ప్రముఖ జర్నలిస్ట్ సమీర్ ధర్ ఇంటిపైనా దాడి చేశారు. ఒక్క శ్రీపల్లిలోనే ఐదుగురు సిపిఐ(ఎం) కార్యకర్తల ఇళ్లపై దాడులు జరిగాయి. కుమార్‌ఘాట్ డివిజన్‌లోని పెచర్‌తోల్, దూద్‌పూర్, దస్‌ఘరి ప్రాంతాల్లో బిజెపి దాడికి తెగబడింది. ఇక దూద్‌పూర్‌లో ఇద్దరు సిపిఎం కార్యకర్తలను చితకబాదారు. అలాగే జిరానియా బజార్‌లోని చిత్తరంజన్ పల్లిలో రాణా చక్రవర్తి అనే స్కూల్ టీచర్ ఇంటిపైనా దాడి జరిగింది. ఓ ప్రభుత్వ ఉద్యోగి చేతులు విరగ్గొట్టారు. అతన్ని చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లకుండా కూడా అడ్డుకున్నారు. ఉదయ్‌పూర్‌లో కూడా హింసాత్మక సంఘటనలు జరిగాయని వార్తలొచ్చాయి. బాగ్మా ప్రాంతంలో డివైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బిక్రమ్ ఘోష్ దుకాణాన్ని తగలబెట్టారు. రాజర్‌బాగ్ ప్రాంతంలోని సిపిఎం నేత రాఖల్ మోండల్ ఇంటిపైనా దాడి చేసి ధ్వంసం చేశారు.

గర్జి ప్రాంతంలో 'ప్రోతిబడి కోలోం' అనే స్థానిక దినపత్రికలో పనిచేస్తున్న జర్నలిస్టు ఇంటిపైనా దాడి జరిగింది. అతని రబ్బరు తోటలకు బిజెపి మూకలు నిప్పంటించడంతో అది పూర్తిగా కాలి బూడిదైంది.

దేశ ప్రగతికి మౌలిక సదుపాయాల అభివృద్ధే కీలకం

న్యూఢిల్లీ : దేశ ప్రగతికి మౌలిక సదుపాయాల అభివృద్ధి ముఖ్యమైన పాత్ర వహిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. రోడ్డు, రవాణా రహదారుల మంత్రిత్వశాఖ, వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ కలిసి నిర్వహించిన వెబినార్‌లో ప్రధాని నరేంద్రమోడీ శనివారం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఈ ఏడాది బడ్జెట్ మౌలిక సదుపాయాల రంగానికి కొత్త వృద్ధి శక్తినిస్తుంది. దేశాభివృద్ధి ప్రక్రియలో మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎల్లప్పుడూ మూలస్తంభంగా వుంటుంది. నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ కింద రాబోయే కాలంలో రూ. 110 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి వాటాదారునికి కొత్త బాధ్యతలు, కొత్త అవకాశాలు, సాహసోపేతమైన నిర్ణయాలకు ఇది సరైన సమయం అని ఆయన అన్నారు. అలాగే ఈ వెబినార్‌లో ప్రధాని మోడీ ప్రతిపక్షాలను దుయ్యబట్టారు. 'మునుపటి ప్రభుత్వాలు దేశంలోని మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. అదే ఈ ప్రభుత్వం పేదరికం, ఆధిపత్యం ఆలోచనను తొలగించేందుకు మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తోంది. 2014తో పోలిస్తే నేడు జాతీయ రహదారుల సగటు వార్షిక నిర్మాణం రెట్టింపు అయింది. 2014కి ముందు ప్రతి సంవత్సరం 600 రూట్ కిలోమీటర్ల రైలు మార్గం విద్యుదీకరించబడేది. నేడు అది దాదాపు 4,000 కిలోమీటర్లకు పెరిగింది. విమానాశ్రయాల సంఖ్య 2014కి ముందు 74 ఉంటే.. ఇప్పుడు దాదాపు 150 వరకు ఉన్నాయి' అని ఆయన అన్నారు.

సిసోడియాకి దక్కని ఊరట

- కస్టడీ మరో రెండు రోజులు పొడిగింపు
- ఈ నెల 10కి బెయిల్ పిటీషన్ విచారణ వాయిదా
- మాగుంట రాఘవకు కస్టడీ మరో 14 రోజులు పొడిగింపు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణం కేసులో సిబిఐ అరెస్టు చేసిన ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కస్టడీని మరో రెండు రోజుల పాటు రౌస్ ఎవెన్యూ కోర్టు పొడిగించింది. దీంతో ఈనెల 6 వరకూ సిసోడియా సిబిఐ కస్టడీలోనే కొనసాగుతారు. ఈ కేసులో తనకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను కూడా కోర్టు ఈనెల 10కి వాయిదా వేసింది. సిసోడియా బెయిల్ అభ్యర్థనపై సిబిఐకి కోర్టు నోటీసులు పంపింది. సిబిఐ ఐదు రోజుల కస్టోడియల్ రిమాండ్ శనివారంతో ముగియడంతో ఆయనను భారీ భద్రత మధ్య కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా సిబిఐ హెడ్‌క్వార్టర్స్ ముందు ఢిల్లీ పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిఆర్‌పిఎఫ్ బలగాలు మోహరించాయి. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆయనను కోర్టుకు హాజరుపరచగా, మరో మూడు రోజుల సిబిఐ కస్టడీని కోర్టు కోరింది. కస్టడీ పొడిగించాలని సిబిఐ కోరడం సరికాదని సిసోడియా తరపు సీనియర్ న్యాయవాది దయన్ కృష్ణన్ వాదించారు. సిబిఐ 9 నుంచి 10 గంటల సేపు సిసోడియాను కూర్చోపెట్టి, అడిగిందే పదేపదే అడుగుతూ వచ్చిందని, ఇది మానసికంగా వేధించడమేనని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ఎప్పుడు విచారణకు పిలిచినా వస్తా: సిసోడియా

సిబిఐ ఎప్పుడు విచారణకు పిలిచినా తాను హాజరయ్యేందుకు సిద్ధమని సిసోడియా తెలిపారు. ఈ కేసులో సిబిఐ స్వాధీనం చేసుకున్నవన్నీ ఆ ఏజెన్సీ దగ్గరే ఉన్నందున తనను కస్టడీలో ఉంచడం వల్ల ఎలాటి ప్రయోజనం ఉండదని బెయిల్ పిటిషన్‌లో సిసోడియా పేర్కొన్నారు.

సిసోడియా సహకరించడం లేదు

దీనికి ముందు, ఎక్సైజ్ పాలసీ కుంభకోణం కేసులో విచారణకు సిసోడియా సహకరించడం లేదని సిబిఐ ఆరోపించింది. సిసోడియా కార్యాలయం నుంచి గత జనవరిలో ఒక కంప్యూటర్‌ను సీజ్ చేశామని, ఆ కంప్యూటర్ నుంచి ఫైళ్లు, ఇతర డాటా తొలగించినట్టు కనుగొన్నామని సిబిఐ వర్గాలు తెలిపాయి. తొలగించిన ఫైళ్లను రిట్రైవ్ చేసేందుకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని, కంప్యూటర్ నుంచి డిలీట్ చేసిన మొత్తం ఫైల్‌ను రిట్రైవ్ చేయడంతో పాటు ఇందుకు సంబంధించిన నివేదికను ఎఫ్‌ఎస్‌ఎల్ ఇచ్చిట్టు సిబిఐ అధికారులు తెలిపారు.

అలాగే, ఢిల్లీ మద్యం కుంభకోణంలో మాగుంట రాఘవ రెడ్డి జ్యూడిషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ సిబిఐ కోర్టు పొడిగించింది. మరో 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ పొడిగిస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది. అంతకుముందు మాగుంటను అధికారులు కోర్టులో హాజరుపరిచ్చారు. రాఘవరెడ్డి తండ్రి ఎంపి మాగుంట శ్రీనివాస్ రెడ్డి కూడా కోర్టుకు హాజరయ్యారు. కేసు దర్యాప్తు పురోగతిలో ఉందని మాగుంట రాఘవ జ్యుడిషియల్ కస్టడీ పొడిగించాలని కోర్టును ఈడి కోరింది. ప్రస్తుతం మాగుంట తీహార్ జైలులో ఉన్నారు. మార్చి 13న మాగుంట రాఘవ బెయిల్ పిటిషన్‌ను రౌస్ అవెన్యూ కోర్టు విచారించనుంది. ఈ కేసుకు సంబంధించి ఫిబ్రవరి 10న మాగుంట రాఘవరెడ్డిని ఈడి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

అంతర్జాతీయ సహకారాన్ని విస్తరించాం

- దేశ హక్కులను కాపాడుకున్నాం
- సిపిపిసిసి వార్షిక సమావేశాలు ఆరంభం

బీజింగ్ : చైనా అత్యున్నత రాజకీయ సలహా సంస్థ శనివారం తన వార్షిక సమావేశాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ మాట్లాడుతూ, అంతర్జాతీయ సహకారాన్ని విస్తరించడంలో సాధించిన విజయాన్ని నొక్కి చెప్పారు. అలాగే బయట నుండి ఒత్తిళ్లు వచ్చినపుడు దేశ హక్కులను కాపాడుకోవడంలో కూడా విజయం సాధించామన్నారు. చైనా ప్రజల రాజకీయ సంప్రదింపుల సమావేశం (సిపిపిసిసి) 14వ జాతీయ కమిటీ మొదటి సమావేశానికి జిన్‌పింగ్, ఇతర చైనా నేతలు హాజరయ్యారు. ఇక్కడి గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో ఈ సమావేశం జరిగింది. 13వ జాతీయ కమిటీ ఛైర్మన్ వాంగ్ యాంగ్ సమావేశంలో స్థాయి సంఘం కార్యకలాపాల నివేదికను అందచేశారు. గత ఐదేళ్లలో రాజకీయ సంప్రదింపులపై సిపిపిసిసి జాతీయ కమిటీ 105 కీలక కార్యకలాపాలను నిర్వహించిందని వాంగ్ చెప్పారు. చైనా-ఆఫ్రికా ఫ్రెండ్‌షిప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయడం ద్వారా అంతర్జాతీయ మార్పిడులను కూడా పరస్పరం విస్తరించామన్నారు. దీనివల్ల విదేశీ దూతలు, విద్యార్థులు సిపిపిసిసి గురించి మరింత ఎక్కువగా తెలుసుకోవడానికి అవకాశం వుంటుందన్నారు. అంతర్జాతీయ మార్పిడులను పెంచడానికి చైనా ఆర్థిక సామాజిక మండలి, మతం, శాంతిపై చైనా కమిటీ, ఇతర సంస్థలకు మద్దతిస్తున్నామని చెప్పారు. జిన్‌జియాంగ్, జిజాంగ్, హాంకాంగ్ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పశ్చిమ దేశాల దాడులు పెరిగిన నేపథ్యంలో దేశ సార్వభౌమాధికారం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాలను పరిరక్షించుకునేలా సిపిపిసిసి గట్టి హెచ్చరికలు, ప్రకటనలు చేసింది. బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ వంటి అంశాలపై చర్చించేందుకు ముందుకు రావాల్సిందిగా విదేశాల్లోని చైనీయులను ఆహ్వానించింది.





హ్యూగో చావెజ్ లేకుండా దశాబ్ద కాలం !

కారకస్ : వెనిజులా అధ్యక్షుడిగా ఆ దేశ రాజకీయాలపై చెరగని ముద్ర వేసిన హ్యూగో చావెజ్ మరణించి దశాబ్దం కావస్తోంది. కనివినీ ఎరుగని సవాళ్ళు ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో మన ప్రియతమ కమాండర్ చావెజ్‌ను ఎంతో సంతోషంతో, దేశభక్తియుత ఉత్సాహంతో, విప్లవాత్మక నిబద్ధతతో గుర్తుంచుకోవాలని అధ్యక్షుడు నికొలస్ మదురో ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. వర్తమానానికి, భవిష్యత్‌కు సవాలుగా ఆయన నిలిచారని అన్నారు. 21వ శతాబ్దపు దృక్పథంతో వెనిజులా ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. వెనిజులాలోని సబనెటా డె బరినస్‌లో 1954 జులై 28న జన్మించిన చావెజ్‌కు చిన్న తనం నుండే బేస్‌బాల్ క్రీడ అంటే ఇష్టం. చిత్రలేఖనం, సంగీతం, సృజనాత్మక రచనలు, నాటకాలు అంటే ఆయనకు ఎనలేని మక్కువ. చిన్నతనంలో నాయనమ్మ ఒడిలోనే ఆయన రాయడం,చదవడం నేర్చుకున్నారు. 'ఆరనాస్'గా అందరికీ తెలిసిన ఫ్రూట్ బాంబ్ కేండీలను అమ్మడం ద్వారా చిన్నారి చావెజ్ తన కుటుంబానికి సాయపడేవాడు. 1971లో సైన్స్ డిగ్రీ తీసుకున్న తర్వాత నాలుగేళ్ళ పాటు మిలటరీ అకాడమీలో చేరారు. అక్కడ ఆర్టిలరీ సెకండ్ లెఫ్టినెంట్ ర్యాంక్‌తో గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. 1999 ఫిబ్రవరి 2న దేశ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. 2006లో తిరిగి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. 2013-19 కాలానికి కూడా ఆయన అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. అయితే, ఆ ఏడాదే (2013) ఆయన మరణించారు.

దగ్గు వస్తే విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్ వాడొద్దు

న్యూఢిల్లీ : దగ్గు, జలుబు, వికారం వంటి చిన్నపాటి అస్వస్థతలకు అజిత్రోమైసిన్, అమోక్సిక్లా వంటి యాంటీబయాటిక్స్‌ను విచక్షణారహితంగా వాడరాదని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ఈ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఐఎంఎ హెచ్చరికలు జారీ చేసింది. కొద్ది రోజులుగా దేశవ్యాప్తంగా నిరంతర దగ్గు, కొన్ని సందర్భాల్లో జ్వరం, ఒళ్లు నొప్పుతో కూడిన దగ్గు కేసులు నమోదవుతున్నాయి. అయితే ఇవన్నీ సీజనల్‌గా వచ్చేనని, కాకపోతే వీటిలో కొన్ని కేసులకు 'ఇన్‌ఫ్లుయెంజా ఏ' ఉప రకం 'హెచ్3ఎన్2' వైరస్ కారణమవుతోందని ఐఎంఎ పేర్కొంది. ప్రస్తుతం వస్తున్న దగ్గులకు హెచ్2 ఎన్2 కారణమవుతోందని భారత వైద్య పరిశోధన మండలి (ఐసిఎంఆర్) నిపుణులు కూడా వెల్లడించారు. గత రెండు, మూడు నెలలుగా ఇది విస్తతంగా వ్యాప్తిలో ఉందని తెలిపారు. ఇతర సబ్‌టైప్‌లతో పోల్చితే ఇది ఎక్కువగా ఆసుపత్రిలో చేరికలకు కారణమవుతోందని చెప్పారు. 'ఈ ఇన్ఫెక్షన్ ప్రభావం సాధారణంగా అయిదు నుంచి వారం రోజుల వరకు ఉంటుంది. మూడు రోజుల్లో జ్వరం తగ్గిపోతుంది. దగ్గు మూడు వారాల వరకు ఉంటుంది. 15 ఏళ్లలోపు, 50 ఏళ్లు పైబడిన వారు ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువ. వాయు కాలుష్యం కూడా కేసుల పెరుగుదలకు కారణమవుతోంది' అని ఐఎంఐ తెలిపింది. ఈ ఇన్ఫెక్షన్లతో బాధపడుతోన్న రోగులకు యాంటీబయాటిక్స్ కాకుండా రోగ లక్షణాలకు మాత్రమే చికిత్స అందించాలని వైద్యులకు సూచించింది. 'ప్రస్తుతం ప్రజలు అజిత్రోమైసిన్, అమోక్సిక్లావ్ వంటి యాంటీబయాటిక్స్‌ను విచక్షణారహితంగా వాడుతున్నారు. ఇది యాంటీబయాటిక్స్ నిరోధకతకు దారి తీస్తుంది. కాబట్టి, వాటి వాడకాన్ని నిలిపేయాలి. లేనిపక్షంలో, అవసరమైన సందర్భాల్లో అవి పనిచేయకుండా పోయే తీవ్ర ప్రమాదం ఉంది' అని ఐఎంఎ హెచ్చరించింది. డయేరియా, మూత్రనాళ ఇన్ఫెక్షన్ల చికిత్సకు ఉపయోగించే అమోక్సిసిలిన్, నార్‌ఫ్లోక్సాసిన్, ఒప్రోఫ్లోక్సాసిన్, ఆఫ్లోక్సాసిన్, లెవోఫ్లోక్సాసిన్ వంటి యాంటీబయాటిక్స్‌లను విపరీతంగా వాడుతున్నారని తెలిపింది. 'కొవిడ్ సమయంలో అజిత్రోమైసిన్, ఐవర్‌మెక్టిన్‌లను విస్తతంగా వినియోగించారు. ఇది కాస్త.. యాంటీబయాటిక్ నిరోధకతకు దారితీసింది. ఈ నేపథ్యంలో రోగులకు యాంటీబయాటిక్స్ సూచించే ముందు.. అది బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షనా? కాదా? అని నిర్ధారించుకోవడం అవసరం' అని ఐఎంఎ తెలిపింది.

వలస కార్మికులందరూ క్షేమం

- వదంతులు నమ్మవద్దు
- తమిళనాడు సిఎం స్టాలిన్



చెన్నయ్ : తమిళనాడులో ఉత్తరాది వలస కార్మికులు, ముఖ్యంగా బీహార్‌కు చెందిన కార్మికులపై దాడులు జరిగాయంటూ సామాజిక మాధ్యమాల్లో వందతులు చక్కర్లు కొట్టడంతో ముఖ్యమంత్రి స్టాలిన్ అప్రమత్తమయ్యారు. తమ రాష్ట్రంలో వలస కార్మికులందరూ సురక్షితంగా ఉన్నారని స్టాలిన్ స్పష్టం చేశారు. ఈ విషయమై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తోనూ ఆయన ఫోన్‌లో మాట్లాడారు. బీహార్ నుంచి తమ రాష్ట్రానికి వచ్చిన కార్మికులందరూ క్షేమంగా ఉన్నారని తెలియజేశారు. నితీష్‌తో మాట్లాడిన విషయాన్ని స్టాలిన్ సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. ఉత్తరాది రాష్ట్రాల కార్మికులు తమ రాష్ట్రంలో పని చేయడంపై ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని ఆయన భరోసానిచ్చారు. వదంతుల ద్వారా భయభ్రాంతులకు గురిచేసేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తమిళనాడులో ఇతర రాష్ట్రాల కార్మికులపై దాడులు జరుగుతున్నాయంటూ వదంతులు వ్యాప్తి చేయడం దేశ వ్యతిరేకమని, అవి జాతీయ సమగ్రతకు భంగం కలిగిస్తున్నాయని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. వేరే రాష్ట్రాల్లో జరిగిన కొన్ని ఘటనలను తమిళనాడులో జరిగినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని సహించలేని కొందరు.. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే ఉద్దేశంతో తమిళుల సంస్కృతిని కించపరిచే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అయితే, వారి ప్రయత్నాలు ఫలించవన్నారు. ఒకవేళ ఎవరైనా దాడుల వంటి ఘటనలకు యత్నిస్తే.. వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

భయాందోళనలో క్రిస్టియన్లు

- బలవంతపు మతమార్పిడి ఆరోపణలతో దాడులు
- ప్రధాని మోడీకి మాజీ ఉన్నతాధికారుల లేఖ

న్యూఢిల్లీ : దేశంలోని క్రిస్టియన్ సమాజంలో భయానక వాతావరణం నెలకొని ఉన్నదని మాజీ బ్యూరోకాట్లు ఆందోళన వ్యక్తం చేశారు. వారిపై బలవంతపు మత మార్పిడి ఆరోపణలతో ఆ వర్గం ప్రజలు పూర్తి వివక్షను ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ మేరకు ప్రధాని మోడీకి 93 మంది మాజీ ఐఎఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు లేఖ రాశారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో చట్టం, పరిపాలనా పరంగా క్రిస్టియన్ సమాజానికి భరోసానివ్వాలని లేఖలో వారు కోరారు. ప్రధానంగా క్రిస్టియన్ సమాజంపై ఉన్న ఆరోపణ బలవంతపు మార్పిళ్లు అనీ, 1951 జనాభా లెక్కల నుంచి చూస్తే మాత్రం ఇది దాదాపు 2.3 శాతంగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ ఆరోపణతోనే క్రిస్టియన్ సమాజం భౌతికంగా, మానసికంగా, మాటల రూపంలో దాడులకు గురైందని వివరించారు. ఈ దాడులు వ్యక్తులు, వారికి చెందిన సంస్థల పైనా జరిగాయన్నారు. విద్యా, వైద్య రంగంలో, సామాజిక సంస్కరణల్లో క్రిస్టియన్ల సహకారాన్ని మాజీ ఉన్నతాధికారులు ఉటంకించారు. ఇప్పటికీ క్రిస్టియన్లతో పాటు అన్ని మైనారిటీల ప్రజలు తమ సొంత దేశంలో అనామకులుగా ఉంటున్నారని వివరించారు. వారి సొంత విశ్వాసాలను పాటించడంలో అపరాధ భావంతో ఉండాల్సిన పరిస్థితులున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ అగ్రనాయకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఒక్క మాటతో మైనారిటీలపై హింసను ఆపగలమని మాజీ బ్యూరోకాట్లు వివరించారు.

గోవధను నిషేధించండి

- ఆవును జాతీయ రక్షిత జంతువుగా ప్రకటించండి
- కేంద్రాన్ని కోరిన అలహాబాద్ హైకోర్టు

న్యూఢిల్లీ : దేశంలో గోవధపై అలహాబాద్ హైకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. గోవధను నిషేధించాలని కేంద్రాన్ని కోరింది. ఆవును జాతీయ రక్షిత జంతువుగా ప్రకటించాలని తెలిపింది. గోవధ, అమ్మకానికి ఆవును తరలించినందుకు తనపై దాఖలైన క్రిమినల్ కేసును కొట్టివేయాలని పిటిషనర్ మహ్మద్ అబ్దుల్ ఖాలిక్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అహ్మద్ విచారణ జరిపారు. పిటిషనర్ అభ్యర్థనను న్యాయమూర్తి తిరస్కరించారు. ఈ మేరకు కేంద్రాన్ని పైవిధంగా అభ్యర్థించారు. “ మనం లౌకిక దేశంలో ఉంటున్నాం. హిందూ మతంతో పాటు అన్ని మతాల విశ్వాసాలను మనం గౌరవించాలి” అని న్యాయమూర్తి అన్నారు. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతూ ఎంతో కాలంగా హిందూ సంస్థలు డిమాండ్లు చేస్తున్నాయి. కొన్ని హిందూత్వ శక్తులైతే గోరక్షణ పేరుతో మైనారిటీలపై దాడులకు తెగబడుతున్న ఘటనలు దేశంలో చాలానే ఉన్నాయి. ముఖ్యంగా, బీజేపీ నాయకులు ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 2017లో రాజస్థాన్ హైకోర్టు కూడా ఇదే విధమైన వ్యాఖ్యలు చేసింది. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలన్న పిటిషన్ విచారణను గతేడాది అక్టోబర్‌లో సుప్రీంకోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే.

హర్యానాలో రోడ్డు ప్రమాదం.. ఏడుగురు మృతి

అంబాలా : హర్యానాలోని అంబాలాలోని వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించారు. యమునా నగర్-పంచకుల హైవేపై ట్రక్కు బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మరో నలుగురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. షాజాద్‌పూర్ పోలీస్ అధికారి బీర్ బహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ట్రక్ డ్రైవర్ నిద్రమత్తులో బస్సుపైకి దూసుకెళ్లినట్లు తెలిపారు. రెండు వాహనాల డ్రైవర్లు ప్రమాదం నుంచి బయటపడినట్లు తెలిపారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.






మీకోసం

కందిపప్పు నిల్వ చేసుకునే డబ్బాలో ఎండుకొబ్బరి వుంచితే పప్పు త్వరగా పాడవ్వదు.

జీవన సౌరభం

ఆదర్శాలు గొప్పవైనంత మాత్రాన ప్రయోజనం ఉండదు. వాటిని ఆచరణలో పెట్టినప్పుడే సార్థకత.

ప్రోత్సాహం



భావన, మేఘన మంచి స్నేహితులు. పరీక్షలు పూర్తవడంతో భావన భయపడుతూనే తన ప్రోగ్రెస్ కార్డును తీసుకొచ్చి తల్లి సుజాతకు ఇచ్చింది. ఆ మార్కులు చూసి తల్లి భావనను తిట్టింది.'ఎప్పుడు చూసినా ఏవో పిచ్చిపిచ్చి బొమ్మలు గీస్తూ ఉంటావు. దాని బదులు చదివితే మంచి మార్కులు వస్తాయి.' అన్నది.

భావనకు చిన్నప్పటి నుంచి కనిపించిన ప్రకృతి దృశ్యాలను, పక్షుల, జంతువుల బొమ్మలు గీయడం అలవాటు. అవంటే చాలా ఇష్టం కూడా. ఆ విషయం తల్లికి చెప్పేందుకు భయం వేసి, స్నేహితురాలైన మేఘనకు చెప్పి బాధపడింది.


మేఘన పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి తన తల్లి మమతతో భావన గురించి చెప్పింది.'అమ్మా! భావన చాలా బాగా బొమ్మలు వేస్తుంది. ఎప్పుడు చిత్ర లేఖనం పోటీలు పెట్టిన తనకే మొదటి బహుమతి వస్తుంది'. అంది.

సుజాత, మమత ఫ్యామిలీ ఫ్రెండ్స్ కావడంతో ఫోన్ చేసి తన కూతురు మేఘన చెప్పిన విషయాన్ని సుజాతకు చెప్పింది. 'ఈ రోజుల్లో పిల్లలకు ఏది ఇష్టమో అదే నేర్పించాలి. వారిపై మన అభిప్రాయాలు రుద్దడం మంచిది కాదు. వారికి నచ్చిన పనిని ప్రోత్సహిస్తే... చదువులోనూ రాణిస్తారు' అంది.

ఆ రోజు నుంచి భావన వేసే బొమ్మలను చూసి మెచ్చుకునేది తల్లి. తల్లిలో వచ్చిన మార్పుకు భావన చాలా సంతోషించింది. బొమ్మలతో పాటు చదువులో కూడా మంచి ప్రతిభ చూపించింది. తన స్నేహితురాలు సంతోషంగా ఉండడంతో మేఘన కూడా చాలా సంతోషించింది.

- సారంగి మహిత,
9 వ తరగతి, జెడ్పీహెచ్ ఎస్,
మేళ్లచెర్వు, సూర్యాపేట.

లెక్క తేల్చండి



చిన్నారులూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

నేను గీసిన బొమ్మ



- పి. నాగచరణ్,
7వ తరగతి,
జడ్. పి. ఉన్నత పాఠశాల,
మైదుకూరు,
కడప జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పరీక్షలంటే శిక్ష కాదు... మీ సత్తా తెలుసుకునే అవకాశం

పరీక్షల సీజన్ మొదలయ్యింది. విద్యార్థుల్లోనే కాదు తల్లిదండ్రుల్లో కూడా ఆందోళన మొదలవుతోంది. పరీక్షలు ఎలా రాయాలో, ఎలా రాస్తానో అని విద్యార్థులు... ఎలా రాస్తారో అని తల్లిదండ్రులు ఆందోళన పడుతుంటారు. దీన్నే టెస్ట్ యాంగ్జయిటీ అంటారు. ఒక మోతాదు వరకూ టెస్ట్ యాంగ్జయిటీ ఉండటం మంచిదే. అది పరీక్షలకు సిద్ధమయ్యేలా చేస్తుంది. అయితే మోతాదు మించితే మాత్రం మొదటికే మోసం వస్తుంది. నేర్చుకున్న విషయాలు కూడా మర్చిపోయే ప్రమాదం ఉంది.



అసలు పరీక్షలంటే ఎందుకంత భయం? అని ఆలోచిస్తే... పేరెంట్స్, టీచర్స్ వల్లేనని అర్థమవుతుంది. పరీక్షలంటే భూతంలా చూపిస్తూ... నేర్చుకోవడం కంటే, పరీక్షల్లో వచ్చే మార్కులకే ప్రాధాన్యతనిస్తూ... పిల్లల్లో పరీక్షలంటే తెలియని భయం క్రియేట్ చేస్తారు. సరిగా ప్రిపేర్ కాకపోవడం లేద గత పరీక్షల్లో ఆశించిన మార్కులు రాకపోవడం వల్ల కూడా పరీక్షలంటే భయం ఏర్పడుతుంది. ఆ పరీక్షలు తప్పించుకునేది మనసు రకరకాల వేషాలు వేస్తుంది. అనారోగ్యం పాలయ్యేలా చేస్తుంది.

దీనివల్ల తలనొప్పి, కడుపునొప్పి, జ్వరం, విపరీతమైన చెమట, ఊపిరి ఆడకపోవడం, గుండె కొట్టుకునే వేగం పెరగడం, తల తిరగడం, స్పృహ తప్పి పడిపోవడం లాంటి శారీరక లక్షణాలు కనిపిస్తాయి. ఇంకా ఒత్తిడి, భయం, నిస్సహాయత, నిరాశ, ప్రతికూల ఆలోచనలు చుట్టుముడతాయి. గతంలో పరీక్ష తప్పిన ఘటనలు పదే పదే గుర్తుకొస్తాయి.

మీరేం చెయ్యాలి?

టెస్ట్ యాంగ్జయిటీని తగ్గించుకోవాలంటే అత్యంత ముఖ్యమైంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మద్దతు. రిజల్ట్స్ కోసం విద్యార్థిపై ఒత్తిడి పెంచకుండా బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇస్తే చాలని భరోసానివ్వాలి.



నిజానికి పరీక్షలంటే... ఒక సబ్జెక్ట్ మీరెంత నేర్చుకున్నారో తెలుసుకునేందుకు, లక్షలాదిమంది విద్యార్థుల్లో మీరెక్కడ ఉన్నారో తెలుసుకునేందుకు ఒక మంచి అవకాశం. అలా ఆలోచిస్తే పరీక్షలంటే భయం తగ్గుతుంది.

'గుడ్ ప్రిపరేషన్ ఈజ్ హాఫ్ డన్' అని ఒక సామెత ఉంది. అందువల్ల ముందుగానే బాగా ప్రిపేర్ అవ్వండి. అలా ప్రిపేర్ అవ్వకపోతే ఎంతవరకు ప్రిపేర్ అయ్యారో దాన్ని పదే పదే రివిజన్ చేయండి.

రివిజన్ అనగానే చాలామంది ఆ సబ్జెక్ట్ మొత్తం మళ్లీ మళ్లీ చదువుతుంటారు. కానీ రివిజన్ అంటే రి-విజన్, అంటే మళ్లీ చూడటం. ముఖ్యమైన అంశాలను మళ్లీ మళ్లీ చూడండి. ఆ అంశానికి సంబంధించిన సమాచారం మొత్తం గుర్తొస్తే ముందుకుసాగండి. ఏదైనా అంశానికి సంబంధించిన సమాచారం గుర్తుకు రాకపోతే ఆ టాపిక్ మాత్రమే మళ్లీ నేర్చుకోండి.

మెదడుకు తగినంత విశ్రాంతి ఉన్నప్పుడే చురుగ్గా పనిచేస్తుంది. కాబట్టి పరీక్షల ముందు నైట్ అవుట్ చేయకుండా రోజుకు కనీసం 7-8 గంటల నిద్ర ఉండేలా చూసుకోండి.

కాఫీ, టీ, సాఫ్ట్ డ్రింకులు పూర్తిగా మానేయండి. రోజూ తగినంత వ్యాయామం చేయండి. మానసిక ఒత్తిడి నుంచి శరీరాన్ని, మనసును కాపాడుకునేందుకు జాకబ్సన్ ప్రోగ్రెసివ్ మజిల్ రిలాక్సేషన్ రోజూ ప్రాక్టీస్ చేయండి.



మీ పరీక్ష సెంటర్ కు కనీసం 30 నిమిషాలు ముందుగా చేరుకోండి. 15 నిమిషాలు ముందుగా పరీక్ష హాల్లో మీ సీట్లో కూర్చోండి. ఐదు నిమిషాలు లోతుగా శ్వాస తీసుకుని రిలాక్సవ్వండి.

భూమితో మీకు శక్తి ప్రసారమవుతున్నట్లుగా ఊహించుకుంటూ మిమ్మల్ని మీరు గ్రౌండింగ్ చేసుకోండి. మీ చుట్టూ ఉన్నవారికన్నా మీరు మెరుగైనవారని విజువలైజ్ చేసుకోండి.

గతంలో మీరు బాగా పెర్ఫార్మ్ చేసిన పరీక్షలను గుర్తు చేసుకోండి. అది మీలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. హాయిగా ప్రశాంతంగా పరీక్ష రాయండి.

- సైకాలజిస్ట్ విశేష్
8019 000066

పచ్చి బొప్పాయి బోలెడు ఉపయోగాలు

బొప్పాయి పండు వల్ల మన శరీరానికి చాలా పోషకాలు అందుతాయని అందరికీ తెలుసు. అయితే పండు బొప్పాయి వల్ల మాత్రమే కాకుండా పచ్చి బొప్పాయి వలన కూడా చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో చూద్దాం..

మెరుగైన జీర్ణక్రియ

పచ్చి బొప్పాయి కాయను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇందులో జీర్ణక్రియకు అవసరమైన గ్యాస్ట్రిక్ ఆమ్లాల స్రావాన్ని పెంచడంలో సహాయపడే పాపైన్ వంటి ఎంజైమ్‌లు ఉంటాయి. ఈ పోషకం హానికర సూక్ష్మజీవులను బయటకు పంపివేయడంలో, కడుపులో టాక్సిన్ లేకుండా చేయడంలో కూడా సహాయకారిగా ఉంటుంది.



మలబద్ధకాన్ని నివారిస్తుంది

బొప్పాయి కాయ తినడం వల్ల మలబద్ధకాన్ని నివారించవచ్చు. ఆకుపచ్చని బొప్పాయి ఫైబర్‌తో నిండి ఉంటుంది. ఇందులోని వివిధ ఆరోగ్యకరమైన ఎంజైమ్‌లు పొట్టను సమర్థవంతంగా శుభ్రపరుస్తాయి. బొప్పాయి ప్రేగు కదలికలను నియంత్రిస్తుంది, తద్వారా మన గ్యాస్ట్రిక్ వ్యవస్థలో అనారోగ్యకరమైన వాయువు ఏర్పడటానికి అనుమతించదు.

కణాల పనితీరులో సహాయపడుతుంది

పచ్చి బొప్పాయి చైమోపాపైన్, పాపైన్ వంటి సహజ ఎంజైమ్‌లు కలిగి ఉంటుంది. ఇవి ప్రోటీన్లు, కొవ్వులు, కార్బోహైడ్రేట్‌లను విచ్ఛిన్నం చేయడంలో సహాయపడతాయి. ఈ ఫైటోన్యూట్రియెంట్‌లు చాలా సందర్భాలలో మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి, ఇవి కొత్త కణాలను నిర్మించడంలో, వాటిని మరమత్తు చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి.

శరీరంలో మంటను తగ్గిస్తుంది

పచ్చి బొప్పాయి తినడం వల్ల గొంతు ఇన్ఫెక్షన్, శ్వాసకోశ ఇన్ఫెక్షన్, ఋతు క్రమ ఇబ్బందులతో సహా శరీరంలో కలిగే అనేక రకాల నొప్పులు, మంట, వాపులను తగ్గించడంలో ప్రభావవంతగా పనిచేస్తుంది.

గుండె ఆరోగ్యానికి మేలు

ఇందులో ఉండే పొటాషియం, ఫైబర్, ఫోలేట్‌లు రక్తపోటును తగ్గించడంలో, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

క్యాన్సర్‌ను నివారిస్తుంది

పచ్చి బొప్పాయి తీసుకోవడం వల్ల పురుషులలో ప్రోస్టేట్, పెద్దపేగు క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులో డైటరీ ఫైబర్ ఉంది, ఇది పెద్దప్రేగులో ఉండే టాక్సిన్స్‌ను తొలగిస్తుంది. ఈ రకంగా పెద్ద పేగు క్యాన్సర్ ముప్పు నుంచి బయటపడేస్తుంది. అయితే పచ్చి బొప్పాయిను తినే ముందు ఉడికించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎవరైనా పచ్చి బొప్పాయిని తినేముందు వైద్యుల సలహా తీసుకోవడం ఉత్తమం.



కెనడా పాప్ సింగ్ ఎపి ఢిల్లాన్



నృత్యం చేస్తున్న బాలీవుడ్ నటి కృతి సనన్



సాంస్కృతిక కార్యక్రమాల్లో ఓ దృశ్యం

ఘనంగా మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభం

అలరించిన ఢిల్లాన్, కృతి, కియరా నృత్యాలు

ముంబయి: భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న మహిళల ప్రిమియర్‌లీగ్(డబ్ల్యుపిఎల్) ప్రారంభోత్సవ వేడుకలు డివై పాటిల్ స్టేడియంలో శనివారం అట్టహాసంగా జరిగాయి. కెనడా పాప్ సింగర్ ఎపి ఢిల్లాన్ పాడిన పాటలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. బాలీవుడ్ నటులు కృతి సనన్, కియారా అద్వానీ స్టేజ్‌పై చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. 'చక్ దే ఇండియా' పాటకు ప్రేక్షకులు స్వరం పలికారు. ప్రధాన వ్యాఖ్యాతగా మందిరా బేడీ వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం కనులు మిరుమిట్లు గొలిపే లేజర్ షోలతో మైదాన ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఐదు జట్ల కెప్టెన్లను స్టేజ్‌పైకి పిలిచి బిసిసిఐ సభ్యులు పరిచయం చేశారు. కెప్టెన్లందరూ కలిసి డబ్ల్యుపిఎల్ ట్రోఫీని ఆవిష్కరించారు.



వ్యాఖ్యాతగా మందిరా బేడీ

హడలెత్తించిన హర్మన్

గుజరాత్‌పై 143 పరుగుల తేడాతో ముంబయి గెలుపు



ముంబయి: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) తొలి లీగ్ మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 207 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో గుజరాత్ జట్టు 64 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ యస్టికా భాటియా(1) నిరాశపరిచినా.. మరో ఓపెనర్ హేలీ మాథ్యూస్(47), స్కీవర్ బ్రంట్(23) కలిసి 2వ వికెట్‌కు 54పరుగులు జతచేశారు. ఆ తర్వాత కెప్టెన్‌హర్మన్‌ప్రీత్ కౌర్(65; 30బంతుల్లో 14ఫోర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడింది. అమేలియా కెర్(45; 24బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్), పూజ వస్త్రాకర్(15; 8బంతుల్లో 3ఫోర్లు) కూడా చెలరేగారు. స్నేహ్ రాణాకు రెండు, వారేహామ్, తనూజ, గార్డినర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో గుజరాత్ బ్యాటర్స్ స్నేహ్ రాణా(29) మాత్రమే రాణించగా.. షేక్ ఇష్కకు నాలుగు వికెట్లు దక్కాయి.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా...)

ముంబయ్ : 207/5 (20 ఓవర్లలో; హర్మన్ 65, అమేలియా 45; స్నేహ్ రాణా 2/43)
గుజరాత్ : 64ఆలౌట్ (15.2 ఓవర్లలో; హేమలత 29; షేక్ ఇష్క 4/11, స్కీవర్ 2/5)

యశస్వి రికార్డు

డబుల్ సెంచరీ, సెంచరీ చేసిన తొలి బ్యాటర్

గ్వాలియర్: ఇరానీ ట్రోఫీలో రెస్టాఫ్ ఇండియా యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీతో కదం తొక్కాడు. దీంతో ఇరానీ ట్రోఫీ చరిత్రలో ఓ డబుల్ సెంచరీ, ఓ సెంచరీ కొట్టిన ఏకైక బ్యాటర్‌గా యశస్వి అరుదైన రికార్డును నెలకొల్పాడు. యశస్వి తొలి ఇన్నింగ్స్‌లో 213పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 144పరుగులు చేశాడు. శనివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన రెస్టాఫ్ ఇండియా జట్టు 246పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ 190 పరుగుల ఆధిక్యతను సంపాదించడంతో మధ్యప్రదేశ్ ముందు 437పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. లక్ష్య ఛేదనలో నాల్గోరోజు ఆట ముగిసే సమయానికి మధ్యప్రదేశ్ జట్టు 2 వికెట్ల నష్టానికి 81పరుగులు చేసింది. మరో 356పరుగులు చేస్తే మధ్యప్రదేశ్ గెలుపొందనుంది.



కబడ్డీ జూనియర్ ప్రపంచ ఛాంపియన్ భారత్

న్యూఢిల్లీ: కబడ్డీ జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను భారత్ వరుసగా రెండోసారి చేజిక్కించుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు 41-32పాయింట్ల తేడాతో ఇరాన్‌ను ఓడించింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత్ 18-19పాయింట్లతో వెనుకబడ్డా.. రెండో అర్ధభాగంలో అద్భుతంగా పుంజుకొని టైటిల్‌ను చేజిక్కించుకోవడం విశేషం. ఈ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వడం ఇది రెండోసారి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68